త్యాగం - ఫలం

ముద్దంశెట్టి హనుమంతరావు

నవోదయ పబ్లిషర్స్
విజయవాడ 2

ప్రచురణ నెం. 85
ప్రథమ ముద్రణ
డిశెంబరు — 64
వెల: రు 2-00

అచ్చు : 'బాలాజీ'

మీతో కొన్ని క్షణాలు

మానవుడు తనంతట తానుగా యెప్పుడూ మారడు. పరిస్థితులే అతణ్ణి మారుస్తాయి. మనం అనుకున్నదానికీ, జరిగిన దానికీ సమన్వయం కుదరక ఒక్కొక్కప్పుడు క్లిష్ట సమస్యలు యెదురవుతూ వుంటాయి. అటువంటి సమయాల్లోనే త్యాగం చెయ్యాల్సిన అవసరం కూడా వస్తుంది. త్యాగం నిస్వార్థమైనదే! కాని, ఫలితం తృప్తికరంగా వుంటేనే ఆ త్యాగానికి విలువ వుంటుంది, ఆ త్యాగశీలి జీవితానికీ సార్థకత యేర్పడుతుంది. ఈ కథవస్తువుకు రూపకల్పన చేసినదే యీ 'త్యాగం – ఫలం.'

ఇందులోని పాత్రల్ని సజీవంగా సృష్టించడానికి నా శాయశక్తులా ప్రయత్నించాను. ఇంతవరకూ నన్నూ, నా రచనల్నీ ఆదరిస్తూ వచ్చిన పాఠకలోకం ఈ నవలనుకూడా సహృదయంతో ఆదరించి, నన్ను ప్రోత్సహిస్తుందని నమ్ముతున్నాను.

ఈ నవల రాయడంలో నన్ను ప్రోత్సహించిన నా మిత్రులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు అర్పిస్తున్నా!

—రచయిత

చిన్నప్పుడే
నాకు దూరమైన
చిట్టి తమ్ముడికి

వేమన పంచాయతీ గ్రంథాలయం,

త్యాగం - ఫలం

గదిలో ఒంటరిగా కూచున్నాడు శేషాచలం. ఆరోజు అతనిలో ఉత్సాహం యెందుకు సన్నగిల్లిందో అతనికే తెలీని స్థితిలో ఓమారు గడిచిన జీవితాన్ని నెమరువేసుకున్నాడు. అంతా ఒక దృశ్య నాటికలా అతని కళ్ళముందు గోచరించింది. అప్రయత్నంగా అతని కళ్లు చెమ్మగిల్లాయి. కళ్ళను ఒత్తుకుని, ఒక్క నిట్టూర్పు విడిచాడు.

“బాబుగారూ, యెవరో ముసల్ది వచ్చిందండీ తమకోసం” అంటూ గదిలోపలికి వచ్చాడు పంతులు. పంతులు యెవరో కాదు.... శేషాచలం దగ్గర చాలా రోజుల్నించి వుంటున్న వంటవాడు. శేషాచలం అతణ్ణి యెప్పుడూ ‘పంతులూ’ అనే సంబోధిస్తాడు.

ఏ ముసలమ్మ తనకోసం వచ్చిందా అన్న ఆలోచనతో ఆత్రతగా బైటికి వచ్చాడు శేషాచలం. పంతులు మళ్ళీ వంటగదికి పోయాడు. శేషాచలం బైటికి వచ్చి ముసలమ్మను చూశాక, ఆమెను యెక్కడో చూసినట్టు గుర్తుకొచ్చింది. కాని, నికరంగా ‘ఫలానావ్యక్తి’ అని జ్ఞప్తికి తెచ్చుకోలేకపోయాడు.

"ఏం కావాలి?" 'నువ్వెవరు?' అని అడిగాల్సిన ప్రశ్నను ఆ విధంగా మార్చి అడిగాడు.

ఆ ముసలిది చిన్నగా మందహాసం చేసింది. 'నన్ను గుర్తుపట్టలేక పోయారా' అన్నభావం ఆ మందహాసంలో నిబిడీకృతమై వుంది.

"సుందరమ్మగారు మిమ్మల్ని వున్నపాటున రమ్మన్నారండీ! ఆవిడకి వంట్లో బాగులేదు....గుండెల్లో విపరీతమైన నొప్పి వచ్చిందట. చాలా బాధపడిపోతున్నారు" అందామె.

ఆమె యెవరో శేషాచలంకి యిప్పుడు గుర్తుకొచ్చింది.

"సరే, నువ్వు వెళ్ళు....యిప్పుడే వస్తానని చెప్పు" అంటూ ఆతృతగా యింటిలోపలికి వెళ్ళిపోయాడు.ముసలమ్మ నిష్క్రమించింది.

సన్నని గ్లాస్కో పంచె, స్వచ్ఛంగా మెరిసిపోతూవుంటే, దానిపై పెద్దాపురం సిల్కులాల్చీ వేసుకొని బయలుదేరాడు శేషాచలం. ఆ దుస్తుల్లో అతడు ఆకర్షణీయంగానే అగుపిస్తున్నాడు. అతని వయస్సు నికరంగా 'యింత' అని చెప్పడం సాధ్యంకాదు. నలభైయేళ్ళ మనిషిలా అగుపిస్తాడుగానీ, నిజానికి అతని వయస్సు సుమారు యాభై యేళ్ళుంటాయి.మనిషి పుష్టిగా, ఆరోగ్యంగా వుండటంవల్లనే అలా అగుపిస్తాడు. చామనచాయ రంగు....నల్లని జుత్తులో అక్కడక్కడ వెండితీగల్లా తెల్లని శిరోజాలు మెరుస్తూ వుంటాయి.

శేషాచలం సుందరమ్మ యిల్లు చేరుకున్నాడు. అప్పటికే సుందరమ్మ భరించరాని బాధతో సతమతమౌతోంది. హృదయాన్ని కరిగించే ఆమె మూలుగులు శేషాచలాన్ని ద్రవింపజేశాయి. అతని స్వంత భార్య అగ్నిసాక్షిగా నలుగురి సమక్షంలో వివాహమాడిన అర్ధాంగి మరణవేదన అనుభవిస్తున్నప్పుడు కూడా అతను యింతగా వ్యధచెందలేదు; ఈ విధంగా చలించిపోలేదు.

"ఏమిటి సుందరం! అంత బాధగా వుందా?" అంటూ ఆమెకు దగ్గరగా కుర్చీని లాక్కుంటూ కూచున్నాడు.

సుందరమ్మ మంచం ప్రక్కనే మరో ఇరువురు స్త్రీలు నుంచుని వున్నారు. ఒకామె రెండేళ్ళ అమ్మాయిని యెత్తుకుని వుంది. ఆ పసిపాప ఇదంతా యేమీ బోధపడనట్టుగా, అయోమయంగా చూస్తోంది.

సుందరమ్మ శేషాచలంకేసి మొహం తిప్పి ఆశగా చూసింది. ఆమె మొహంలో దైన్యం తాండవమాడుతూ వుంటే, నవ్వు తెచ్చుకోడానికి ప్రయత్నించి, పరాజితయై నిట్టూర్చింది.

"వచ్చారా! మీకోసమే చూస్తున్నాను. మీరు నేను బ్రతికివుండగా వస్తారో రారోనన్న భయం వుండేది. ఇప్పుడు ఆ భయంలేదు. మీరొచ్చారు. అంతేచాలు. నాకు గుండెజబ్బు వుందన్న విషయం మీకు తెలిసిందేగా! అకస్మాత్తుగా అది విజృంభించి, నా ప్రాణాలు తోడేస్తోంది. ఈ పర్యాయం నేను బ్రతికి బయట పడతానన్న ధైర్యంకూడా నాలో సన్నగిల్లింది" అంటూ ఆగి గుండెల్ని చేత్తో రాస్తూ, ఓసారి గట్టిగా నిట్టూర్చి "అమ్మాయి వుంటుంది. దాన్ని మీచేతుల్లో పెడుతున్నా: దానికి అన్యాయం చెయ్యరని నాకు నమ్మకముంది. నన్నెంత అనురాగంతో చూసేవారో, దాన్నీ అంత ప్రేమాభిమానాలతో చూడండి. నాలా అది దారితప్పి బ్రతకడం నాకు ఇష్టంలేదు. దాన్ని ఓయింటి దానిగా చేసి, మీ బాధ్యత నిర్వర్తించుకుంటారని నమ్ముతాను" అంది సుందరమ్మ.

"ఛా! అవేం మాటలు సుందరం! ఈ నొప్పి నిన్నేం చేస్తుంది! తగ్గిపోతుందిలే. డాక్టర్ని పిలిపించావా!" అన్నాడు శేషాచలం.

"ఇప్పుడే ఇంజక్షను యిచ్చి వెళ్ళారండీ! మళ్ళీ గంట తర్వాత వస్తానన్నారు" అంది పాపను యెత్తుకునివున్న స్త్రీ.

సుందరమ్మ బాధ భరించలేక చుట్టుకుంటోంది. ఆయాసం అపరిమితంగా వుంది. క్షణక్షణం అమ్మాయివేపే దృష్టిని పోనిచ్చి కంట

తడి పెట్టుకుంటోంది. కన్నీరు చెక్కిళ్ళమీదుగా జారువారుతుంది. పెదాలు వణుకుతున్నాయి.

"రుక్మిణీ! అమ్మాయిని ఓమారు యిలా ఇవ్వవూ?" అంది సుందరమ్మ హీనస్వరంతో. రుక్మిణి పాపను సుందరమ్మకి అందించింది. సుందరమ్మ అతికష్టంమీద పాపను తీసుకుని శేషాచలంకి ఆమెను అందిస్తూ—

"పాపను మీ చేతుల్లో పెడుతున్నాను. ఇంక మీరే దానికి తల్లీ, తండ్రీను" రుద్ధకంఠంతో అంటూ పాపను అందించేసి, ఒక్కసారి గుండెను చేత్తో అదుముకుంటూ 'అమ్మా' అంది సుందరమ్మ. అంతే. అదే ఆమె చివరిమాట అయ్యింది. ఈ లోకాన్ని విడిచిపోయింది.

"సుందరం!" అంటూ పొలికేక పెట్టాడు శేషాచలం. ఆ గొంతులో విషాదం నిండివుంది.

అక్కడున్న స్త్రీలు కంటతడి పెట్టుకున్నారు. పాప మాత్రం యేమీ తెలీక దిక్కులు చూస్తూ యేడుస్తుంది. తల్లి చనిపోయిందని పాపం, ఆ పసి హృదయానికి తెలీదు.

శేషాచలం కళ్ళు నీళ్ళ పర్యంతమయాయి. తన భార్య చనిపోయినప్పుడు యే విధంగా బాధపడ్డాడో, ఇప్పుడుకూడా అదే వ్యధను అనుభవించాడు. కొన్నిక్షణాలు సుందరమ్మ భౌతిక దేహంవేపు చూస్తూ నిశ్చలంగా వుండిపోయాడు. అతని కళ్ళనుండి అశ్రుకణాలు మాత్రం జారి పడుతున్నాయి. ఓసారి పాపవేపు చూశాడు. నిర్మలంగా, అమాయకంగా వున్న ఆ పసిపాప మొహం చూడగానే అతనికి దుఃఖం ఉప్పెనలా పొంగుకొచ్చింది. 'భగవాన్! నా చేతుల్లో యేముంది? నువ్వే యీ పాపకు రక్ష' అని మనసులో అనుకుంటూ "రుక్మిణీ! పాపను పట్టిస్తు

తానికి నీదగ్గరే వుంచు; తరువాత తీసుకువెళ్తాను" అంటూ పాపను రుక్మిణికి అందించాడు. రుక్మిణి కళ్ళు ఒత్తుకుని పాపను అందుకుంది.

శేషాచలం పంచెకొనతో కళ్ళు ఒత్తుకుని లేచి చరచరా బయటికి నడిచాడు. సుందరమ్మకి దహన సంస్కారాది విధులు యథావిధిగా జరిపించాడు.

* * *

ఆ రాత్రి చీకటి గదిలో కూచుని ఆలోచిస్తున్నాడు శేషాచలం.

"బాబూ, దీపం తెచ్చి గదిలో పెడతాను" అంటూ వచ్చాడు పంతులు.

"వద్దు పంతులూ, ఒక్కసారి చెప్పానుగా !" విసుగ్గా అన్నాడు. ఆ పరిస్థితుల్లో చీకటిలో వుండటమే బావున్నట్టనిపించింది గామోసు అతనికి.

అప్పన్న పంతులు అక్కణ్ణించి వెళ్ళిపోయాడు. యజమాని ఆ రోజు యెందుకంత కలవరంగా వున్నారో అర్థంకాలేదు అతనికి. కారణాల కోసం మెదడుకి పని కల్పించాడుగాని, ఇదమిత్థమని తేల్చుకోలేక పోయాడు.

శేషాచలం గత జీవితాన్నంతా ఓమారు దృశ్య నాటికలా కళ్ళ ముందు తెచ్చుకున్నాడు. ఈరోజు తనిట్లా గంభీరంగా, కలవరపాటుతో యేం చెయ్యడమో తెలీని సందిగ్ధంలో పడ్డాడంటే, దానికి కారకులెవరు? ఆత్మవిమర్శ చేసుకున్నాక కారకులెవరూ కాదు; తనే అనిపించింది. అతని స్మృతిపథం కాస్త వెనక్కి మళ్ళింది....పరిసవసమయంలోనే భార్య పోయిందానాడు. తర్వాత యెంతోమంది మళ్ళీ పెళ్ళి చేసుకోమని సలహాలిచ్చారు. తన అక్కకూడా యెన్నోవిధాల చెప్పిచూసింది. కాని, తనకి పెళ్ళి చేసుకోవాలన్న కాంక్ష అప్పట్లో కలుగలేదు. అనాదే

ఆ బుద్ధి పుట్టివుంటే, ఇప్పుడీ విధంగా పరితాపం చెందడం, ఇన్ని విధాల ఆలోచించి మార్గాంతరం కోసం అన్వేషించడం వుండేది కాదేమో!

అవుతే, కొన్నాళ్ళకి తనలోని సహజవాంఛలు తలెత్తాయి. అప్పుడే సుందరమ్మతో పరిచయం యేర్పడింది. వేశ్య అవుతేనేం, సుందరమ్మ మనస్సే వేరు. ఆమె తనని యెంతో గౌరవంగా చూసేది. అటువంటి ఉత్తమురాలు మళ్ళీ జన్మిస్తుందా యెక్కడైనా? ఏమో, తనకి మాత్రం నమ్మకంలేదు. అంత ఉత్తమురాలు గాబట్టే, పరిచయం అనుబంధంగా మారింది. ఏమిటో మరి! ఆమెను చూడకపోతే ఒక్కరోజు వుండలేక పోయేవాడు తను. ఫలితంగా ఆమె ఒక బిడ్డతల్లికూడా అయ్యింది. ఆమె బ్రతికివుంటే, తనకీ ఆలోచనే వుండేది కాదు. ఇప్పుడు యీ అమ్మాయి 'తన పిల్ల' అని చెప్పుకోలేడు ఖర్మ. చెప్పుకుంటే, సభ్యతా సంఘంలో బ్రతకలేడు. చెప్పకండా అమ్మాయిని ఎలా పెంచి పెద్దచెయ్యడమా అన్నదికూడా సమస్య అయి కూర్చుంది. ఎన్ని విధాల ఆలోచించినా, యెంత బుర్ర పాడుచేసుకున్నా మరోమార్గం అగుపించలేదు. అతని కళ్ళముందు కనిపిస్తున్న పరిష్కారమార్గం ఒక్కటే! అనాథశరణాలయం. అవుతే, అందులో పాపను చేర్చడమెలా? తన కూతురని బాహాటంగా చెప్పుకుని చేర్చలేడు. అలా చెప్పుకోగలిగితే అనాథశరణాలయంలో చేర్చడమేం ఖర్మ? తనదగ్గరే వుంచుకునేవాడు.

సుందరమ్మ మరణించడం శేషాచలాన్ని యెంత గాఢంగా ఘాతపర్చిందో, కృంగదీసిందో, పాప పెంపకం కూడా అంత కలవరాన్ని రేకెత్తించింది. పాప భవిష్యత్తు యెలా వుంటుందోనన్న ఆలోచనతో సతమతమయ్యాడు. ఏది యేమైనా వున్న ఒకేఒక్క మార్గాన్ని తప్పకుండా వినియోగించుకోవాలన్న నిర్ణయానికి వచ్చేసి, చప్పునలేచి గది

గబా వీధిలోకి నడిచాడు. తను యెక్కడికి వెళ్తున్నదీ, అప్పన్న వంతుల కైనా చెప్పలేదు.

శేషాచలం తిన్నగా రుక్మిణి యింటికి వెళ్ళాడు. అప్పుడు సమయం రాత్రి యెనిమిదిన్నర దాటివుంటుంది. ఆ సమయంలో శేషాచలం రావడం రుక్మిణికి ఆశ్చర్యం కలిగించింది. ఆమె నీటుగా, ఆకర్షణీయంగా ముస్తాబై, యెవరి రాకకోసమో నిరీక్షిస్తున్నట్టుగా వుంది.

"రండి శేషాచలంగారూ! యేమిటి, ఈ సమయంలో వచ్చారు?" అంది నవ్వుతూనే. సుందరమ్మ ఆరోజే చనిపోయిందికదా అన్న బాధయినా ఆమెలో యెందుకు లేకపోయిందా అని బాధపడ్డాడు శేషాచలం. ఆమె నవ్వులోని గూఢార్థాన్ని యిట్టే గ్రహించేశాడు అనుభవశాలిగాబట్టి. కాని, ఆమె తెలివితక్కువ తనానికి అతనే చిన్నబుచ్చుకున్నాడు.

"నీతో కొన్ని విషయాలు మాట్లాడాలని వచ్చాను రుక్మిణీ!" అన్నాడు నిరుత్సాహంగా కూర్చుంటూ. అతని ధోరణి, ఆ ముఖకవళికలూ చూసి తను పరిహాస ధోరణిలో నవ్వుతూ పలకరించినందుకు అప్పుడు పశ్చాత్తాపపడి చిన్నబుచ్చుకుంది.

"చెప్పండి" అంది వీధివేపు దృష్టి నిలుపుతూనే.

శేషాచలం ఆమె చూపుల్ని గ్రహించేశాడు. ఇంక యెక్కువ కాలం తను అక్కడ వుండటం బావుండదనుకున్నాడు. "మరేమీలేదు రుక్మిణీ! సుందరమ్మకీ, నీకూ చెప్పనలవికాని స్నేహం వుంది. మీ ఇద్దరికీ గల ఆత్మీయత యే అక్కచెల్లెళ్ళకీ వుండదేమో! ఆమె పసిపాపను నాకు అప్పజెప్పి కళ్ళు మూయ్యడం నీకు తెలిసిన విషయమే! పాప భవిష్యత్తు యిప్పుడు నామీద ఆధారపడి వుంది. అవుతే, పాపను యెక్కడ వుంచడం? అన్నది పెద్ద సమస్య అయ్యింది. నాతోపాటు మా యింటికి తీసుకుపోయి పెంచడం సాధ్యంకాదని నీకూ తెలుసు.

సంఘం. సంఘంలో నా గౌరవ మర్యాదలూ అన్నీ చూసుకోవాలి. అందుకే పాపను అనాధశరణాలయంలో చేర్చేయాలని నిశ్చయించు కున్నాను. ఇందులో నీ సహకారం అవసరం. నువ్వు తప్పకుండా సహకరిస్తావనే ఆశిస్తాను" అన్నాడు.

మంచంమీద పరున్న పాపకి మెలుకువ వచ్చింది గామోసు, కెవ్వుమంది. శేషాచలం పాపకేసి ఓసారి దృష్టిని సారించి కళ్ళు ఒత్తు కున్నాడు.

"నేను చెయ్యవల్సిన సహాయం యేమిటో చెప్పండి; తప్పక చేస్తాను" సహృదయంతో వాగ్దానమిచ్చింది.

"మరేమీలేదు రుక్మిణీ! రేపు ఉదయం పదిగంటలకు పాపను తీసుకుని అనాధశరణాలయం దగ్గరికి వచ్చి వుండు. నేనూ అదే సమ యానికి వస్తాను. నేను లోపలికి వెళ్ళిన వెంటనే నాతోపాటు నువ్వూ వచ్చేయాలి. నువ్వేమీ మాట్లాడకూడదు. అన్నీ నేనే చెప్తాను.ఏమంటావు? ఏదో విధంగా పరిష్కారమార్గం చూడాలిగాని, అమ్మాయిని నువ్వయినా యెన్నాళ్ళు పెంచగలవు?" అన్నాడు రుక్మిణి యేం జవాబు చెప్తుందో ననుకొని ఆమె మొహంకేసి చూస్తూ.

రుక్మిణికి ఈ పద్ధతి బాగానే వున్నట్టనిపించింది. లేకుంటే తనైనా పాపను యెన్నాళ్ళు దగ్గర పెట్టుకోగలదు? అన్న అభిప్రాయం ఆమె లోనూ అంతర్గతంగా వుంది.

"అలాగే కానీయండి. ఈ మాత్రం సహాయం చెయ్యలేనా? సుందరమ్మ ఆత్మశాంతికైనా ఈ సహాయం చేస్తాను" దృఢనిశ్చయంతో అంది రుక్మిణి.

"నువ్వు కాదనవని నేనూ అనుకున్నాన్లే. వస్తామరి. రేపు పదిగంటలకంతా వచ్చేయాలి. మర్చిపోకేం; ఇదిగో, ఈ రూపాయి

వుంచు. రిక్షాఛార్జీలకు వస్తుంది" అంటూ జేబునుండి రూపాయితీసి ఆమె కిచ్చాడు. ఓసారి అమ్మాయివేపు దీనంగా చూసి, హృదయం దర్శించి పోతుంటే సంబాళించుకుని లేచాడు. "వస్తా రుక్మిణీ!" అంటూ బైటికి నడిచాడు.

రుక్మిణి ద్వారం దగ్గరకు వచ్చి యెవరికోసమో నిరీక్షిస్తున్నట్టుగా నుంచున్నది.

శేషాచలం వడివడిగా అడుగులు వేసుకుంటూ ఇంటివేపు నడిచాడు. ఇల్లు చేరుకునే వరకూ .అతని మెదడు ఆలోచనలు సాగిస్తూనే వుంది. తన రక్తం పంచుకున్న పసిపాపను, స్వంత కూతుర్ని, తను బ్రతికివుండగా దిక్కులేనిదానివలె అనాథ శరణాలయంలో చేర్పడం అతనిలో అంతులేని ఆవేదనను రేపింది. కాని, యేం చేస్తాడు?సభ్యతకీ, సంఘపు కట్టుబాట్లకీ తలఒగ్గి అలా చెయ్యక తప్పలేదు.

ఆనాటి రాత్రి శేషాచలంకి కంటినిండా నిద్రపట్టలేదు. నిమిష నిమిషానికీ సుందరమ్మే గుర్తుకొస్తున్నది. గుర్తుకొచ్చి నప్పుడంతా అతని గుండెలు యెవరో కలచివేస్తున్నట్టుగా ఫీలయ్యేవాడు. అదిగాకుండా అతనికి మరో పెద్ద సమస్య యెదురయ్యింది.పాపను అనాథశరణాలయంలో చేర్చాలని నిశ్చయించటమైతే చేశాడుగాని, దానివల్ల రాబోయే పరిణామాన్ని మొదట్లో ఊహించలేకపోయాడు. పాప యెవరి బిడ్డ? అని శరణాలయం మేనేజరు ప్రశ్నిస్తే తను యేంచెప్తాడు? తనకి తెలీదని చెప్పాలి. తన గౌరవం కాపాడుకోవడం కోసమైనా అలా చెప్పాల్సిందే! ఇంటిముందు యెవరో నిర్దాక్షిణ్యంగా పడేస్తే, తను కనికరించి తెచ్చినట్టు చెప్పాలి. కాని, రుక్మిణి తన ప్రక్కనే వుంటుంది. ఒకవేళ ఆ పాప తనకీ, రుక్మిణీకీ పుట్టిందనీ, ఆ బంధనం వదిలించుకోవాలని ఈ విధంగా

2)

శరణాలయంలో చేరుస్తున్నమని, ఆయన అనుమానిస్తే? అనుమానించడ మేవిఁటి ? మొహంమీద అడిగినా అడిగేస్తాడు కూడాను. పాప ఎక్కడో దొరికిందని చెప్పినా, రుక్మిణి సంగతి యేం చెప్పడం ? తనకీ, ఆమెకీ వున్న అనుబంధం యేమని చెప్పడం ? కేవలం ఆమె తనకి తెలిసిన వ్యక్తి అని చెబితే నమ్ముతారా వాళ్ళు ? ఉఁహూఁ ! నమ్మరు. అవుతే వున్నది వున్నట్టు చెప్పేయడమా ? అలా చెబితే తన గౌరవం, ప్రతిష్ఠ యేమౌతాయి ? ఉఁహూఁ ! తనతోపాటు రుక్మిణిని తీసుకుపోకూడదు. మరి, అమ్మాయిని మాత్రం యెట్లా తీసుకువెళ్తాడు ? అదీ అసంభవమే! మళ్ళీ తీవ్రంగా యోచనలో పడ్డాడు. అన్నిటికంటె ఉత్తమమైన మార్గం, పాపను రుక్మిణి దగ్గరే వుంచడం. ఈ నిర్ణయమే అతనిలో స్థిర పడిపోయింది అప్పుడే రుక్మిణి దగ్గరికి వెళ్ళాలనుకున్నాడు కాని, సభ్యతగా వుండదనిపించింది. మర్నాడు ఉదయమే వెళ్ళి తన నిర్ణయాన్ని తెలియజేస్తూ, ఆమెను ఒప్పించాడు. రుక్మిణి తప్పనిసరిగ ఒప్పుకుంది.

2

మనిషి తనంతట తాను యెప్పుడూ మారడు; మారలేదు కూడాను. అతణ్ణి మార్చేది పరిస్థితులే. పరిస్థితుల ప్రభావానికి అతనుగాని, ఆమెగాని తల ఒగ్గాల్సిందే ! ప్రతిఘటిస్తే ప్రమాదాలూ, కష్టాలూ అడుగడుగునా దాపురిస్తాయి.

సుందరమ్మ చనిపోయిన రోజు శేషాచలం అనుకున్నాడు తనింక వేశ్యావాటిక పరిసరాలకు పోనని. కాని, అతను తీర్మానించుకున్న

విధంగా జరగలేదు మనం తలచిన విధంగా అన్నీ సక్రమంగా జరిగితే ఇంక 'కష్టం' అన్నపదమే వుండదు జీవితంలో. లోకమంతా స్వర్గ తుల్యంగా వుండేది. అలా వున్నట్టే అవుతే, మానవులు భగవంతుని విస్మరిస్తారని సృష్టికర్త అభిమతమేమోమరి ! కష్టాలు లేకండా జీవితం సాగదు. శేషాచలం మాత్రం మానవాతీతుడా యేమిటి ? పాపను చూడ్డానికి తప్పనిసరిగా రుక్మిణి ఇంటికి వెళ్ళవల్సివచ్చేది అతనికి. ఎంతయినా తన కూతురాయె ! అందుకే వెళ్ళకండా వుండలేకపోయేవాడు.

శేషాచలం రుక్మిణి ఇంటికి వెళ్ళినప్పుడంతా ఆమెలో మాట్లాడేవాడు తప్పనిసరిగ. రుక్మిణి కూడా అతణ్ణి యెంతో ఆదరంతో చూసేది. అతనిలో వున్న వ్యధను పటాపంచలు చెయ్యాలన్న తలంపుతో యెప్పుడూ నవ్వుతూనే మాట్లాడేది. సరదాగా కబుర్లు చెప్పేది. రుక్మిణిని చూస్తుంటే, అప్పుడప్పుడు అతనికి సుందరమ్మ జ్ఞప్తికి వచ్చేది. సుందరమ్మకూడా తననీ విధంగా నవ్విస్తూ, సరదాగా కబుర్లు చెప్తూ వుండేదని అనుకుంటుండేవాడు.

"ఏదో నువ్వయినా వుండబట్టి పాపకి ఆశ్రియం లభించింది రుక్మిణీ ! లేకుంటే, యేమయ్యేదో యెవరు చెప్పగలరు ?" అన్నాడు ఓసారి శేషాచలం రుక్మిణి కళ్ళల్లోకి ఆసక్తిగా చూస్తూ.

అతని చూపులు రుక్మిణిలో సిగ్గును సృష్టించాయి. తట్టుకోలేక పోయిందేమో మరి మొహం దించుకుంది బిడియంగా. "అంత మాటన కండి. పసిపిల్లను పెంచుతున్నందుకు నాకోనూ ఒకవిధమైన ఆనందం వుందిగా !" కిగ్రంటిగా చూస్తూ అంది రుక్మిణి.

ఆమె చూపులకు శేషాచలం తబ్బిబ్బయిపోయాడు. అతని గుండెలు విపరీతంగా కొట్టుకోసాగాయి. మానవసహజమైన బలహీనత అతనిలో ప్రవేశించింది, అతనిలో అణిగి మణిగివున్న వాంఛలు మళ్ళీ

రేకెత్తుతున్నాయంటే, అందులో ఆశ్చర్యం యేమీలేదు. అమ్మాయి గారిని చూడ్డానికి వచ్చినప్పుడంతా ఒక ఆకర్షణీయమైన నిండు విగ్రహం, అపూర్వ సౌందర్యరాశి. అతని కళ్ళముందు మెదుల్తోంది. మాట్లాడుతోంది. నవ్వుతోంది. ఇంక అతని మనస్సు యెలా నిశ్చలంగా వుండగలదు ? అతను సర్వసంగ పరిత్యాగి కాదుగా ? ఆమెకి తేలీకండా అప్రయత్నంగా శేషాచలం మనసును మార్చేసింది రుక్మిణి.

"రుక్మిణీ ! నీతో ఓ విషయం చెప్పాలని వుంది" అన్నాడు ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

"ఏమిటో చెప్పండి" సూటిగా చూస్తూ అంది రుక్మిణి. ఆ చూపులే శేషాచలాన్ని ఇంతవరకు తెచ్చాయి పాపం!

"సుందరం చనిపోయాక ఇంక మరేస్త్రీనీ తాకనని తీర్మానించుకున్నాను రుక్మిణీ ! కాని, నీతోటి యీ పరిచయం నన్ను క్రమంగా మార్చేసింది. నిన్ను చూస్తున్నకొద్దీ, నా హృదయం నా స్వాధీనం తప్పుతుందంటే నువ్వు నమ్మవు. నా మనసులోని మాటను విప్పి చెప్తాను" అంటూ ఆమె చేతులు పట్టుకున్నాడు.

రుక్మిణి తెల్లబోయింది మొదట్లో. శేషాచలం మొహంలోకి సూటిగా చూసింది. ఆమె చేతుల్ని పట్టుకున్న అతని చేతులు వణుకుతుండటం గమనించింది. విదలించుకోలేకపోయింది. అందుకు ముఖ్య కారణం ఆమె వేశ్య. ఆమెకు యెందరో ప్రియులున్నారు. కొత్త కొత్త వాళ్ళు వస్తుంటారు.... పోతుంటారు.... అందులో శేషాచలం ఒకడని అనుకుంది గామోసు ! తెల్లగా మల్లెపువ్వులా నవ్వింది. ఆమె చెక్కిళ్ళు వాడిపోయి వున్నాయిగాని, లేకుంటే యెర్రబడేవే !

"నేనూ అదృష్టవంతురాల్నే నండీ !" అంది నవ్వుతూ మొహం దించుకుని.

శేషాచలం తృప్తిగా మందహాసం చేశాడు. అతని హృదయ స్పందన తగ్గింది. సుందరమ్మ పునర్జన్మ మెత్తినట్టుగా అనుభూతిని పొందాడు.

"గౌరి యేది రుక్మిణీ ?" అన్నాడు సౌమ్యంగా.

"పెరట్లో ఆడుకుంటుంది లెండి. ఆమె విషయంలో మరేమీ బాధ పడ నవసరంలేదు" జవాబిచ్చింది రుక్మిణి.

"అల్బై ! నువ్వుండగా నాకు బాధేవిఁటి ? మళ్ళీ వస్తా" అంటూ ఉత్సాహంగా బైటికి నడిచాడు శేషాచలం.

రుక్మిణి నిండుగా ఓసారి నవ్వుకుంది.

* * *

రోజులు, నెలలు, సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. సుందరమ్మ కూతురు గౌరికి ఇప్పుడు అయిదవయేడు. రుక్మిణి దగ్గరే పెరుగుతుంది. శేషాచలం గౌరిని చూడాలన్న వాంఛతోనయితేనేం, రుక్మిణిని కలుసుకోవాలన్న ఉద్దేశంతోనయితేనేం తరుచూ వెళ్తుండే వాడు. గౌరిని స్కూల్లో చేర్పించాడు. ఆమె ముచ్చటగా రబ్బరు బొమ్మలా వుండేది. ఆమె ముమ్మూర్తులా సుందరమ్మలానే వుంటుందని అందరూ అనేవారు. శేషాచలం కూడా అదే అనుకుంటూవుండేవాడు. పాప కోసం అయ్యేఖర్చులకని పుష్కలంగా రుక్మిణికి డబ్బిచ్చేవాడు శేషాచలం. అప్పుడప్పుడు అదే అదననుకుని ఇంకా అవసరమయ్యే డబ్బు గుంజేది రుక్మిణి.

గౌరిపై మొదట్లో రుక్మిణికి అభిమానానురాగాలు ముమ్మరంగా వుండేవి. సుందరమ్మకీ, రుక్మిణికీ వున్న సన్నిహితత్వమే అందుకు కారణం. కాని, ఆ సాన్నిహిత్యం, ఆప్యాయత యెన్నాళ్ళుంటాయి ? మనుషుల మొహాలు మరుగునపడితే, క్రమంగా మమకారాలు కూడా

మరుగున పడతాయి. సుందరమ్మ విషయంలో కూడా అదే జరిగింది. రుక్మిణి క్రమంగా ఆమెను మర్చిపోయింది. అంతే గౌరిపట్ల అభిమానం, అనురాగం తగ్గాయి. గౌరి పసితనంవల్ల యే విధమైన మారాం చేసినా, సముదాయించడానికి బదులుగా చిరగ్గొట్టేది. నోటికొచ్చినట్టు తిట్టేది. అసహ్యించుకునేది. మెటికలు విరిచేది. ఒకటేమిటి ? సవతి తల్లికంటె హీనంగా ప్రవర్తించేది. పాపం, గౌరి మాత్రం అన్నీ భరిస్తూ వచ్చేది. అంతకంటె ఆ పసిహృదయం చేయగలిగింది మాత్రం ఏముంది గనుక ? ఆమెకి ఏం తెలుసు రుక్మిణి తన తల్లికాదని. ఆమె అంతవరకూ అనుకుంటున్నదంతా రుక్మిణి 'తల్లి' అనీ, శేషాచలం 'తండ్రి' అనీ.

గౌరిపట్ల రుక్మిణికి అభిమానాదరాలు తగ్గిపోయాయని శేషాచలానికి తెలీదు. అసలు అ విషయం ఊహించలేదు కూడాను. రుక్మిణి గౌరిని తన స్వంత కూతురులానే సాకుతుందని అనుకుంటున్నాడు. ఔను మరి ! యెందుకనుకోడు ? శేషాచలం వచ్చేసరికి రుక్మిణి గౌరిని ఎత్తుకుంటుంది....ముద్దులాడుతుంది....ముచ్చటగా మాట్లాడుతుంది....నవ్వుతుంది....గిలిగింతలు పెడుతుంది. అటువంటి రుక్మిణిపై అతనికి యెందుకు దురభిప్రాయం పుడుతుంది ?

కాని, నిజం యెప్పటికీ దాగదు. ఒకనాడు సుందరమ్మ ఇంట్లో పూర్వం పనిచేస్తుండే ముసిల్ది శేషాచలం యింటికి వచ్చింది. శేషాచలం ఆమెను యిట్టే పోల్చుకోగలిగాడు.

"ఏం పోలమ్మా, యేమిటిలా వచ్చావు ? కులాసాయేనా ?" అన్నాడు శేషాచలం చుట్ట నోటినుండి తీస్తూ.

"మాలాంటోళ్ళ కులాసాకేం బాబూ ! ఏదో యిలా వున్నాం. మీతో ఒక్కమాట చెప్పిపోదామని యిలా వచ్చాను" అందామె సవినయంగా.

"ఏమిటో చెప్పు! నాదగ్గర సందేహించడ మెందుకు ?" అన్నాడు శేషాచలం.

"మరేంలేదు బాబూ! గౌరమ్మగార్ని రుక్మిణమ్మగారి దగ్గరుం చారు మీరు. మొదట్లో పాపను బాగానే చూసేదండీ! కాని, యిప్పుడు నానా పాట్లు పెడుతుంది. పాపమా పసిదాన ఏమనగల్దు ? ఆ అనాథ శరణాలయమో, ఏదో వుంది గదండీ. అక్కడ వుంచినా బాగుండేది" ఒక్క గుక్కలో చెప్పుకుపోయింది పోలమ్మ. ఆమె గొంతులో జాలి, సానుభూతి పరిస్ఫుటమయ్యాయి.

ఆమె మాటలు విని శేషాచలం స్తంభించిపోయాడు. తన చెవుల్ని తనే నమ్మలేకపోయాడు. పోలమ్మ చెప్పింది నిజమేనా? అని ప్రశ్నించు కున్నాడు. నిజమే అయ్యుంటుంది. లేకపోతే అబద్ధం చెప్పాల్సిన అవ సరం ఆమెకి ఏముంది ? అయితే రుక్మిణి తన సమక్షంలో నటన చూపు తోందన్నమాట! హూఁ! ఆమె సహజగుణం చూపించుకుందన్న మాట! పాపం, గౌరి యెన్ని బాధలు అనుభవిస్తుందో! ఆ పసి హృద యం యెంత గాయపడుతుందో! ఇవన్నీ ఆలోచిస్తున్న శేషాచలంకి ఒక ప్రక్క రుక్మిణిపై కోపం, మరోవేపు గౌరిపై సానుభూతి వెల్లువగా ప్రవహించాయి.

"ఇప్పటికైనా నాకళ్ళు తెరిచావు పోలమ్మా! చాలా సంతోషం. నీమేలు మర్చిపోలేను. నువ్వింక వెళ్ళు" ఆవేదనను దిగమింగుకుంటూ అన్నాడు శేషాచలం.

"వస్తాను బాబూ మరి!" అంటూ వెళ్ళిపోయింది పోలమ్మ.

శేషాచలం మానసికంగా షాక్ తిన్నాడు. అప్రయత్నంగా ఆలో చనల్లో పడ్డాడు. సుందరమ్మ అతని ముందు నుంచుని కన్నీరు పెట్టు కుంటున్నట్టు, దీనంగా చూస్తున్నట్టు, అతనికి లీలగా గుపించింది.

ఇదంతా అతని భ్రమే అయినా, అప్పట్లో అలా ఫీలయ్యాడు. పాపను సుందరమ్మ తనకి అప్పజెప్పిన దృశ్యం కళ్ళకి కట్టినట్టనిపించింది. చలించిపోయాడు. తనకి తెలీకండా గౌరి అన్యాయానికి గురి అవుతుండటం అతణ్ణి మరింత బాధపెట్టింది. తను ఇప్పుడేం చెయ్యాలి ? తీవ్రంగా ఆలోచన సాగించాడు. ఏమిటో మరి ! అడుగడుగునా అవరోధాలు యెదురవుతున్నట్టే వుండతనికి. ఏం చెయ్యడమో, ఒక నిర్ణయానికి రాలేకపోయాడు. ఈ పరిస్థితుల్లో రుక్మిణిని మందలించడమూ సాధ్యం కాదు. గౌరిని తనయింటికి తెచ్చి వుంచడమూ వీలుకాదు. అలాగని అనాథ శరణాలయంలోనూ చేర్చలేడు. అన్నీ తనకి అసాధ్యమైనవే ! ఆలోచిస్తున్నకొద్దీ అతనికి పిచ్చెక్కుతున్నట్టవుతోంది. చివరికి అతనికి ఒక్కటే మార్గం గోచరించింది. అన్ని సమస్యలకూ దూరంగా వుండాలంటే తను గౌరితోపాటు ఈ ఊరు విడిచిపెట్టడమే శ్రేయోదాయకంగా కనిపించింది. సుందరమ్మకి తనిచ్చిన వాగ్దానం పూర్తిచెయ్యాలంటే అదొక్కటే మార్గం అనుకున్నాడు. అలా జరిగినప్పుడే పాపకి తను న్యాయం చేస్తున్నట్టు. అదే గౌరి భవిష్యత్తుకి సోపానం. అవుతే, తను ఈ ఊరు విడిచి వెళ్ళడం యెలా ? అదీ ఒక సమస్యే ! ఈ సమస్యకి తన పరపతితోగాని, గౌరవంతోగాని పనిలేదు. చాలా కాలంగా వుంటూ వచ్చిన ఊరు వదిలి వెళ్ళడం బాధాకరమైనా, అది తప్పనిసరైనప్పుడు బాధను అణచుకోవాలనుకున్నాడు.

"పంతులూ !" కేకవేశాడు శేషాచలం.

అప్పన్న పంతులు వచ్చాడు.

"ఏం బాబూ పిలిచారా ?" సవినయంగా అన్నాడు.

"ఔనోయ్ !" అంటూ పంతులు మొహంలోకి తీక్షణంగా, పరిశీలనా దృష్టితో చూశాడు. ఆ మొహంలో అమాయకత్వం, ప్రసన్నత. కృతజ్ఞతా భావం పొటమరిస్తున్నాయి. అసలు పంతులంటే మొదట్నుంచీ

శేషాచలంకి మంచి భావం వుంది. అతడంటే నమ్మిక వుంది. అదే కారణంవల్ల పంతులు శేషాచలం దగ్గిర ఇన్నేళ్ళు వుండగలిగాడు.

"ఏంటి బాబూ, అలా చూస్తున్నారు" తెల్లమొహం వేస్తూ అన్నాడు పంతులు శేషాచలం తీవ్రదృక్కులు నిజంగానే అతణ్ణి కలవరపర్చాయి. తను ఏ విషయంలోనైనా తప్పు చేశాడేమోనన్న అనుమానం, భయం కూడా స్ఫురించాయి.

"పంతులూ! నీతో ఒక విషయం చెప్పాలి" అన్నాడు శేషాచలం మెల్లగా.

"చెప్పండి బాబూ!" అన్నాడు పంతులు వినయం వుట్టిపడేట్టు.

"ఇది చాలా రహస్యం. ఎక్కడా పొక్కనీయరాదు"

"నా విషయం మీకు తెలిసిందేకదండీ! ఎందుకు సందేహిస్తున్నారో నాకు అర్థంకాదు. అసలు నేను యెవరి దగ్గర ఏం విన్నా ఆ విషయమే వెంటనే మర్చిపోతాను. అది నేను అలవాటు చేసుకున్నాను"

శేషాచలం క్షణం నిశ్శబ్దం వహించాడు. "నీమీద నాకు బాగా నమ్మకం వుంది పంతులూ! అందుకే నాకు సంబధించిన రహస్యం అరమరిక లేకుండా నీతో చెప్తున్నాను. నీకు తెలుసునో లేదోగాని, సుందరమ్మ అనే వేశ్యతో నాకు సంబంధం వుండేది. మా ఇరువురికీ సహజమైన అనుబంధం ఏర్పడింది. మాకు ఓ అమ్మాయి పుట్టింది. రెండు సంవత్సరాల అనంతరం సుందరమ్మ మరణించింది. అవుతే, అప్పట్లో నేను అమ్మాయిని నా యింటికి తీసుకురాలేకపోయాను. కారణం సంఘానికి భయపడే! నా గౌరవప్రతిష్ఠలు సుంటగలుస్తాయన్న భయంతోనే అలా చెయ్యలేకపోయాను. అందుకే రుక్మిణి అనే మరో ఆవిడ వుంది. ఆవిడ దగ్గిర పాపను వుంచాను. పాపకోసం ఖర్చుయ్యే

డబ్బంతా నేనే ఇస్తున్నాను. అయినాసరే, రుక్మిణి కృతజ్ఞత చూపలేక పోయింది. అమ్మాయిని ప్రస్తుతం నానా హింసలు పెడుతుందని వార్తలు వచ్చాయి. పాపం, వయసులో చిన్నది. ఏం చెప్పుకుంటుంది ? ఎంతయినా నా కూతురుకదా ! నా హృదయం తరుక్కుపోతోంది. ఏం చెయ్యడం పంతులూ ! పాపను పెంచి, ఆమెను ఓ యింటిదానిగా చెయ్యడం నా కర్తవ్యం. ఈ ఊళ్ళోవుంటే ఆపని సాధ్యం కాదనిపిస్తుంది. అందుకే మద్రాసు పోదామని అనుకుంటున్నాను. అక్కడ నా స్నేహితుడొకడు వున్నాడు. వాడు నాకు సాయపడతాడని నా నమ్మకం. నువ్వు నాతో వచ్చేస్తావా ?" అని ముగిస్తూ, ప్రశ్నార్థకంగా పంతులు మొహం కేసి చూశాడు శేషాచలం.

అప్పన్న పంతులు ఆశ్చర్యంతో కళ్ళప్పగించి క్షణంసేపు స్తంభించిపోయినట్టుగా యజమానివేపు చూశాడు. అతని నోట చప్పున మాటరాలేదు. యజమానికి తనపై యెంత నమ్మకముంది ? లేకుంటే స్వవిషయం, అదీ రహస్యం తనతో చెప్తాడా ! నిజంగా అతను ఎంత సహృదయుడు ? ఇప్పుడాయనతో వెళ్ళకుండా తనుమాత్రం వుండగలడా ? ఇన్నేళ్ళు ఆయన దగ్గరవున్నా ఒక్కనాడు కూడా యింట్లో నౌకరులా తనని చూశ్శేదే ! ఒక ఆత్మీయునిలా, బంధువులా చూస్తున్నాడు. ఆయనలాంటి వ్యక్తులు ఈ విశ్వంలో ఎంతమంది వుంటారు ? అటువంటి సహృదయుణ్ణి విడిచి తను మాత్రం వుండగలడా ? ఆయన మద్రాసుకాదు, అండమాను దీవులకు పోయినా తను అతణ్ణి అనుసరించవల్సినవాడే ! తనకి మాత్రం ఇంకెవరున్నారు ? అతనే తనకి యజమాని.... అతనే తన బంధువు.... అతనే తన మిత్రుడూను అనుకున్నాడు పంతులు.

"అలా అడుగుతారేవిఁటి బాబూ ! మిమ్మల్ని విడిచిపెట్టి నేను

మాత్రం ఇంకెక్కడికి పోతాను. మీకు తెలీందేముంది! నా కింకెవ రున్నారు గనుక?" అన్నాడు.

శేషాచలం మాటవరుసకే అలా అడిగాడుగాని, పంతులు లేకుండా తనూ జీవించలేడు. ఆ అనుబంధం అలా ఏర్పడిపోయింది. పంతులు యెంతో నమ్మకస్తుడు. మంచివాడూను. అందుకే అతణ్ణి విడువ లేడు.

"నీ అభిప్రాయం తెలుసుకోవాలనే అలా అడిగాను పంతులూ! నువ్వు నాతో వుండటం నాకు మరీ ఆనందం. మనం ఒక వారంరోజుల్లో యిక్కణ్ణుంచి మకాం యెత్తేస్తున్నాం. ఈ విషయం మనిద్దరికి తప్పించి ఇంకెవ్వరికీ తెలీకూడదు. నా వ్యవహారాలన్నీ చక్కబెట్టుకున్నాక నీకు చెప్తాలే. ఇప్పట్నుంచే సామాన్లన్నీ సిద్ధం చేస్తూవుండు. మన ప్రయాణం రహస్యంగా వుంచమని ఊరికినే అనలేదు. అందుకు కారణా లున్నాయి. తర్వాత చెప్తాను" అంటూ ముగించాడు శేషాచలం.

"సరేలెండి బాబూ!" అనేసి పంతులు అక్కణ్ణుంచి పోయి తన పనుల్లో నిమగ్నుడయ్యాడు.

శేషాచలంకి ఆ ఊళ్ళో చాలామంది స్నేహితులున్నారు. వారిలో వెంకటారావు ముఖ్యుడు. ఈయన్ని శేషాచలం ప్రాణస్నేహితుడిగా, ఆత్మీయుడిగా భావిస్తాడు. వీళ్ళిద్దరికీ దూరపు బంధుత్వం కూడా కాస్త వుంది. అయినా స్నేహానికే యెక్కువ విలువనిస్తున్నారు.

శేషాచలం తిన్నగా వెంకటారావు యింటికి నడిచాడు. తన ప్రయత్నంలో వెంకటారావు సహాయం ఎంతో అవసరం. అందుకే అతని దగ్గరికి వెళ్ళాడు. శేషాచలం వచ్చేసరికి వెంకటారావు దినపత్రిక ఏదో చదువుతున్నాడు. స్నేహితుణ్ణి చూసి "రావోయ్ చలం....కూర్చో" అంటూ ఆహ్వానించి. చదువుతున్న పత్రిక ఓ పక్కకి పెట్టాడు.

శేషాచలం కూచున్నాడు. వెంకటా్రవు అతని మొహంకేసి వింతగా చూశాడు. ఆ మొహంలో మునుపటి ఉత్సాహంగాని, ప్రసన్నత గాని గోచరించక పోయేసరికి ఆశ్చర్యపోయాడు.

"ఏవిఁటోయ్ అలావున్నావు ?" ప్రశ్నించాడు.

శేషాచలం నిట్టూర్చి, తను ఏ పరిస్థితిలో సతమతమౌతున్నాడో వివరంగా చెప్పి, "అందుకే వెంకటా్రవ్, నేను ఈ ఊరు వదిలి వెళ్ళడానికే నిశ్చయించుకున్నాను" అని ముగించాడు.

వెంకటా్రవు షాక్ తిన్నట్టుగా ఫీలయ్యాడు. ఇన్నేళ్ళుగా వుంటూ వచ్చిన ప్రాణస్నేహితుడు ఊరు విడిచి పోతానంటే షాక్ తగల్దూ మరి ?

"మరింక మార్గమేదీ లేదేవిఁటి శేషాచలం ?" ప్రశ్నించాడు.

"లేదు వెంకటా్రవ్। ఎంతో ఆలోచించిన మీదటే ఈ నిర్ణయానికి వచ్చాను. ఒకవేళ సంఘానికి ఎదురీది అమ్మాయిని నాయింట తెచ్చిపెట్టుకున్నానే అనుకో.... అప్పుడు నా బలహీనత ఎత్తి చూపేవారు కొందరు. దాన్ని ఆధారంచేసుకుని డబ్బు గుంజేవారు మరికొందరు, గౌరవానికీ, పరపతికీ సమ్మెటపెట్టు పెట్టేవారు మరికొందరు. ఈ రకరకాల వ్యక్తులు తారసపడతారు. అప్పుడు నా జీవితం దుర్భరమే అవుతుంది. అందుకే నేను ఈ నిర్ణయానికి వచ్చాను" తన భయాన్నంతా వెళ్ళగక్కాడు శేషాచలం.

వెంకటా్రవు ఇంకేమీ జవాబు చెప్పలేకపోయాడు. స్నేహితుడు చెప్పింది సంభవమనుకున్నాడు.

"మరవుతే, నీ మిల్లూ, నీ యిల్లూ, భూమీ, ఇదంతా ఏం చేస్తావు? అమ్మజూపుతావా ?" వెంకటా్రవు ప్రశ్నించాడు.

"అసలు యిప్పుడు నేను నీ దగ్గరికి రావడానికి కారణం అదే

మరి! ఇంకెవరికో నేను అమ్మజూపడం యెందుకు? నువ్వే తీసుకో!"

"నేనా? అంతడబ్బు నాదగ్గి రెక్కడుంది?" వింతగా చూస్తూ అన్నాడు వెంకటాద్రివు.

"పోనీ, ప్రస్తుతానికి ఓ అయిదారువేలు రొఖం యివ్వు. తర్వాత తతిమ్మాది పంపేయ్!"

వెంకటాద్రివు ఆలోచించాడు. తను స్నేహితుడి ఆస్తిని కొనడ మేవిఁటి? అన్న ఆలోచనకూడా అతనిలో కలిగింది. ఏవిఁటో అది ఎబ్బెట్టుగా అనిపించింది.

"ఏవిఁటోనోయ్! నువ్వు నన్ను ఇరకాటంలో పడేస్తున్నావు... నీ ఆస్తిని నేను కొనడమేవిఁటీ? నీకు అంతగా అయిదువేలు రొఖం కావాలంటే తీసుకువెళ్ళు. తర్వాత యిచ్చేద్దువుగాని" అన్నాడు.

"బాగానే వుందిగాని,మళ్ళీ నేను యిక్కడికి రాదల్చుకోలేదుగా!"

"ఏవిఁటో నీ పట్టుదల పోనిద్దూ! అయినా ఒకలా చేస్తేసరి.... ప్రస్తుతానికి నా దగ్గర్నుంచి కొంత డబ్బు తీసుకెళ్ళు. నీ మిల్లు, యిల్లు, భూమి క్రమంగా నేనే అమ్ముతాను. డబ్బు పంపివేస్తాను"

"సరే, అలాగే కానీయ్! ఒక్కవిషయం. నా వునికి నీకు తప్పించి యింకెవ్వరికీ తెలీనివ్వకు సుమా! అందులో చిన్న ప్రమాదం వుంది"

"నువ్వూహిస్తున్న ప్రమాదం నాకు తెలుసులేవోయ్! అలాగే యెవ్వరికీ చెప్పను. అయిదువేలు కావాలంటావా?"

"ఇవ్వాలి మరి! నేను అక్కడికిపోయి ఏదో వ్యాపారం పెట్టుకోవాలిగా! రేపు మనం రిజిష్ట్రారు ఆఫీసుకు వెళ్ళి ఏర్పాటు చేసుకుంటే సరి"

"అలాగే! ఇప్పుడిచ్చేయమంటావా డబ్బు?"

"వద్దు. రేపు తీసుకుంటాను"

"నిజంగా శేషాచలం. నువ్వు దూరమైపోతున్నందుకు నేను యెంతో బాధపడుతున్నాను సుమా!"

"నాకూ బాధగానే వుంది వెంకట్రావ్! కాని ఏంచేస్తాం? పరిస్థితులకు మనం బానిసలమేగా!" అన్నాడు శేషాచలం. అతని గొంతు బొంగురుపోయింది. "మరి వస్తా; రేపు కలుసుకుందాం" అంటూ లేచి వెళ్ళిపోయాడు శేషాచలం.

స్నేహితుడు వెళ్ళిపోయాక వెంకట్రావు ఓ నిట్టూర్పు విడిచాడు. 'ఎటువంటి క్లిష్ట సమస్యను యెదుర్కొంటున్నాడు పాపం!' అనుకుంటూ స్నేహితుడిపట్ల సానుభూతి చూపాడు వెంకట్రావు.

3

ఆ రోజు శనివారం. శేషాచలం జీవితంలో అదో ముఖ్యమైన రోజు. మరువరాని రోజు. ఆ ఊరు విడిచిపెడుతున్నాడు ఆరోజు. అందుకే అది అతి ముఖ్యమైన రోజు.

ఉదయం యెనిమిది గంటలు దాటింది. శేషాచలం వెంకట్రావు దగ్గరికి వెళ్ళి చెప్పి వచ్చాడు. అతని కళ్ళు తడిని ఆర్పుకున్నట్టుగా వున్నాయి. పంతులు సామాన్లన్నీ స్టేషనుకి అప్పుడే చేర్చేశాడు. ఉన్న కొద్దిపాటి సామాను రిక్షాలో పెట్టి తను సిద్ధంగా వున్నట్టున్నాడు.

"పంతులూ! ఏమిటో బాధగా వుంది" అన్నాడు శేషాచలం బొంగురుపోయిన గొంతుతో,

అప్పన్న పంతులుకి కూడా కళ్ళు చెమర్చాయి. "మరేం చేస్తాం బాబూ! మనకిది తప్పని సరయ్యింది. ఇంటికి తాళంవేసి వెంకటాద్రిపు గారికి యిచ్చేయమంటారా?" అన్నాడు మెల్లగా.

"తాళంవేసి నేరుగా నువ్వు స్టేషనుకి వెళ్ళిపో! వెంకటాద్రిపు అక్కడికి వస్తాడులే. సామానంతా బుక్ చేసెయ్యి. డబ్బుకి మాత్రం వెనుకంజ వెయ్యకు. నేను వెళ్ళి అసలు పని ముగించుకు వస్తాను. ఏలాగూ ముందు వెళ్తున్నావు గాబట్టి, మన ముగ్గురికీ టిక్కెట్లుకూడా కొనేయ్.... ఇదిగో డబ్బు" అంటూ జేబునుండి డబ్బుతీసి యిచ్చాడు. పంతులు డబ్బును జాగ్రత్తగా జేబులో పెట్టాడు. "వస్తామరి.... నువ్వు తొందరగా వెళ్ళు" అంటూ నిష్క్రమించాడు శేషాచలం.

పంతులు ఓసారి బోరుమంటున్న ఇంటివేపు చూసి, బాధపడి తాళంవేసి రిక్షాలో కూచున్నాడు. రిక్షా స్టేషనువేపు సాగిపోయింది.

శేషాచలం వడివడిగా నడుస్తున్నాడు. అతని మెదడులో అసంఖ్యాకమైన ఆలోచనలు ఒక్కుమ్మడిని చేరి ఢీకొంటున్నాయి. 'నువ్వు చాలా మంచిపని చేయబోతున్నావు' అని అంతరాత్మ ప్రబోధిస్తూవుంది. అంతరాత్మకి వ్యతిరేకంగా తను యెప్పుడూ ప్రవర్తించలేదనుకుని తనలో తనే తృప్తిపడ్డాడు.

రుక్మిణి యిల్లు చేరుకునేసరికి శేషాచలం ఆలోచనలకు సడన్ బ్రేకు పడింది. ఇంట్లోపలికి నడిచాడు. రుక్మిణి లేదు. పెరట్లో ఆమె గొంతు వినిపిస్తూంది. గౌరి ఓమూల కూచుని వెక్కివెక్కి ఏడుస్తూ వుంది. అప్పట్లో ఆమె వేసుకున్న గౌను నిరుపేద పిల్లలయినా వేసుకోరు. అంత మలినంగానూ, చినిగిపోయీ వుంది. తల చింపిరిగా వుంది. 'ఈమె గౌరేనా? నా కూతురేనా?' అనుకున్నాడు బాధగా. అతని గుండెలు తపుక్కుపోయాయి. పోలమ్మ చెప్పిన మాటలు అతని చెవుల్లో గింగురు

మన్నాయి ఒక్క అంగలో పోయి గౌరిని దగ్గరికి తీసుకుని తల నిమి రాడు. "ఎందుకమ్మా ఏడుస్తున్నావు ?" అన్నాడు బొంగురుపోయిన గొంతుతో. అతని కళ్ళల్లో నీరు గిర్రున తిరుగుతూవుంటే పంచెతో ఒత్తుకున్నాడు. "అమ్మ కొట్టింది" వెక్కి-వెక్కి ఏడుస్తూనే చెప్పింది గౌరి.

శేషాచలంకి రుక్మిణిపై అంతులేని కోపం ముంచుకొచ్చింది. తల్లి లేని పిల్లను కొట్టడానికి ఆమెకి యెలా చేతులు వచ్చాయో.యెలా మనసు అంగీకరించిందో ననుకున్నాడు. అవుతే, తను కోపం ప్రదర్శించవల్సిన సమయం కాదని కూడా గుర్తుంచుకున్నాడు. అది చాలా విలువైన సమయం. గౌరి భవిష్యత్తుకు సంబంధించిన సమయం. అందుకే కోపాన్ని దిగమ్రింగుకున్నాడు.రుక్మిణి మాటలు ఇంకా పెరట్లోనే వినిపిస్తున్నాయి.

"రుక్మిణీ !" అంటూ కేకవేశాడు ఎంత సౌమ్యంగా పిలవాలని మనసులో అనుకున్నా, అప్రయత్నంగా ఆ కంఠంలో కోపం కాస్తంత ప్రతిధ్వనించింది.

శేషాచలం గొంతు విన్న రుక్మిణి చిన్న షాక్ తింది. ఆమెలో గాభరా అధికమయ్యింది. అంత పొద్దుటే అతను తన ఇంటికి వస్తాడని ఆమె యెప్పుడూ అనుకోలేదు. ఈరోజు వరకూ అలా యెప్పుడూ రాలేదు కూడాను. చరచరా ఇంట్లోపలికి వచ్చింది. గౌరి ఏడుస్తూ అతని చేతుల్లో వుండటం చూసి ఆమె పళ్ళు పటపటా కొరుక్కుంది. అయినా తన ప్రవర్తన వ్యక్తం చెయ్యకుండా దాచుకుంది.

"మీరొచ్చి యెంతసేపయ్యిందండీ ?" అంది మందహాసంతో. ఆ నవ్వుకే ఇంతవరకు ముగ్ధుడై, మోసపోయిన శేషాచలం ఆ నవ్వు వెనుక యెంత విషముందో అర్థం చేసుకున్నాడు.'వేశ్యకి నటనకి తక్కువేమిటి?' అనుకుంటూ తనూ నవ్వు తెచ్చిపెట్టుకున్నాడు.

"ఇప్పుడే వచ్చానుగాని, అమ్మాయి ఏడుస్తుందేం?" మందహాసం తోనే అన్నాడు.

రుక్మిణి అనుకోకుండా తడబడింది.

"ఇటీవల రణపెంకి అయిపోతుందండీ! మాటకి మాట జవాబివ్వడం; చెప్పినమాట వినకపోవడం; ఇవేమీ నాకు నచ్చలేదు. భవిష్యత్తుకి ఇవేమీ మంచివి కాదు కూడాను. మొక్కప్పుడు వంగనిది, మానయ్యాక వంగుతుందా? ఇప్పట్నుంచే కాస్త అదుపులో వుంచాలని నా అభిప్రాయం. మీరుకూడా కాస్త చెప్పండి. చూశారా, ఆ బట్టలు యెలా వున్నాయో! బట్టలు వేస్తానంటే కొత్తవి కావాలంటూ ఏడుస్తూ కూచుంది" అంది రుక్మిణి యెంతో అభిమానం వున్నదానిలా.

శేషాచలం మొహంలో ఏ విధమైన మార్పూ రాలేదు. అతనికి తెలుసు రుక్మిణి అంతా అబద్ధం చెప్తోందని. అయినా ఏమీ యెదురు ప్రశ్న వెయ్యలేదు. అది సమయం కాదనుకున్నాడు. గౌరి మొహంలోకి చూస్తూ --

"అదేవిఁటమ్మాయ్! ఎప్పుడూ కొత్తబట్టలు కావాలంటే ఎలా చెప్పు? శుభ్రమైన బట్టలు వేసుకుంటే చాలు. అసలు అలా ఏడవ కూడదు తెలుసా?" అన్నాడు.

"కొత్తబట్టలు కావాలనలేదు నాన్నా! ఊరికనే కొట్టింది" ఏడుస్తూనే జవాబు చెప్పింది గౌరి.

రుక్మిణికి లోలోన మండిపోతున్నా, మెల్లగా నవ్వింది. "చూశారా, ఇప్పట్నుంచే అబద్ధాలు చెప్పడంకూడా నేర్చుకుంటుంది" అంది.

ఆ సంభాషణ ఇంక అనవసరంగా పెంచడం ఇష్టంలేకపోయింది శేషాచలంకి. అదీగాక, రైలుకి వేళకూడా అవుతుందాయె!

"పోనీలే రుక్మిణీ! చిన్నదాయి.... దాంతో ఏవిఁటి? వేగిరం దాన్ని ముస్తాబు చెయ్యి. బజారుకి తీసుకుపోయి ఓ అరడజను గౌనులు తీసుకుంటాను" అన్నాడు సమయస్ఫూర్తిగా.

అతను గౌరిని బజారుకి తీసుకు వెళ్తాననడం అదే ప్రథమం. అందుకే రుక్మిణి ఆశ్చర్యపోయింది కూడాను. ఇంతవరకూ అతనెప్పుడూ అటువంటి ప్రయత్నం తలపెట్టలేదు.

"ఏవిఁటండోయ్! ఎప్పుడూలేదు. ఇవ్వాళ అమ్మాయిని బజారుకి తీసుకెళ్తా నంటున్నారు?" అంది వింతగా. ఆమెలో ఏమైనా అనుమానం తలెత్తుతున్నదేమోనని భయమేసింది శేషాచలంకి. ఆ అవకాశం ఇవ్వ కూడదనుకున్నాడు.

"నిజమే రుక్మిణీ! కాని, ఈరోజు అది కొత్త గౌనుకోసం ఏడ్చిందంటే, కొన్ని గౌనులు కొనిపెట్టాలనిపించిందీ సమయంలోనే! అయినా ఎన్నాళ్ళు అమ్మాయిని వెంట తీసుకుపోకుండా వుండగలను? పిల్లలతో తిరగడమనే వాంఛ నాలోనూ ఇప్పుడిప్పుడు కలుగుతూ వుంది" అన్నాడు తడబడకుండా.

"మరి యెవరన్నా అడిగితే, అమ్మాయి యెవరని చెప్తారు?" గట్టి పశ్న వేసింది రుక్మిణి.

"అబద్ధం చెప్పడం ఇంకెందుకు? ఎప్పుడైనా నిజం బైటపడు తుందిగా! నా కూతురనే చెప్తాను. పూర్తి వివరాలు అడగడానికి ఎవరికి ధైర్యముంటుందిలే! అదేవిఁటో మరి! ఇంతకు ముందులేని మొండి ధైర్యం నాలో ఇప్పుడిప్పుడు మొలకెత్తుతూ వుంది. ఆ ధైర్యమే నన్నిప్పుడు నడిపిస్తుందనుకో! ఆఁ! అన్నట్టు నీకు చీరెలు లేవని ఆమధ్య అన్నావు కదూ?" అన్నాడు. ఆమెను ఈ విధంగానైనా తృప్తిలో ముంచేసి, అసలు విషయం ఆరా తియ్యకుండా చెయ్యాలని అతని అభి ప్రాయం.

చీరల సంగతి వచ్చేసరికి రుక్మిణి అంతవరకూ జరుగుతున్న ప్రస్తావనే మర్చిపోయింది.

"అదే నేనూ చెప్పాలనుకుంటున్నానండీ! ఎక్కడికైనా వెళ్ళినప్పుడు కట్టుకుందుకు ఓ మంచి జరీచీర, మరో రెండు మామూలు చీరలు తీసుకోండి" అంది.

"అలాగేలే! అమ్మాయిని వేగిరం ముస్తాబుచెయ్యి" మళ్ళీ అన్నాడు శేషాచలం. మంచి సమయానికి చీరల విషయం ప్రస్తావించానని లోలోన మురిసిపోయాడు.

"ముస్తాబు చెయ్యడం ఎంతసేపులెండి? రెండు నిమిషాలు. రా గౌరీ! మంచిగౌను వేసుకుందువుగాని" అంటూ దగ్గరగా వచ్చి, లాలనగా యెత్తుకుని ముద్దాడి మొహం కడగడానికి పెరట్లోకి తీసుకుపోయింది.

శేషాచలం తనలో తనే నవ్వుకుని తల పంకించుకున్నాడు.

అయిదు నిమిషాల్లో గౌరిని ముస్తాబు చేసింది రుక్మిణి. ఎంతో ఆత్మీయంగా ఆమెను యెత్తుకుని తీసుకొచ్చి శేషాచలం ముందు దింపింది.

"నిజంగా గౌరి యెంతో బావుంటుందండీ! అచ్చంగా వాళ్ళమ్మలానే వుంటుంది. వాళ్ళమ్మ కోరిన విధంగా మీరు యెలా అభివృద్ధికి తీసుకొస్తారో మరి" అంది రుక్మిణి.

"మన చేతుల్లో ఏముంది రుక్మిణీ! అంతా దైవేచ్ఛ. ప్రయత్నించడమే మనవంతు. మరి మేం వెళ్ళొస్తాం. వేగిరం వచ్చేస్తాంలే!" అంటూ గౌరిని తీసుకుని బయలుదేరాడు శేషాచలం. ఇంకా యేవిధంగానూ జాప్యం చెయ్యడం అతనికి ఇష్టంలేకపోయింది. రోడ్డుమీద పోతున్న ఖాళీ రిక్షాను ఆపి అందులో కూచున్నాడు గౌరితో సహా.

"వస్తాం రుక్మిణీ!" ఆఖరుసారిగా చెప్పాడు.

"వేగిరం వచ్చేయండి" ద్వారం దగ్గర వయ్యారంగా నిల్చుని అంది రుక్మిణి.

'అలాగే' అన్నట్టు తలూపి, రిక్షాను పోనిమ్మన్నాడు శేషాచలం. రిక్షా సాగిపోయింది ముందుకు. రుక్మిణి మాత్రం వీధిలో పోతున్న యువకుల్ని చూస్తూ వుండిపోయింది క్షణంసేపు.

శేషాచలం స్టేషను చేరుకునేసరికి పంతులు యెదురుగా వచ్చాడు గౌరిని చూసి, ముచ్చటపడి యెత్తుకుని ముద్దులవర్షం కురిపించాడు.

"అమ్మాయి యెంత లక్షణంగా వుందండీ!" అన్నాడు పంతులు.

"ఉండక ఏంచేస్తుందోయ్ ! అన్నట్టు, సామాను బుక్ చేయించావా ? టిక్కెట్లు కొన్నావా ?" అన్నాడు శేషాచలం.

"అన్నీ సవ్యంగా జరిగాయండీ ! బండి మరో అరగంటలో వస్తుంది కూడాను. మీరింకా రాలేదేమా అని యెదురు చూస్తున్నాను. వెంకటార్రావుగారు కూడా వచ్చారు"

"అలాగా ! పద !"

వెంకటార్రావును కలుసుకున్నాడు శేషాచలం. అతనుకూడా గౌరిని చూసి ముచ్చటపడుతూ ఆమె చెక్కిలి గిల్లుతూ—

"పాపా ! నా దగ్గర వుండిపోకూడదూ ?" అన్నాడు.

"ఉఁహూఁ !" అంటూ తల అడ్డంగా ఆడించింది గౌరి.

శేషాచలం నవ్వుకున్నాడు.

"సరేగాని, ఉత్తరాలు వ్రాస్తుంటావు కదూ !" వెంకటార్రావు ప్రశ్నించాడు.

"బావుందోయ్ ! రాయకుండా మానేస్తానా ? కాని, నా అడ్రసు యెవ్వరికీ తెలీనివ్వకు. ఇక్కడ నీ వొక్కడితో తప్పించి, ఇంకెవ్వరితో నాకు అవసరముండదులే" హెచ్చరించాడు శేషాచలం.

"అలాగేలే. మీ అమ్మాయి పెళ్ళికి ఆహ్వానిస్తావు కదూ !"

"నువ్వు లేకుండా పెళ్ళి జరుగుతుందా యేవిఁటి ?"

ఇద్దరూ నవ్వుకున్నారు.

"పంతులూ, తాళం యిచ్చేశావా ?" శేషాచలం గుర్తుకు తెచ్చాడు.

"ఔను బాబూ ! మర్చేపోయాను" అంటూ జేబునుండి యింటి తాళం తీసి వెంకటార్రావుకి అందించాడు పంతులు.

కొద్దిసేపట్లో రైలు వచ్చి ఆగింది.

"పంతులూ ! సామాన్లు జాగ్రత్తగా యెక్కించు" అంటూ ఓ కంపార్టుమెంటులో జాగా చూసుకుని కూర్చున్నాడు శేషాచలం. అతని పక్కనే కిటికీ దగ్గర గౌరి కూర్చుంది. ఆమెకు యిదంతా యేవిఁటో అయోమయంగా వుంది. తనకి కొత్తగాజులు కొనలేదేమా అని ఆలోచిస్తూ వుంది.

వెంకటార్రావు స్నేహితుడికి ఎదురుగా కూచుని అప్పుడప్పుడు ఏదో ప్రశ్న వేస్తున్నాడు. అసలు అతనికి యెందుకో నోటమాట రావడంలేదు. స్నేహితుడు తనకి దూరమయ్యే సమయం దగ్గరపడుతుందన్న బాధవల్లనేమో మరి !

"అన్నీ యెక్కించేశాను బాబూ !" అంటూ లోపలికి వచ్చాడు పంతులు.

గార్డు విజిల్ ఊదాడు. వెంకటార్రావు లేచి నుంచున్నాడు.

"వెంకటార్రావ్ ! మరి నేను వస్తా. నన్ను మర్చిపోకు సుమా !" అంటూ స్నేహితుణ్ణి ఆఖరుసారిగా కౌగలించుకున్నాడు శేషాచలం. అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

"చేరిన వెంటనే ఉత్తరం వ్రాయి" అంటూ చెమ్మగిలిన కళ్ళు ఒత్తుకున్నాడు వెంకటా్రవు.

వారిద్దర్నీ విడదీసిన భూకంపంలా కూతకూసింది యింజను. వెంకటా్రవు భారంగా బండి నుంచి దిగాడు.

బండి కదిలింది. శేషాచలం ద్వారం దగ్గరే నుంచుని కనుచూపు మేరవరకూ స్నేహితుణ్ణి చూస్తూనే వున్నాడు. ఇరువురూ చేతులు ఊపు కుంటూనే వున్నారు. బండి స్టేషనుకి దూరమయ్యింది. శేషాచలం వచ్చి కూతురు ప్రక్కను కూచున్నాడు. అతని హృదయం వ్యథాభరిత మయ్యింది. ఇన్నేళ్ళుగా వుంటూ వచ్చిన ఊరితో తనకి ఋణం తీరి పోయిందనుకుని మనసులో బావురుమన్నాడు.

గౌరికి ఏమీ అర్థంకావడంలేదు. తను ఎక్కడికి వెళ్తున్నట్టు ? గౌనులు కొనడానికా ?

"మనం ఎక్కడికి పోతున్నాం నాన్నా!" అమాయకంగా ప్రశ్నిం చింది.

"ఊరికి వెళ్తున్నా మమ్మా!" కూతురి ప్రశ్నకు మందహాసంతో సమాధాన మిచ్చాడు శేషాచలం.

"మరి, నాకు గౌనులు దొరుకుతాయా అక్కడ ?"

"ఓ ! కావల్సినన్ని కొనిపెడతానులే !"

"మరి, అమ్మ రాలేదేం ?"

"అమ్మ రాదులే....ఇంకెప్పుడూ రాదు....మనమూ వెళ్ళొద్దూ !"

గౌరి కళ్ళు ఉత్సాహంతో తళుక్కుమన్నాయి. "మంచిపనే.... మంచిపనే....నువ్వూ, నేనూ ఒక దగ్గరుందాం నాన్నా ! అమ్మ దగ్గరికి పోవద్దు. అమ్మ నన్నెప్పుడూ కొడుతుంటుంది" అంది ఉత్సాహంగా.

చివరి వాక్యానికి శేషాచలం నయనాలు అశ్రుపూరితాలయ్యాయి.

"పోనీలే అమ్మా! ఇప్పుడు నిన్నెవ్వరూ కొట్టరు. అదుగో, మన పంతులున్నాడు కదూ! అతను నీకు అన్నీ కొనిపెడతాడులే" అంటూ పంతుల్ని చూపించాడు.

గౌరి ఆనందంతో చప్పట్లు కొట్టింది. రైలు కూతకూసి వేగం హెచ్చించింది. కిటికీగుండా శూన్యంలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు శేషాచలం.

4

రుక్మిణి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకూ శేషాచలం, గౌరి వస్తారనే నిరీక్షించింది. కాని, వాళ్ళు రాలేదు. అయినా అప్పట్లో ఏమంత గాభరా పడలేదు. సాయంత్రం కూడా రాకపోయేసరికి ఒక విధమైన అనుమానం తలెత్తింది. వెంటనే పోలమ్మకి కబురుపంపి, ఆమెను శేషాచలం ఇంటికి వెళ్ళి రమ్మంది.

పోలమ్మ శేషాచలం యింటికి వెళ్ళింది. ఇంటికి తాళంవేసి వుండటం చూసి మొదట్లో ఆశ్చర్యపోయింది. పొరుగు వాళ్ళను అడిగింది. "ఈవేళ ఉదయమే సామాన్లన్నీ తీసుకుని ఎక్కడికో వెళ్ళారు. ఈ ఊరే విడిచిపెట్టారని అంతా అనుకుంటున్నారు" అని పొరుగువాళ్ళు చెప్పేసరికి పోలమ్మకి తను ఆరోజు శేషాచలంకి చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. బహుశా ఆయన అమ్మాయి బాగోగుల గురించి ఊరు విడిచిపెట్టి వుంటాడని నిర్ధారణ చేసుకుని తృప్తిపడింది. రుక్మిణి దగ్గరికి పోయి విషయం వెల్లడిచేసింది.

రుక్మిణి స్తంభించిపోయింది. ఆమె మొహం ప్రథమంలో పాలిపోయినా, క్రమంగా రాగరంజిత మయ్యింది. కనుబొమలు ముడిపడ్డాయ్. తోకతొక్కిన త్రాచులా బుసలు కొట్టింది. కళ్ళు చింతనిప్పుల్లా మెరుస్తున్నాయి.

"మోసంచేసి పోతాడన్నమాట శేషాచలం. హుఁ! సరే!" అంది సావధానంగా.

"ఎక్కడికి వెళ్ళాడో తెలిసిందా?" మళ్ళీ ప్రశ్నించింది పోలమ్మను ఉద్దేశించి.

"తెలీదటమ్మా! ఎవరికీ చెప్పకుండా వెళ్ళారట"

కోపంతోపాటు నిరుత్సాహం రుక్మిణిలో ఆవరించింది. తను యే విధంగా ప్రతీకారం తీర్చుకోవడం? అతని వునికి తెలియనిదే యేమీ చెయ్యలేదే! శేషాచలం యింత అన్యాయం చేస్తాడని తను యెప్పుడూ అనుకోలేదు. అతని హృదయం మంచిదనే యిన్నాళ్ళూ భావిస్తూ వచ్చింది కాని, ఇంత విషం దాగివుందని అనుకోలేదు. ఆ నమ్మకంతోనే అతని నుండి తను ఇంతవరకూ యే విధమైన ప్రతిఫలమూ పొందలేదు. ఏదో యెప్పుడో అవసరమైతే అయిదూ, పదీ తీసుకుందేది తప్పించి, తన త్యాగానికీ, ఈ డబ్బుకీ సామ్యమేలేదు. సుందరమ్మలానే తననీ చూసుకుంటానని నమ్మిస్తే, అతనికి అన్నివిధాలా లొంగిపోయింది. గౌరిని పెంచడానికి సమ్మతించింది. తను ఆయనకిచ్చిన ఆనందానికీ, ఆసరాకీ, ఇదేనా ప్రతిఫలం? ఆలోచనల అలల్లో తేల్తూ మునుగుతూంది రుక్మిణి.

అప్పుడే చీకటి పడింది పోలమ్మ లైటు వెలిగించింది. చల్లని గాలి వీస్తోంది. ఆ గాలితోపాటు 'రుక్మిణీ!' అన్న గొంతు విన్పించింది. రుక్మిణికి ఆ గొంతు చిరపరిచితమైనదే! తలెత్తి చూసింది. ఎదురుగా రాజారావు! మందహాసం పెదాలపై వెదజల్లుతూ నిల్చున్నాడు రాజారావు.

అంత నిరుత్సాహంలోనూ, అంత బాధలోనూ రుక్మిణికి అతని ఆగమనం అమితానందాన్ని కలిగించింది. మంచి తరుణంలో వచ్చాడని సంతసించింది. ఉత్సాహంతో లేచింది.

"ఏవిటి రాజా ! ఈమధ్య కనిపించడమే మానేశావు ?" అంది దగ్గరగా వెళ్ళి. ఆమె అతణ్ణి అలాగే సంబోధిస్తుంది ఎప్పుడూను.

రాజారావు గురించి తెలుసుకోవాలంటే,చాలా గ్రంథం పడవాలి. మన కథకి సంబంధించి నంతవరకూ అంత గ్రంథం అవసరం లేదు. అతను బస్సు డ్రైవరు....సుమారు ముప్ఫయి అయిదు సంవత్సరాలుంటాయి. ఒడ్డూ, పొడుగూ వున్న మనిషి....యెప్పుడూ నీటుగా వుంటాడు. వుండాలని ప్రయత్నిస్తాడు. అతనికి రుక్మిణితోనే గాక, చాలామంది వేశ్యలతో పరిచయముంది. కాని, అందరికంటె రుక్మిణికే అధికం విలువిస్తాడు. ఆమెకోసం యేమైనా చెయ్యడానికి సిద్ధంగా వున్నట్టే వుంటుందతని ప్రవర్తన. ఆమధ్య రెండుమూడు హత్య కేసుల్లో ఇరుక్కున్నట్టు కూడా వదంతి. కాని చాకచక్యంతో తప్పించుకున్నాడు. అతనికి కొందరు పెద్దపెద్ద వాళ్ళతో పరిచయం వుంది. ఆ పరిచయాలే అతణ్ణి యెన్నోసార్లు రక్షించాయి. అతనిలో మరో విశేషం కూడా వుంది. అందరితోనూ స్నేహంగా మెలుగుతాడు.

రాజారావు రుక్మిణివేపు తదేకంగా చూస్తున్నాడు. ఆమె అలంకరణ అందంగా వున్నా, మొహంలో కాంతి కన్పించలేదు. ఏదో నిరుత్సాహం పొడజూపింది.

"ఏవిటలా చూస్తున్నావు ?" ఆదోలాంటి కంఠంతో అంది రుక్మిణి.

"ఏంలేదు రుక్మిణీ ! అందంగా అలంకరించుకున్నా సరే,మొహం పాలిపోయి వుందేమా అని చూస్తున్నాను" అన్నాడు.

"ఓఁ అదా ! చెప్తారా ! ముందు కూర్చో" అంటూ ఆప్యాయంగా రాజా చేతిని పట్టుకుని తీసుకొచ్చి మంచంమీద కూచో బెట్టింది.

ఆమె ఆరోజు చూపిస్తున్న మమకారానికి రాజా వుబ్బి తబ్బిబ్బయ్యాడు. అతని హృదయం యెగిరి గంతేసింది.

"ఔనూ ! ఈమధ్య కనిపించడమే మానేశావేం ?" అంది మళ్ళీ రుక్మిణి.

"బావుంది. ఈ ప్రశ్న అడగవల్సింది నేను. నన్నే అడుగుతున్నావేమిఁటి ? ఎప్పుడు వచ్చినా ఆ ముసలాయన నీయింట్లో వుండేవాడు. ఒకటి రెండుసార్లు నువ్వే ఆ విషయం చెప్తూ, నన్ను మర్యాదగా తిప్పి పంపావు ? పైపెచ్చు నా దర్శనం లేదంటావేం ? ఈవేళ నిజంగా అదృష్టవంతుణ్ణే ! అతను లేడు"

"అతణ్ణి నమ్మి యింతకాలం వుండే, ఇప్పుడు మోసపోయాను" బాధగా అంది.

"మోసపోయావా ? అంటే ?" వింతగా ఆమెవేపు చూస్తూ అన్నాడు రాజా.

రుక్మిణి సుందరమ్మ చనిపోయింది మొదలు, శేషాచలం గౌరిని తీసుకుని వెళ్ళిపోయేవరకూ పూసగుచ్చినట్టు చెప్పింది. అంతా అయ్యాక గట్టిగా విట్టూర్చింది.

"ఓహో ! అందుకా నీ మొహం పాలిపోయింది ? పాపం !" వెటకారంగా అన్నాడు రాజారావు. ఆ మాటలు రుక్మిణి గుండెల్లో సూదుల్లా గుచ్చుకున్నాయి.

"అతను వెళ్ళిపోయినందుకు కాదు రాజా నా ఆవేదన ! నన్ను మోసగించినందుకు" అంటూ అతని చేతిని గట్టిగా నొక్కింది.

రాజారావు ఉద్రిక్తుడయ్యాడు. ఆమెను అమాంతంగా వొళ్ళోకి తీసుకున్నాడు. కాని రుక్మిణి నవ్వుతూ చాకచక్యంగా బయటపడింది.

"రాజా! అతనిపై కసి తీర్చుకోవాలని వుంది. ఏం చెయ్యడం ఆలోచించు" అంది నెమ్మదిగా.

"ఏం చేస్తాం? అతను ఎక్కడికి పోయాడో తెలిస్తేగా. ఏం ఆలోచించడానికైనా?"

"అదే నా ఆలోచనను! అదే మనం ఆరా తియ్యాలి. నువ్వు ఈ విషయంలో నాకు సహాయం చెయ్యాలి రాజా! నా మనసులో రగుల్తున్న మంటను నువ్వే ఆర్పాలి. అందుకు సమర్థుడివి నువ్వే! ఈ పని చేసి పెట్టు....కలకాలం యిక నీ దాననే!" మందహాసంతో అంది రుక్మిణి.

రాజారావు హృదయం ఊగిసలాడింది ఉత్సాహంతో. ఏ వనిత కోసం తను యిన్నాళ్ళు అప్రిలు చచేవాడో, ఆ రుక్మిణి యికమీదట 'తనదే' అన్న ఆనందం వెల్లివిరిసింది. కాని, ఆమె మనసులో రగుల్తున్న ప్రతీకారజ్వాల యెలా చల్లార్చడం? శేషాచలం వునికి తెలుసుకోవాలి. అదెలా సాధ్యం?

"మరి, అతని యిల్లూ, భూములూ ఇవన్నీ ఏం చేశాడు?" రుక్మిణి వేపు పరిశీలనగా చూస్తూ ప్రశ్నించాడు రాజారావు. రుక్మిణి కోసం, ఆమె తరపున డిటెక్టివ్‌గా పనిచెయ్యాలనుకుని నిశ్చయించుకున్నాడు.

"అన్నీ అమ్మేశాడట....కొనుకున్నవాడు వెంకటాద్రిట....వాళ్ళిద్దరూ స్నేహితులేనట....నువ్వెలాగైనా ఆరా తీద్దూ!" అంది.

"ఆ మాత్రం తెలిస్తే చాలు. ఇక చూడు మన తడాఖా!" అంటూ ఆమెను మళ్ళీ చెయ్యిపట్టుకుని వాళ్ళోకి తీసుకున్నాడు. ఈసారి మాత్రం రుక్మిణి తప్పించుకోవాలని ప్రయత్నించలేదు. తర్వాత ఇద్దరూ ఉల్లాసంగా నవ్వుకోవడం మాత్రం ఆ గదిలో ప్రతిధ్వనించింది.

శేషాచలం మద్రాసు సురక్షితంగా చేరుకున్నాడు. తిన్నగా స్నేహితుడింటికి దారితీశాడు.

జగన్నాధం హఠాత్తుగా శేషాచలం ఊడిపడ్డం చూసి మొదట ఆశ్చర్యపడి సంబాళించుకున్నాడు.

"ఇదేవిట్రా? వచ్చేముందు ఉత్తరమైనా రాయకుండా ఊడి పడ్డావ్?" అన్నాడు జగన్నాధం.

శేషాచలం మెల్లగా నవ్వాడు.

"అదంతా పెద్ద కథలే! తర్వాత చెప్తాను" అన్నాడు.

జగన్నాధం స్నేహితుడి ప్రక్కనే నుంచుని వున్న గౌరిని చూసి "ఈ అమ్మాయి యెవర్రా?" అన్నాడు.

"ఎవరో అవుతే నేను ఎందుకు తీసుకొస్తాను? నా కూతురే!" నవ్వుతూ చెప్పాడు.

జగన్నాధం కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. "ఏవిటీ! నీ కూతురా? నీ భార్య యేనాడో చనిపోయిందని రాశావు. పిల్లలు లేరని అందరికీ తెలుసు. మరి ఈ అమ్మాయి యెట్లావచ్చింది?" వింతగానే చూస్తూ అన్నాడు.

శేషాచలం గట్టిగా నిట్టూర్చాడు.

"అదంతా నీతో తర్వాత సావకాశంగా చెప్తాలేరా! ముందు దీన్ని తీసుకుపోయి మీ వాళ్ళకు పరిచయం చెయ్యి"

"సామాన్లన్నీ ముందు గదిలో పెట్టాను బాబూ!" అంటూ వచ్చాడు పంతులు.

జగన్నాధం అతడికేసి కూడా అర్థంకాని విధంగా చూశాడు.

"ఈయన నాతో చాలాకాలంగా వుంటూ వచ్చాడు. వంట, ఇంటి పనులన్నీ ఇతడే చూసుకుంటాడు. పేరు అప్పన్న పంతులు" పరిచయం

చేశాడు శేషాచలం. అప్పన్న పంతులు జగన్నాధంని ఉద్దేశించి "నమస్కారం బాబూ !" అన్నాడు. జగన్నాధం ప్రతినమస్కారం చేసి "అమ్మాయి పేరేవిటారా శేషూ ?" అన్నాడు.

"గౌరి !"

"పేరేం బావులేదు. చాల పాతగా, చప్పగా వుంది"

"ఉణిద్దూ ! పేరులో యేముంది ?"

"అదికాదురా ! మనలాంటి నాగరికులు పెట్టవల్సిన పేరుకాదు. మార్చేద్దాం. ఈరోజు నుంచి గిరిజ...." నవ్వుతూ అన్నాడు జగన్నాధం.

శేషాచలంకి ఆపేరు సౌమ్యంగా విన్పించింది. ప్రస్తుత నాగరికత దృష్ట్యా ఈ మార్పు అవసరమేమో నన్పించింది.

"సరే, అలాగే కానీయ్ దానికేముంది ?" నవ్వుతూనే అన్నాడు. అప్పన్న పంతులు కూడా ఉత్సాహంగా పాపవేపు చూశాడు.

జగన్నాధం గిరిజని లోపలికి తీసుకువెళ్ళి తిరిగి వచ్చేశాడు.

"పంతులూ ! సామాన్లన్నీ ఓ దగ్గిర పెట్టావుకదూ ?"

"ఔనండీ !"

"లోపలికి వెళ్ళు....చెప్పివచ్చాను....కాఫీ, టిఫిను తీసుకుందువు గాని" అంటూ శేషాచలం వేపుచూసి "రారా, మనం ఆ గదిలో కూచుందాం" అంటూ కుడివేపున వున్న తన గదికి తీసుకువెళ్ళాడు జగన్నాధం. అతని మంచితనానికి లోలోన అతణ్ణి అభినందించుకుంటూ లోపలికి పోయాడు పంతులు.

గదిలో ప్రవేశించాక శేషాచలం ఓసారి అంతా కలయజూశాడు. ఏమంత పెద్దగది కాకపోయినా, పరిశుభ్రంగా వుంది. ఓ మూల ఋసుప బీరువా వుంది. మరోవేపు అద్దాల బీరువా వెండి సామానుతో నిండి వుంది.

ద్వారం దగ్గర పై భాగంలో అందమైన గడియారం వుంది. ఆ గది చూశాక పెద్దపట్నాల్లో నాగరికత యెలా వుంటుందో కాస్త అర్థమై పోతుంది కూడాను.

"కూర్చోరా!" అంటూ జగన్నాధం కుర్చీలో కూచున్నాడు. శేషాచలం అతనికి యెదురుగా వున్న పేము కుర్చీలో ఆసీనుడయ్యాడు. జగన్నాధం జేబునుండి చార్మినార్ సిగరెట్ ప్యాకెట్ తీసి స్నేహితుడి కివ్వబోయాడు.

"నేను సిగరెట్లు కాల్చనురా! మొదట్నుంచీ చుట్టలే అలవాటయ్యాయి. అవి తప్పించి ఏ సిగరెట్ కాల్చినా, నాకు తృప్తిగా వుండదు" అంటూ జేబునుండి చుట్ట ఒకటి తీసి వెలిగించాడు శేషాచలం.

జగన్నాధం ఓ సిగరెట్ వెలిగించి "చుట్టలు మంచివేగాని. యేవిఁటో మరి! నేను ఈ సిగరెట్లకి అలవాటు పడ్డాను. సరేగాని, నీ కథేవిఁటో చెప్పు ముందు. వినాలని ఆసక్తి మెండుగా వుంది" చిన్నగా నవ్వుతూ అన్నాడు.

ఇంతలో నౌకరు చిన్నయ్య ట్రేలో కొన్ని బిస్కెట్లు, కాఫీ తీసుకొచ్చి వారి ముందుంచాడు.

"తర్వాత చెబుదువుగాన్లే! ముందివి తీసుకో!" అంటూ ముందుగా తనే రెండు బిస్కెట్లు తీసుకున్నాడు. శేషాచలం కూడా తీసుకున్నాడు.

ఇద్దరూ కాఫీ కూడా సేవించారు.

"ఆఁ! ఇక మొదలుపెట్టు" అన్నాడు జగన్నాధం మరో సిగరెట్ వెలిగించి.

శేషాచలం కాస్సేపు తటపటాయించాడు. అయితే తన మిత్రుడి దగ్గర యే విషయమూ దాచకూడదన్న నిశ్చయానికే వచ్చేశాడు.

"నేను చెప్పబోయేవి నా జీవితానికి సంబంధించిన రహస్యాలే అనుకో! అయినా నీ దగ్గర దాయదల్చుకోలేదు. నా భార్య చనిపోయిందని నీకు తెసులు. నాకు పిల్లలులేరనితెలుసు. తరువాతచాలామందిస్నేహితులు, దూరపు బంధువులు వివాహం చేసుకోమని సలహా లిచ్చారు. అయినా నాకు ఇష్టం లేక పోయింది. అదోలాంటి విరక్తి భావంతో జీవితం గడుపుకొచ్చాను. కాని విశేషం ఏవిటంటే, కాలం మనల్ని నిశ్చింతగా బ్రతకనివ్వదు. మనలో అనుకోని మార్పులు తెచ్చిపెడుతుంది. నేను యెంత నిగ్రహంతో వున్నా, క్రమంగా నాలో కొన్ని వాంఛలు మొలకెత్తాయి. గతంలో నేను గడిపిన మధుర ఘడియలు స్మృతిపథంలో మెదిలాయి. నిస్సారమైన జీవితం మీద మళ్ళీ ఏహ్యాభావం పుట్టింది. ప్రాపంచిక సుఖాలకై, మనస్సు వురూత లూగింది. దాని ఫలితంగా సుందరమ్మ అనే వేశ్యతో పరిచయం చేసుకున్నాను. ఆమె పరిస్థితులకు లొంగిపోయి వేశ్యగా మారిందిగాని, లేకుంటే యే గృహిణికీ తీసిపోదు. ఆమె సున్నిత హృదయం నన్ను ఆకర్షించింది. క్రమంగా ఆమెతో బాంధవ్యం ఇనుమడించింది. ఆమె వృత్తి విడిచిపుచ్చి కేవలం నా వుంపుడు కత్తెగా ఉండి పోయింది. మా ఇరువురి సంతానమే ఈ గౌరి. అమ్మాయి దురదృష్టమా అన్నట్టు, కొద్దిరోజులకు సుందరమ్మ చనిపోయింది. గౌరి తనలా భ్రష్టురాలు కాకుండా ఓ ఇంటిదానిగా చేసే బాధ్యత నామీద పడేసి, వాగ్దానం తీసుకుని మరీ కళ్ళు మూసిందామె. నిజంగా ఆ రోజు నేనెంతో బాధపడ్డాను జగన్నాధం! ఆ క్షణంలో ఏం చెయ్యాలో నా ఊహకి అందలేదు. గౌరిని నాతోపాటు యింటికి తీసుకుపోయి పెంచుదామంటే, సంఘంలో నా గౌరవం, హోదా, ఇవన్నీ అడ్డువచ్చాయి. సంఘానికి భయపడి పిరికివాణ్ణయ్యాను. మరోమార్గం కనిపించక సుందరమ్మ స్నేహితురాలు రుక్మిణికి పిల్లను అప్పగించాను. ఆమె కూడా వేశ్యే!

అయితేనేం, ఆమెలో మంచితనముందని భ్రమపడి అలా చేశాను. మొదట్లో ఆమె గౌరిపట్ల ఆదరాభిమానాలతోనే ప్రవర్తించింది. కాని, కాలం గడుస్తున్నకొద్దీ మనుష్యుల్లో యెటువంటి మార్పులు వస్తాయో, యెవరు చెప్పగలరు ? రుక్మిణి కొన్నాళ్ళకు మారిపోయింది. గౌరిని నానా హింసలు పెట్టేదట. అదీ నా పరోక్షంలో. నా సమక్షంలో మాత్రం గౌరిని కన్న కూతురుకంటె మిన్నగా చూసుకునేది. ఆమె నటనంతా మరో వ్యక్తిద్వారా విన్నాక, గౌరిని యింక ఆమె దగ్గరుంచడం ప్రమాదకరమనిపించింది. అలాగని, యింట్లో తెచ్చి పెట్టుకోలేనుగా ! ఒక రాత్రంతా ఆలోచించాను. తీవ్రంగా ఆలోచించాను. నా కళ్ళముందు నువ్వు అగుపించావు. అంతే ! ఒక నిశ్చయానికి వచ్చేశాను. ఆ ఊరు విడిచిపెట్టేయాలనుకున్నాను. నీలానే వెంకట్రావనే స్నేహితుడు అక్కడున్నాడు. మేం దూరపు బంధువులం కూడాను. నా ఆస్తిపాస్తులు అతని పరంచేసి మరోవ్యక్తికి తెలీకండా గౌరిని తీసుకుని యిలా వచ్చేశాను. నేను తప్పటడుగు వెయ్యలేదనే నా అభిప్రాయం" అంటూ ముగించి నిట్టూర్చాడు శేషాచలం.

అంతా ఓపికతో విన్న జగన్నాధం కూడా ఓ నిట్టూర్పు విడిచాడు.

"నిజంగా ధైర్యమంటే నీదేనా్ర ! అమ్మాయి భవిష్యత్తుకోసం నువ్వు చేసిన త్యాగం చెప్పుకో దగ్గది" అన్నాడు.

"నువ్వు నాకు సంపూర్ణ సహకారం ఇస్తావన్న నమ్మకంతోనే ఇక్కడికి వచ్చేశాను. నాకు ఏదో ఒక మార్గం చూపించాలి. నాదగ్గర సుమారు యాభైవేలు రొఖ్ఖం వుంది. ఇంకా వెంకట్రావు ఓ పదివేల వరకూ యివ్వాల్సివుంది. తర్వాత పంపుతాడు. నీతో కలిసి ఏదేనా వ్యాపారం చెయ్యాలని వుందిరా !"

"అలాగే కానీయ్ ! మనిద్దరం మళ్ళీ కలియడం నాకూ ఆనందంగానే వుంది"

శేషాచలం కళ్ళల్లో ఆశారేఖలు తళుక్కున మెరిశాయి.

"నువ్వు కాదనవని నాకు తెలుసు. అందుకే ధైర్యంతో వచ్చేశాను" తృప్తిగా, కృతజ్ఞతాభావంతో అన్నాడు.

"చాల్లేరా యింక. అవన్నీ ఇప్పుడెందుకు. లేచి స్నానం చెయ్యి" అన్నాడు జగన్నాధం ప్రస్తావన మార్చి. తనకి పొగడ్త అవసరం లేదని ఆ మాటల్లోనే తెలిసిపోతుంది.

శేషాచలం లేచి నుంచున్నాడు. ఇల్లంతా ఓసారి కలయజూశాడు.

"ఈ యిల్లు కొన్నావా యేమిటి?" ప్రశ్నించాడు.

"ఔనా! ఇరవై రెండు వేలకి కొన్నాను. అద్దె లిచ్చుకోవటం కష్టంకదూ?"

"బావుందిరా! నాకోసం ఓ యిల్లు అద్దెకు తీసుకోవాలి మరి!"

"ఇప్పుడేం తొందరొచ్చిందీ. అందనుకా ఈ యిట్లో వుండొచ్చునుగా!"

"మీకు ఇబ్బంది కలిగించడం నాకు ఇష్టంలేదు. ప్రస్తుతానికి కాపోయినా, తరువాతయినా చూసుకోవాలి"

"అలాగేలే! పద స్నానం చేద్దువుగాని" అంటూ చిన్నయ్యను కేకేశాడు జగన్నాధం. చిన్నయ్య వచ్చాడు.

"బాబుకి నీళ్ళు తోడు. స్నానం చేస్తారు" అని ఆజ్ఞయిస్తూ "పదరా!" అంటూ గదినుండి బయటికి నడిచాడు జగన్నాధం. శేషాచలం స్నేహితుణ్ణి అనుసరించాడు.

5

శేషాచలం, జగన్నాధం బంధువులుకాదు. కాని, బంధువులకంటె అన్యోన్యంగా మెలిగే స్నేహితులు. ప్రాణ స్నేహితులు. చిన్నప్పట్నుంచీ యెంతో సన్నిహితంగా తిరిగారు. యుక్తవయసు వచ్చాక ఎవరి దారి వారు పట్టేశారు.

శేషాచలం కాస్తంత వున్నవాడే. పూర్వులు ఆ మాత్రం గడించి పెట్టి పోయారు. కాని, జగన్నాధం జన్మతః పేదవాడు. అవుతేనేం, స్వశక్తితో పైకి రాగలిగాడు. మొదట్లో అసంఖ్యాకమైన కష్టాలు అనుభవించినా, చివరికి ఫలితం దక్కిందన్న తృప్తి అతనిలో నిండిపోయింది. శేషాచలం అంటే జగన్నాధంకి గొప్ప అభిమానం. ఆ అభిమానంలో కృతజ్ఞత కూడా మేళవించి వుంది. ఒకప్పుడు శేషాచలం దగ్గర ఆర్ధిక సహాయం పొందడమే అందుకు కారణం. తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చివేసినా, ఆ మేలు మాత్రం యెప్పటికీ మర్చిపోలేని ముద్ర వేసింది మనస్సులో. ఆ మేలు మర్చిపోలేను గాబట్టే నిజానికి తను పైకి రాగలిగాడేమోనని అప్పుడప్పుడు అనుకుంటుండేవాడు జగన్నాధం. ఆ భావమే అతనిలో శాశ్వతమైన కృతజ్ఞతను పెనవేసుకుంది. తన వ్యాపారంలో స్నేహితుణ్ణి భాగస్వామిగా తీసుకోడానికి నిర్ణయించుకున్నాడు.

శేషాచలం కోసం తన ఇంటికి సమీపంలోనే ఓ యిల్లు అద్దెకు తీసుకున్నాడు జగన్నాధం. అసలు తనింట్లోనే వుండమని చెప్పాడు. కాని శేషాచలం ఇష్టపడలేదు. వాళ్ళకి ఇబ్బంది కల్పించడం అతనికి సుతరమూ యిష్టంలేదు. శేషాచలంకి కొత్త యిల్లు సౌకర్యంగా కనిపించింది. ఒక సమస్య తీరిందనుకున్నాడు.

గిరిజను స్కూల్లో చేర్పించాడు శేషాచలం. గిరిజకి అంతా కొత్త వాతావరణం.... అన్నీ కొత్తముఖాలే. అయినా శేషాచలం, పంతులు వీళ్ళిద్దరూ ఆమెకి సన్నిహితంగా వుంటూ ఆలోటు తీరుస్తున్నారు.

ఓనాడు పక్కింటివాళ్ళ పిల్లలు కర్రగుర్రం మీద కూచుని సవారీ చేస్తూ ఆడుకోవడం చూసింది గిరిజ. 'అటువంటి గుర్రం తనకీ వుంటే యెంత బావుణ్ణు!' అన్న ఊహ ఆ పసి హృదయంలో మొలకెత్తింది. వెంటనే యింట్లోవలికి పోయింది. కాని తండ్రి లేకపోవడం నిరుత్సాహం కలిగించింది. పంతులు వంటగదిలో వంటచేస్తున్నాడు. చరచరా అక్కడికి పోయింది.

"పంతులూ! అలాటి గుర్రం నాకూ కావాలి. కొనిపెట్టవూ?" అంది మారాం చేస్తున్నట్టు.

"ఎలాంటి గుర్రం?" అతడికి విషయమేమిటో అర్థంకాలేదు. "చూపెడతా....రా!" అంటూ అతడి చెయ్యి పట్టుకుని బైటికి తీసుకొచ్చి చూపించింది.

"అలాగే నమ్మా! నాన్న రానీయ్....తప్పకుండా కొందాం" అన్నాడు.

ఆ జవాబు ఆమెను తృప్తిపర్చలేదు. "ఉహూఁ! నాకు ఇప్పుడే కావాలి" అంటూ చిన్న రాగం ప్రారంభించింది.

పంతులుకి ఏం చెయ్యాడయో తోచలేదు. వంటమాట మరిచిపోయి ఆమెను సముదాయించడానికి యెంతగానో ప్రయత్నించాడు. కాని ఫలితం లేకపోయింది. గిరిజ రాగం సాగిస్తూనే వుంది. చప్పున అతనికి ఓ ఆలోచన మెరుపులా మెరిసింది. చప్పున గుర్రంలా తనే వంగి ఆమెను వీపుమీద కూచోబెట్టుకుని యిల్లంతా తిరగడం మొదలు పెట్టాడు. గిరిజకి యెంతో సరదావేసింది. కాస్సేపు పోయాక పంతులుకి వంట గుర్తు కొచ్చింది. "చూడమ్మా! వంటచెయ్యాలిగా మరి! భోజనాలు అయ్యాక

మళ్ళీ తిప్పుతాలే....ఏం ?" అంటూ ఆమెను దించేసి వంటగదిలోకి పోయాడు.

భోజనాలు పూర్తయ్యాక మళ్ళీ సవారీ చెయ్యొచ్చన్న ఆనందంలో వుండిపోయింది గిరిజ.

రాత్రి యెనిమిది గంటలు దాటింది. శేషాచలం అప్పుడే ఇంటికి వచ్చాడు. గిరిజ వంతులుతో యేవో కబుర్లు చెప్పుకుంటూ కూచుంది.

"ఇదిగో నాన్నగారు వచ్చారు. నాకు గుర్రం తెచ్చిపెట్టు" అంది వంతులుతో.

"ఏమిటి వంతులూ !" నవ్వుతూ ప్రశ్నించాడు శేషాచలం.

"గుర్రం ఒకటి కావాలంటుంది బాబూ ! పక్కింటివాళ్ళ పిల్లల దగ్గర చూసింది"

"అలాగేనమ్మా ! రేపు కొని తెద్దాంలే ! వంతులూ, రేపు ఉదయం ఓ గుర్రం కొని తీసుకురా ! అమ్మాయికి యేది ఆనందాన్ని కలిగిస్తే అది మనం చెయ్యాలి" అంటూ దుస్తులు మార్చడాని కుపక్రమించాడు.

"వంతులూ ! వడ్డించు" అంటూ అమ్మాయిని యెత్తుకున్నాడు.

వంతులు వడ్డించడానికి పోయాడు.

శేషాచలం, గిరిజ మొహంలోకి చూశాడు. ఆమె ముమ్మూర్తులా సుందరమ్మలానే వుంది. ఆ క్షణంలో సుందరమ్మకి తను చేసిన వాగ్దానం గుర్తుకొచ్చింది. అమ్మాయిని తప్పకుండా అభివృద్ధిలోకి తీసుకువచ్చి వో ఇంటిదానిగా చెయ్యాలి. 'ఆమె సుఖమే తన సుఖము. ఆమె ఆనందమే తన ఆనందం' అనుకున్నాడు. చప్పున అతనికి వెంకటాద్రివు వ్రాసిన ఉత్తరం స్మృతిపథంలో మెదిలింది.

"వంతులూ !" మెల్లగా కేకవేశాడు.

"బాబూ!" అనుకుంటూ లోపల్నించి వచ్చాడు పంతులు.

"వెంకటావు ఉత్తరం రాశాడు. ఆ వేశ్య మన వునికి తెలుసుకోడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నదట" అన్నాడు.

"వెంకటావుగారు చెప్పేశారేమిటి కొంపదీసి!" అన్నాడు భయంగా పంతులు.

"లేదులే! అతడేం తెలివితక్కువవాడు కాదు. మనం రాసిన ఉత్తరాలు సహితం జాగ్రత్తగా యెవరికీ తెలీకుండా దాస్తున్నాడట"

"ఆమె కుటిల స్వభావంగాని, యెందుకో ఈ ప్రయత్నం? ఒకవేళ తెలిసినా మాత్రం యేం చేయగలుగుతుంది బాబూ?" అమాయకంగా అన్నాడు పంతులు.

శేషాచలం చిన్న మందహాసం వెదజల్లాడు.

"నీకు వయస్సవుతే వుందిగానీ, అనుభవం చాలదు పంతులూ! ఆమె చేయగలిగిందంతా నన్ను నడివీధికి లాగడమే! ఆమెకి గౌరవ మర్యాదలు లేనేలేవు. ఇక సంఘంలో గౌరవంగా బ్రతుకుతున్న నేను, ఆ కాస్త గౌరవం పోగొట్టుకోడానికి సాహసించనని ఆమెకి తెలుసు. ఈ బెదిరింపుతో నానుండి డబ్బు గుంజడానికి ప్రయత్నం. అంతే!" అన్నాడు.

పంతులు కాస్సేపు ఆలోచనలో పడ్డాడు.

"అలాగని యెన్నాళ్ళు ఆమెకి భయపడి వుంటారు చెప్పండి?"

"అందుకేగా, దూరంగా వచ్చేశాం"

"ఒకవేళ మన వునికి తెలిసిందే అనుకోండి"

"అన్నీ అనర్థాలే ముందుగా ఊహించుకుంటే, ఈ ప్రపంచంలో మనం బ్రతకలేం పంతులూ! ఏదో మంచిని వాంఛించే మనం ప్రయత్నిస్తాం. ఫలితం దైవాధీనం....ఒకవేళ తెలిస్తే, అప్పటి సంగతి ఆలోచిద్దాం" ఫక్కుగా వేదాంతంలోకి దిగిపోయాడు శేషాచలం.

పంతులుకి ఇంకేమనాలో ఊహకి అందలేదు. తను ఇంక ఆ విషయంలో వాదించడం కూడా అనవసరమనుకున్నాడు.

"మీరన్నమాట కూడా నిజమే లెండి. లేవండి మీరింక భోంచేద్దురు గాని" అంటూ వంటగదిలోకి పోయాడు పంతులు.

శేషాచలం కూతుర్ని తీసుకుని పంతులు వెంట నడిచాడు.

* * *

"నువ్వు వట్టి దద్దమ్మవు సుమా!" అంది రుక్మిణి, రాజారావు పక్కనే కూచుని అతని మొహంలోకి చూస్తూ. ఆ మాట నవ్వుతూనే అంది.

రాజారావు కూడా చిన్నగా నవ్వేడు. ఆమె యేవిషయంలో అలా పరిహాసమాడుతుందో అతనికి తెలుసు. అది పరిహాసధోరణి గాబట్టి అతను అంతగా పట్టించుకోలేదు.

"ఆ మాట నువ్వు ఒక్కర్తెవే అంటున్నావు. ఇంతవరకూ అందరి చేతా 'భేష్' అనిపించుకున్నానేగాని, ఈ విధంగా అనిపించుకోలేదు రుక్మిణీ! నా సంగతి ఇంక పూర్తిగా నీకు తెలీదు" అంటూ ఆమె చేతిని తీసుకుని మృదువుగా నొక్కాడు.

"నీ గొప్పతనం తెలుస్తూనే వుంది. శేషాచలం వెళ్ళిపోయి సంవత్సరం దాటిపోయింది. అతని వునికి తెలుసుకోలేకపోయావు ఇంత వరకూ. దద్దమ్మవుకాక ఇంకేవిఁటి?" మళ్ళీ నవ్వుతూనే అంది రుక్మిణి.

రాజారావుకి ఆ నవ్వు మత్తెక్కించింది. ఆమెను దగ్గరగా తీసుకున్నాడు.

"నీ నవ్వు నన్ను పిచ్చివాణ్ణి చేసేస్తుంది రుక్మిణీ! ఒక్కక్షణం కూడా నేను నీకు దూరంగా వుండలేకపోతున్నాను. మనిద్దరం పెళ్ళి చేసు

కుందాం... నా ఇంట్లో హాయిగా వడుందాం" అన్నాడు రాజారావు ఆమె జవాబుకోసం ఆసక్తిగా ఎదురుచూస్తూ.

రుక్మిణి కిలకిల నవ్వింది.

"ఇప్పుడు మనకొచ్చిన ఆటంకమేమిటిలే రాజా ! అయినా ప్రసంగం మార్చావేం ? శేషాచలంపై కసి తీర్చుకోవాలని వుంది. ఎలాగైనా వునికి తెలుసుకో !" అంది.

రాజారావు అర్థం చేసుకున్నాడు ఆమెలో యెంత కక్ష నిబిడీకృతమై వున్నదో ! స్త్రీ పగ అలాగే వుంటుంది గావోసు అనుకుంటూ "అయినా రుక్మిణీ ! ఆ ముసలాయనపై నువ్వు కత్తి గట్టడమేమిటి లెద్దూ ! పోనీ దగ్గర్లో వున్నాడూ అంటే, ఏదో ప్రయత్నించినా అర్థముంది. ఎక్కడో వున్న వాడిపై కక్షగట్టి అదీ ప్రయోజనంలేని కక్షగట్టి ఏం లాభం ? నామాట విను....ఆ ధ్యాసే మర్చిపో....మనిద్దరం హాయిగా వుండటమే నాకు కావల్సింది" అన్నాడు.

సరిగ్గా అదే సమయంలో తలుపురెక్కలు శబ్దం చేసుకుంటూ విడివడ్డాయి.

"రుక్మిణీ!" అన్న ఓ కరకు కంఠం గదినిండా ప్రతిధ్వనించింది.

రుక్మిణి బెదిరిన లేడిపిల్లలా మంచుని కాస్త ముందుకి వచ్చింది.

"ఏమిటి ప్రకాశం ! ఇప్పుడొచ్చావేం ?" అంది మెల్లగా. ఆమె గాత్రం వణికిపోతోంది.

రాజారావు చప్పునలేచి నుంచున్నాడు.అతని కళ్ళు అప్రయత్నంగా యెర్రబడ్డాయి. ఆ ఇరువురు వ్యక్తులూ ఒకరినొకరు కళ్ళతో పొడుచుకుంటున్నారు.

"ఇదా సంగతి రుక్మిణీ ! నన్ను పెళ్ళి చేసుకుంటానని మాటిచ్చావు....మరొకరితో సంబంధం పెట్టుకోనని వాగ్దానం చేశావు....చివ

రికి ఈ విధంగా మోసం చేస్తున్నావన్నమాట! ఇందుకేనా నన్ను పగటి వేళ రావద్దని చెప్పావు? ఎంత మోసం చేశావు? ఛీ! ఛీ!! నిన్ను నమ్మడం నాదే తెలివితక్కువతనం. కుక్కను సింహాసన మెక్కించ దల్చడం బుద్ధిహీనత కాపోతే ఇంకేవిఁటి?" అంటూ ఉద్రేకంతో వెనక్కి తిరిగి చరచరా పోయాడు.

రుక్మిణి నిర్విణ్ణురాలై శిలాప్రతిమలా ప్రకాశంవేపు చూస్తూ వుండిపోయింది. ప్రకాశం నిష్క్రమించాక రాజారావు వేపు తిరిగింది. అతని కళ్ళు చింతనిప్పుల్లా మిలమిల మెరుస్తున్నాయి. అయినా ఆమె భయపడలేదు. ఇటువంటి సంఘటనలకు ఆమె అతీతురాలయ్యింది.

"ఏవిఁటలా చూస్తున్నావు రాజా!" అంది మందహాసం తెచ్చి పెట్టుకుంటూ.

"రాజా!" వెటకారంగా అన్నాడు రాజారావు. "ఆ మాటలో ఎంత విషముందో ఇప్పుడు తెలిసింది రుక్మిణీ! శేషాచలం వెళ్ళి పోయాక నేనే నీ సర్వస్వమన్నావు. జీవితమంతా నాతోనే గడుపుతా నన్నావు. వేశ్యవని తెలిసికూడా నీ నటనను అర్థంచేసుకోలేకపోయాను"

"నిజమే రాజా! నీ వొక్కడితో వుంటే నా జీవితం ఎలా గడు స్తుంది చెప్పు!"

"ఎందుకు గడవదు? ఏ విషయంలో నీకు లోటు కలిగిస్తున్నా నని" కోపంగానే అన్నాడు.

"అయినా ప్రకాశం కూడా నీలాంటివాడే! ఎలా పొమ్మనడం?" అంది.

రుక్మిణి అంత పెడసరంగా జవాబు చెప్పడం రాజారావుని రెచ్చ గొట్టింది.

"ఔను యెలా పొమ్మంటావు? నీ గుణం పోనిచ్చుకుంటావా యేవిఁటి?" కోపంగా అన్నాడు.

"రాజా !" ఇంక ఆపమన్నట్టుగా కేకవేసింది. అంతే ! ఆమె చెంప ఛెళ్ళుమంది.

"నన్ను కొట్టడానికి నీకేం అధికారం వుంది ?" అంటూ యెదిరించింది.

రాజారావులో ఉద్రేకం పరాకాష్ఠ నందుకుంది.

"అధికారం ! ఒకరిచ్చేదేవిఁటి అధికారం ? దబ్బుకో కొనుక్కుంటున్నాను. నిన్ను కొట్టడం కాదు....నువ్వు ఆడిన నాటకానికి చిత్రవధ చెయ్యాలి తెలుసా ?"

"ముందు బైటికి నడు" గర్జించింది రుక్మిణి.

"బైటికి నడవాలేం....నీ అంతు చూసి నడుస్తా" అంటూ ఆమె మెడపైకి రెండుచేతులూ పోనిచ్చి గట్టిగా నొక్కాడు. రుక్మిణి కేకలు వేసింది. క్రమంగా గొంతు పూడుకుపోయింది. తన చేతుల్లోంచి ఆమె భౌతిక శరీరం జారి క్రిందపడిపోవడం చూసిన రాజారావుకి మతి చలించిపోయింది. తను హత్యచేశానన్న భావం అతనిలో విచిత్ర పరిణామాల్ని తెచ్చింది. అప్పటికే ఇరుగు పొరుగు వాళ్ళు చేరారు. క్రింద పడివున్న రుక్మిణిని, యెదురుగా వున్న రాజారావుని చూసి కొందరు కెవ్వున కేకవేశారు. 'పోలీస్' అని యెవరో అరుస్తూ పరిగెత్తారు అయినా రాజారావు చలించలేదు. భయపడి పారిపోలేదు. రుక్మిణిని తను చంపాడు. అది యదార్థం. ఆమె చేసిన పాపాలకు తనే స్వయంగా ప్రాయశ్చిత్తం చేశాడు. తన జీవితంలో 'ఇదో గొప్ప సంఘటన' అని అనుకుంటుండగా పోలీసు వచ్చారు.

"ఏవిఁటిదంతా ?" గర్జించాడు.

"నే నీమెను హత్య చేశాను. పదండి స్టేషనుకి" అంటూ తన తప్పు తానే ఒప్పుకుని పోలీసు వెంట నడిచాడు రాజారావు.

అక్కడ చేరిన వారంతా రాజారావు వింత ప్రవర్తనకి విస్తుపోయి తలో విధంగా అనుకున్నారు.

"మతి చలించింది"

"కాదు. చంపాలని చంపాడు గాబట్టే తప్పు ఒప్పుకున్నాడు"

"ఒప్పుకోక యేం చేస్తాడు? పారిపోతే మాత్రం తప్పించుకో గలడా?"

ఈ విధమైన నిర్ణయాలు వెల్లడించారు. క్రమంగా దొమ్మి పల్చ బడింది. ఇరుగు పొరుగు వాళ్ళే మిగిలారు. రుక్మిణి మరణానికి వాళ్లెంతో విచారించారు.

6

ఆరోజు శేషాచలం షాపుకి వెళ్ళలేదు. వంట్లో కాస్త అస్వస్థతగా వుండటంవల్ల ఆరోజు రానని జగన్నాధంకి చెప్పేశాడు కూడాను. ముందు వరండాలో వాలు కుర్చీలో కూచుని చుట్ట కాల్చుకుంటున్నాడు. ఉదయం తొమ్మిది గంటల వేళ....పోస్టుమాన్ ఉత్తరం తెచ్చి ఇచ్చాడు. శేషాచలం అడ్రెసు ఓసారి చూశాడు. వెంకట్రావు దస్తూరీయే.... ఆసక్తితో కవరు చించాడు. ఉత్తరం తీసి చదివాడు. అతని ఆనందం ఆ కళ్ళల్లోనూ, మొహంలోనూ ప్రస్ఫుటమౌతూంది. అతని పెదాలపై చిన్న మందహాసం మెరుపులా మెరిసింది.

"పంతులూ!" ఉత్సాహంతో కేకవేశాడు.

"వస్తున్నా బాబూ!" అంటూ వచ్చి "ఏమిటి బాబూ విశేషం?" అన్నాడు.

"ఈ రోజు మనకి పర్వదినం పంతులూ !" ఆనందాతిరేకంలో మునిగి తేల్తూ అన్నాడు శేషాచలం.

అతని సంతోషానికి కారణం ఏమిటో పంతులుకి అంతు చిక్క లేదు. ఎంత ఆలోచించినా గ్రహించలేక పోయాడు.

"ఏవిటి బాబూ మీ ఆనందం ? విషయమేమిటో చెప్పి నన్నూ ఆ ఆనందాన్ని పంచుకోనీయండి"

"రుక్మిణి చచ్చిపోయిందట పంతులూ !"

"ఏమిటీ ! చచ్చిపోయిందా ?" సంతోషం పెల్లుబుకుతూవుంటే ఉత్సాహంగా యెదురు ప్రశ్న వేశాడు పంతులు.

మరణవార్త కొందరికి విషాదాన్ని కలిగిస్తే, కొందరికి సంతోషాన్ని కలిగిస్తుంది. విచిత్ర ప్రపంచం !

"చావంటే సహజమైన చావుకాదు పంతులూ ! ఎవడో దాని ప్రియుడు పీక నులిపి హతంచేసి, పోలీసులకి తనకి తానుగా లొంగిపోయాడట. నిజంగా అతడు నాకు కనిపిస్తే, అతడు నాకు చేసిన ఉపకారానికి బహూకరించే వాణ్ణి. ఇదంతా కేవలం దైవికం పంతులూ ! దైవం అమ్మాయి పక్షాన వుంది. ఇక ఫరవాలేదు. ఇక మనం విశ్రాంతగా వుండొచ్చు. నా బ్రతుకునీ, అమ్మాయి జీవితాన్నీ నడివీధికి లాగే అవకాశంగానీ, అవసరంగానీ, ఇంకెవరికీ లేదు. వెంకటారావు కూడా అదే రాస్తూ, అక్కడికి మళ్ళీ వచ్చేయమంటున్నాడు" అన్నాడు శేషాచలం.

"అయితే మీరేం నిర్ణయించారు ? వెళ్ళిపోతామా ?" ఆతృతగా అడిగాడు పంతులు.

మద్రాసు జీవితం పంతులుకి బాగా నచ్చింది. అక్కణ్ణుంచి మరలిపోవడం అంటే బాధగానే వుంటుంది. అందుకే ఆ ఆతృ కూడాను.

"మళ్ళీ అక్కడికి పోవడం నాకు ఇష్టంలేదు పంతులూ! ఇక్కడ స్థిరపడిపోవడానికే మొదట్లో నిశ్చయించుకున్నాను. ఆ నిశ్చయాన్ని మార్చదల్చుకోలేదు. వ్యాపారం కూడా బాగానే సాగుతోంది. జగన్నాధం మనకి అన్ని విధాలా తోడు నీడగా వుంటున్నాడు. మనం ఈ పరిస్థితుల్లో ఇక్కణ్ణుంచి వెళ్ళిపోవడంలో అర్థం వుండదు. వెంకటా్రివునే ఓసారి రమ్మనమని ఉత్తరం రాశాను. మళ్ళీ రాస్తాను" ముగించాడు శేషాచలం.

పంతులు తృప్తిగా శ్వాస పీల్చాడు. "అదే నా అభిప్రాయమూను బాబూ!" అన్నాడు.

"మరింకేం? నీకూ మద్రాసు విడిచిపెట్టి పోవాలని లేదన్న మాట" నవ్వుతూనే అన్నాడు.

పంతులు నవ్వేసి ఊరుకున్నాడు.

"వెళ్ళి నీపని చూసుకో పంతులూ!" అంటూ లేచి యింట్లోవలికి వెళ్ళి ఆ ఉత్తరాన్ని భద్రంగా దాచాడు. టేబిలు దగ్గరికి వచ్చి వెంకటా్రివుకి ఓ ఉత్తరం రాశాడు కృతజ్ఞత తెలుపుకుంటూ.

వంట్లో నీరసంగా వుందని ఆరోజు యింట్లో వుండిపోయినా, ఆ ఉత్తరం చూశాక అతనికి యెక్కడలేని ఉత్సాహమూ, శక్తీ వచ్చాయి. గబగబా బట్టలు వేసుకున్నాడు.

"పంతులూ! నేనలా షాపుకి వెళ్ళొస్తాను" అంటూ బయలుదేరాడు.

"వంట్లో నీరసంగా వుందంటున్నారు....మరిప్పు డెందుకు బాబూ?" ఆత్మీయుడిలా ప్రశ్నించాడు పంతులు.

"ఈ ఉత్తరం పోస్టుచేసి వచ్చేస్తానోయ్!"

"నా కివ్వండి. నేను పోస్టుచేసి వస్తా"

"అదికాదోయ్! అలా జగన్నాధం దగ్గరికి వెళ్ళి ఈ శుభవార్త

అందజెయ్యాలనుకుంటున్నాను" అంటూనే బయటికి నడిచాడు శేషా చలం.

యజమాని ఆనందానికి విస్తుపోలేదు పంతులు. అది సహజమను కున్నాడు కూడాను.

* * *

ఆరోజు దుకాణంకి రానని చెప్పిన మిత్రుడు అకస్మాత్తుగా ఊడి పడ్డం జగన్నాధంకి ఆశ్చర్యం కలిగించింది.

"ఏమిటి విశేషంరా ? రానని చెప్పి వచ్చావేం ? ఇంట్లో కూచుని విశ్రాంతి తీసుకోలేకపోయావా ?" ప్రశ్నించాడు.

"ఊరికినే రాలేదురా ! విశేషముండే వచ్చాను. నీకు యెప్పుడు చెప్తానా అన్న ఆతృతను ఆపుకోలేక పోయాను" అన్నాడు శేషాచలం.

"ఇంతకీ విశేషం ఏమిటి ?"

వెంకటావు ఉత్తరం వ్రాసిన వైనం, రుక్మిణి హత్యచేయబడ్డ విషయం, అంతా వివరంగా చెప్పాడు శేషాచలం.

"పోనీలే, నీ మనోభీతి తీరింది. ఇక నిశ్చింతగా వుండు" మంద హాసంతో అన్నాడు జగన్నాధం.

"అదే కదా నా ఆనందమంతాను"

"అన్నట్టు నువ్వుంటున్న యిల్లు అమ్మేస్తారట .... పాతికవేలు చెప్తున్నారు. ఏమంటావు ?"

శేషాచలం ఆలోచనలో పడ్డాడు. పాతికవేలిచ్చి కొంప కొను క్కుంటే బాగుంటుందిగాని, దానికోసం అంత డబ్బు పెట్టడం అంతగా ఇష్టంలేకపోయింది.

"ఇప్పుడే తొందరేమొచ్చిందిరా జగన్నాధం ? తర్వాత చూసు కుందాం" అనేశాడు తేలిగ్గా.

కాని జగన్నాధం అంత తేలిగ్గా వొదిలిపెట్టలేదు.

"మనకి తొందర లేకపోవొచ్చు.కాని విక్రయించే వారికి తొందర లేకుండా వుంటుందా చెప్పు ? ఈ విషయం కాస్త ప్రచారంలోకి కాస్త వచ్చిందంటే, ధరా పెరుగుతుంది.మనకి దక్కనూ దక్కదు. అందుకే కొనేద్దామని వుంది"

"నాకూ ఆ అభిప్రాయం వుందిరా ! కాని అత్యవసరంగా డబ్బు కావల్సివస్తే, చేతిలో వున్నది వదులుకొని యింకెక్కడికో పరుగెత్తాలి. అదే ఆలోచిస్తున్నాను"

"అంతగా ఆలోచిస్తే చప్పున ఏ నిర్ణయానికీ రాలేం తెలుసా ? చేతిలోవున్న డబ్బు వెచ్చించి కొనేయడం మంచిది. తర్వాత అవసర మైతే, అప్పుడు చూసుకోవచ్చులే. పాతిక వేలంటున్నారుగాని, ఇరవై, ఇరవై రెండు వేలుకి ఖాయమవ్వొచ్చు. ఏమంటావ్ ?"

"నీకు ఇష్టంగావుంటే కొనేద్దాం. నువ్వన్నమాట కూడా నిజమే. తర్వాత ఆ పరిసరాల్లో యిల్లు దొరక్కపోవచ్చు" తనూ ఆ యిల్లు కొనా అన్న నిర్ణయానికి వచ్చినట్టు వెల్లడిచేశాడు శేషాచలం.

"అయితే ఖాయం చేసేస్తాను"

"అలాగే కానీయ్....మరి నే వస్తాను. సాయంత్రం యింటికి వస్తావుకదూ !" అంటూ లేచాడు.

"వస్తాలే !"

శేషాచలం అక్కణ్ణుంచి యింటివేపు నడిచాడు. తనుకూడా మద్రాసులో స్థిరపడిపోతున్నానన్న ఆలోచనలు పెనవేసుకుంటూ ముందుకు సాగిపోయాడు.ప్రస్తుతం అతనికి పరిస్థితులన్నీ అనుకూలంగా వున్నట్టే అగుపించాయి.ఆ ఆనందంతో ఉత్సాహంగా నడిచిపోతున్నాడు.

7

కొన్ని సంవత్సరాలు కాలచక్రంలో లీనమయ్యాయి. శేషాచలం ఇప్పుడు వృద్ధాప్యపు వడిలో పడ్డాడు. శిరోజాలు పూర్తిగా నెరిసిపోయి, అతని మొహానికి వింత శోభను కలిగిస్తున్నాయి. చెక్కిళ్ళు ముడతలు పడ్డాయి. ఆరోగ్యం మాంచి పటిమలో వుంటూ రావడంవల్ల నీరసించి పోలేదుగాని, నడుం మాత్రం వంగిపోయింది.

గిరిజ ఇప్పుడు యుక్తవయస్కురాలు. పద్దెనిమిదేళ్ళ పడుచు. పాలమీగడలాంటి శరీరం; పొడుగ్గాటే కాకుండా, బొద్దుగా లేకుండా, ఎంతో ఆకర్షణీయంగా వుంటుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే మనిషి మెరుపు తీగెలా వుంటుంది. ఆమెలో మరో ప్రత్యేకత కలువ రేకుల్లాంటి కళ్ళు, సన్నని పెదాలూను. ఆమె మొహంలో యెల్లప్పుడూ ప్రసన్నత ద్యోతకమౌతూ వుంటుంది. ఆమెను చూసి శేషాచలం ఎంతగానో మురిసిపోతూ వుంటాడు. కూతుర్ని చూసినప్పుడంతా సుందరమ్మే గుర్తుకు వస్తుండేది కూడా. అదే సమయంలో అతనికి ఆమె మాటలు జ్ఞప్తికి వచ్చేవి. గిరిజను తను వృద్ధిలోకి తీసుకొచ్చి, మంచి సంబంధం చూసి పెళ్ళిచెయ్యాలి. తన అభీష్టం కొంతవరకూ నెఱవేరింది. ఇంక తను చేయవల్సింది చాలా వుంది. అనుకునేవాడు.

ఓ నాటి సాయంత్రం గిరిజ తోటి విద్యార్థినులతో కలిసి బీచ్‌కి వెళ్ళింది. సాధారణంగా ఆమె యెప్పుడూ బీచ్‌కి వెళ్ళదు. ఆరోజు స్నేహితురాండ్రంతా బలవంతం చేసేసరికి కాదనలేకపోయింది.

వీళ్ళంతా ఓ చోట కూచున్నారు. సరదాగా కాస్సేపు కబుర్లు చెప్పుకున్నారు. ఇంతలోనే కొందరు యువకులు ఆడుతూ పాడుతూ వచ్చి ఆ

పక్కనే కాస్తంత దూరంలో కూలబడ్డారు. కొందరు విట్టీగా మాట్లాడు కుంటున్నారు. ఒక అబ్బాయి కూనిరాగాలు తీసుకుంటున్నాడు. ఉండుండి ఫకాల్న నవ్వుతున్నారు. ఆ నవ్వు మరేవిఁటో కాదు....పక్కనే వున్న విద్యార్థినుల గుంపుపై ఒక అబ్బాయి విమర్శలు విసురుతూ వుంటే, సినిమా తారల పేర్లు ఒక్కొక్కరికి అంటిస్తూవుంటే యెవరికీ నవ్వు ఆగడం లేదు.

ఇక గిరిజ బృందానికి అరికాలిమంట నెత్తికెక్కుతూ వుంది.

సాధారణంగా విద్యార్థుల్లో అందరూ ఒక్కలా వుండరు. ఆనంద రావుకి యెందుకో ఆ అమ్మాయిల అసహాయస్థితి (అతనలా అనుకున్నాడు) కి జాలి కలిగింది. స్వతహాగా అతను పెంకిఘటం కాదు. పైగా అమ్మాయిల్ని యేడిపించడమన్నది అతనికి యిష్టంలేని పనుల్లో ఒకటి.

"ఊరుకోండొరే! వాళ్ళ జోలి మనకెందుకు?" అన్నాడు. "వాళ్లెవరో యేవిఁటో?"

"ఏవిఁటోరియ్! నీపాటి జ్ఞానం మాకు లేదనుకుంటున్నావా ఏవిఁటి? ఇదో విధమైన ఆనందంరా! వాళ్ళు మనకేమీ తీసిపోరులే.... వాళ్ళ సంభాషణ తీరూ చూడ్డంలే....కాలేజీ విద్యార్థినులే" అన్నాడు రాంబాబు. వాళ్ళల్లో అందరికంటె పెంకిఘటం ఇతనే.

"మన కాలేజీలో చదువుతున్నారా?" ఆత్రంగా అడిగాడు ఆనందరావు వెనుకా ముందూ ఆలోచించకుండా.

రాంబాబు వెటకారంగా నవ్వేడు.

"ఏం, అంత ఆత్రుత కలిగింది? వీళ్ళల్లో యెవర్నీ యెప్పుడూ చూళ్ళేదన్న బాధ గామోసు! పాపం! మన కాలేజీలో కాదులే" వెటకారంగానే అన్నాడు.

విద్యార్థులంతా ఫక్కున నవ్వేరు. ఆనందరావు నోటికి తాళం పడింది. ఇంకేం మాట్లాడినా తన మర్యాద దక్కనివ్వరనుకుని ఊరుకున్నాడు.

"చూడండొరే. ఆ అమ్మాయి పోజు ? శకుంతల నాటకంలో శకుంతల పాత్రకు సరిగ్గా పనికొస్తుంది" అన్నాడు యెప్పుడూ నాటకాల గొడవతోనే సతమతమయ్యే సదానందరావు.

అమ్మాయిలంతా విస్తుపోయారు. ఆ మాటలు యెవర్ని ఉద్దేశించి అన్నవో యెవ్వరికీ అర్థంకాలేదు. ఎందుకైనా మంచిదనుకుని యెవరి మట్టుకు వాళ్ళు సర్దుకూర్చున్నారు. "శాంతారామ్‌కి పోటీగా నువ్వో సినిమా తియ్యరా !" నవ్వుతూనే అన్నాడు రాంబాబు. మళ్ళీ అంతా నవ్వేరు.

అమ్మాయిల్లో ఒక్కొక్కరికీ సహనం పట్టుతప్పుతోంది. వాళ్ళ మొహాలు అప్పుడే అస్తమిస్తున్న సూర్యుణ్ణి కూడా దిక్కరిస్తున్నాయి.

"ఏమిటి వీళ్ళ పొగరు ? మనకే మాటలు చేతగావని అనుకుంటున్నారల్లే వుంది" ఉక్రోషంతో అంది రమ.

గిరిజ గాభరా పడింది. అనవసరంగా రభస జరుగుతుందేమోనని ఆమె భయం. ఎప్పుడూ రాని తను ఈవేళే ఎందుకు రావాలి ? అని మనసులో అనుకుంటూ "పోనీలే రమా ! వాళ్ళతో మనకేమిటి ? వేళయ్యిందిగా ! పదండి పోదాం" అంది మెల్లగా.

"అబ్బే ! ఊరుకుంటే మరీ చెలరేగుతారు" అంది కృష్ణవేణి, రమ వాదనను బలపరుస్తూ.

రమకి మరింత ధైర్యం వచ్చింది. "ఎందుకో అలా పోయిన కుండల్లా డబడబలాడతారు ? ఆడపిల్లల్ని ఏడిపించడంలో వుండే ప్రక్షా.

తెలివితేటలూ, ఉత్సాహమూ చదువుల్లో వుంటే, భారతదేశం ఏనాడో బాగుపడి వుణ్ణు" చిన్న ఉపన్యాసం ఇచ్చింది రమ.

ఇంత అల్లరిచేసిన అబ్బాయిలూ తెల్లమొహం వేశారు. తమలో పిరికితనం యెందుకు ప్రవేశించిందో యెవరికీ అర్థంకాలేదు.

"పోనీలే రమా! వాళ్ళకి బుద్ధిలేదని మనంకూడా గడ్డితింటామా?" అంది గిరిజ.

ఈ మాటలు అబ్బాయి లందరికీ చురుక్కుమనిపించాయి. ఆనంద రావు గిరిజవేపు చూశాడు. అతను ఆమెను చూడ్డం అదే ప్రథమం. ఆమెలో ఉద్రేకం లేదు. పెంకితనం అంతకంటె లేదు. కాని మంచి తెలివితేటలు వున్నట్టు నిర్ధారణ చేసుకున్నాడు.

"ఏవిట్రా అంతా బిక్కమొహాలు వేశారు? ఛా! ఛా! సిగ్గు చేటు" యెత్తిపొడిచి నట్టుగా అన్నాడు తన బృందం వాళ్ళతో.

"ఒరేయ్ ఆనంద్! మొదట్నుంచీ సామరస్యానికి ప్రయత్నిం చిన వాడివి, ఇప్పుడిలా సమరానికి లాగడంలో నీ ఉద్దేశం యేమిటి?" అన్నాడు ఒక స్నేహితుడు.

"అదే వాడిలోని ప్రత్యేకత. వాడు మాత్రం మంచి వాడనిపించు కోవాలి. తతిమ్మా వాళ్ళంతా విలన్లవ్వాలి" ఉడుకుమోత్తనంగా అన్నాడు రాంబాబు.

"పదండి పోదాం" అంటూ లేచింది గిరిజ.

ఆనందరావు చప్పున తలెత్తి చూశా డామెవేపు. "తెలివితేటలే కాదు అందంకూడా నిండివుం దామెలో" అని మనసులో అనుకున్నాడు.

"ఔను! ఈ కోతిమూక దగ్గర వుండటం మనకి శ్రేయస్కరం కాదు. పదండి పోదాం" అంటూ లేచింది రమ.

అమ్మాయిలంతా లేచారు. మూతి విరుచుకుంటూ, మొహాలు చీద రించుకుంటూ వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిపోతూ వుంటే అబ్బాయిలంతా నవ్వుకున్నారు తామే జయించామన్న విజయగర్వంతో. ఆనందరావు మాత్రం నవ్వలేదు. గిరిజవేపే దృష్టినిలిపి చూస్తున్నాడు. ఆమె నడకలో వయ్యారాన్ని గమనిస్తున్నాడు. ఎందుకో మరి! ఆమెపై ఓ విధమైన అభిమానం ఏర్పడింది. అది అనురాగమో, ప్రేమో, అంతుచిక్కలేదు.

"ఏమిట్రా ఆనంద్! అలా రెప్పవెయ్యకుండా చూస్తున్నావు? అప్పుడే వారిలో యెవరినైనా ప్రేమించేశావా ఏమిటి కొంపదీసి?" అన్నాడొక మిత్రుడు.

"అలాగే అనిపిస్తుందిరా! మనందరి నోళ్ళూ మొట్టమొదటిసారిగా మూయించిందిగా! ఆ అమ్మాయిమీద కళ్ళు పడినట్టున్నాయి" అన్నాడు సదానందరావు.

"ఏ అమ్మాయి? 'కోతిమూక' అన్న అమ్మాయా? ఔనుమరి" ఆ వాక్యం మాత్రం గుండెల్లో నాటుకున్న అబ్బాయి అన్నాడు.

"మీ ఊహ తప్పు" అంటూ రాంబాబు అందుకున్నాడు. సాధారణంగా పెంకి వాళ్ళకి సూక్ష్మగ్రాహ్యత అలవడుతుంది. ఆ సిద్ధాంతం ప్రకారం రాంబాబు సూక్ష్మగ్రాహి. "మనవాడు తెలిసి తెలిసి, అటువంటి నోటిదురుసు వ్యక్తిని ప్రేమించాడంటే నేను నమ్మను. వీడిలానే సామరస్యం కోసం ప్రయత్నించిన అమ్మాయినే ప్రేమించేసి వుంటాడు. ఏమ్ ఐ కరెక్ట్ ఆనంద్!" ప్రశ్నార్థకంగా ఆనందరావు వేపు చూశాడు.

అందరూ మళ్ళీ ఒక్క పెట్టున నవ్వారు.

ఆనందరావు మొహం చిట్లించుకున్నాడు. "చాల్లెండ్రా! ఊరుకోండిక, ఎప్పుడూ యిదే గోల....పదండి పోదాం" అన్నాడు విసుగ్గా.

"అదిగో! ఆ ఆకర్షణ అట్లాంటిదిరా బాబూ! ఆమె వెంట పోవాలని వీడి ఆతృత" ఒక మిత్రుడు అరిచాడు.

అందరూ మళ్ళీ నవ్వేరు.

ఆనందరావు చతికల బడ్డాడు మరేమీ అనలేక.

కాస్సేపటి తర్వాత అంతా యిళ్ళముఖం పట్టారు.

అ రాత్రి ఆనందరావు చదువు సవ్యంగా సాగలేదు. అతని ఆలోచనలన్నీ ఆ అమ్మాయి గురించే. ఆమె పేరు తెలీదుగాని, ఆమె రూపాన్ని మాత్రం హృదయ ఫలకంమీద చిత్రించుకున్నాడు.

అనుకోకుండా మన జీవితాల్లో కొన్ని సంఘటనలు జరుగుతాయి. దాన్నే మనం 'అదృష్ట'మనీ, 'విధి' అనీ అంటాం. వాటిపైనే జీవితగమనం ఆధారపడి వుంటుంది. ఆనందరావు విషయంలో ఇదే జరిగింది. అసలు ఆమెకీ, అతనికీ వున్న సంబంధం ఏమిటి ? అతనిలో ఓ విధమైన మార్పు రావడం, మధురభావం జనించడం యెందుకు ? అదే విధి వైచిత్ర్యం.

మరుచటి రోజునుండి యెన్నోసార్లు ప్రయత్నించి చూశాడు ఆమె యెక్కడైనా అగుపిస్తుందేమోనని. బస్సు స్టాండుల దగ్గర, బీచ్ లోనూ, పార్కుల్లోనూ చూసేవాడు. కాని ఫలించలేదు ప్రయత్నం. విరహం మరింత సన్నిహిత్వాన్ని సాధిస్తుందంటారు. అదే జరిగింది ఆనందరావు విషయంలో. ఆమెను మర్చిపోవడం చేతకాలేదు సరిగదా, ఆమెకి మరింత సామీప్యంగా పోతున్నాడు మానసికంగా.

ఈ విధంగా వారం రోజులు యుగాల్లా గడిచాయి. ఆనందరావు ఓనాడు బట్టలకొట్టుకి పోయాడు. బిల్లు చెల్లించి, బట్టల పాకెట్ పట్టుకుని వెనుదిరిగే సరికి అతని ప్రణయసుందరి....ఇన్నిరోజులూ ఎవరి కోసమైతే యెదురు చూస్తున్నాడో, ఆ సుందరి కళ్ళముందు కనిపించింది. అతని కళ్ళను అతనే నమ్మలేకపోయాడు. హృదయం ఆనందంతో ఊగిసలాడింది. చప్పున పలకరించాలని అనుకున్నాడు. కాని, ఆమె

పేరు తెలీక ఒకవంతూ, సభ్యతకి ఆలోచించి మరోవంతూ వెనక్కి జంకేశాడు.

గిరిజ అతణ్ణి చూసింది. అతణ్ణి యెక్కడో చూసినట్టు గుర్తుకొచ్చి జ్ఞప్తికి తెచ్చుకుంది అయినా అంతగా పట్టించుకోనట్టుగానే ముందుకు సాగిపోయి కొట్టాయనతో ఏదో బట్టల విషయం అడుగుతోంది.

ఆనందరావుకి ఆ కొట్టులో పని ముగిసినా, వెళ్ళిపోవాలని బుద్ధి పుట్టడంలేదు. మళ్ళీ వెనక్కి వెళ్తే యెవరైనా ఏమన్నా అనుకుంటారే మోనని తటపటాయించాడు. అయినా, వెళ్ళిపోవడానికి కాళ్ళు రావడం లేదు. తప్పనిసరిగ వెనక్కి తిరిగి వచ్చాడు.

"అన్నట్టు మర్చేపోయానండీ! రేయాన్ పాంటింగు ఒక్కటి కావాలండీ!" అంటూ వచ్చి ఆమెకి కాస్త దూరంలో నుంచున్నాడు.

ఆమె సరిగ్గా అదే సమయానికి "వస్తానండీ! వారం రోజుల్లో వస్తాయని అన్నారుగా! అప్పుడే వచ్చి తీసుకుంటా.... సెలవు" అంటూ వెనక్కి తిరిగింది.

ఆనందరావు హతాశుడై, సందిగ్ధంలో పడ్డాడు. ఇప్పుడేం చెయ్యడమో అతనికి అంతుచిక్కలేదు. ఆమె అప్పుడే దుకాణం మెట్లు దిగింది. ఈ అవకాశం జారవిడుచుకోవడం అతనికి ఇష్టంలేదు. ఇటుచూస్తే, కొట్టాయన బట్టతెచ్చి అతని ముందు వేశాడు. అతని మెదడు ఆలోచనలతో నిండిపోయింది. అవుతే, కొట్టాయనకి సంజాయిషీ చెప్పుకోవడమే మంచిదనిపించి —

"ప్రస్తుతానికి వుంచండి.... మళ్ళీ వస్తా" అనేసి చరచరా బైటికి నడిచాడు.

కొట్టాయన ఆనందరావు ప్రవర్తనకి నివ్వెరపోయాడు.

"బట్ట కావాలని చెప్పి, మళ్ళీ మనసు మార్చుకున్నాడేవిఁటి ?" అనుకున్నాడు కొట్టాయన తనలో తనే కాస్త గట్టిగా అనుకుంటూ.

"కాలవిపరీతమండీ ! ఆ అమ్మాయి పోతుందిగా ! ఇంక ఇతనుంటాడా ?" అన్నాడో ముసలాయన.

అంతా ఫక్కున నవ్వేశారు.

ఆనందరావుకి ఈ నవ్వులు వినిపించలేదుగాని, గిరిజ మాత్రం కనిపించింది. చరచరా ఆమెకి దగ్గరగా పోయాడు. "క్షమించండి.... ఆరోజు మిమ్మల్ని బీచ్‌లో చూసినట్టు గుర్తు" అన్నాడు కాస్త తడబడుతూ, పరిచయం చేసుకుందుకు మరో మార్గం కూడా కనిపించలేదు.

"ఇదేం అంతర్జాతీయ రాజకీయాలకు సంబంధించిన విషయమా ఏమిటండీ ?" యెదురు ప్రశ్న వేసింది గిరిజ.

ఆనందరావు అసలే చాలా బిడియపు మనిషి. ఆ ప్రశ్నతో మరింత నిరుత్సాహపడ్డాడు.

"అబ్బే ! అబ్బే ! అదేం కాదులెండి" తడబడుతూ అంతే అనగలిగాడు.

ఇద్దరిమధ్య క్షణకాలం నిశ్శబ్దం నడిచింది.

"మీరు నన్ను వెంబడిస్తున్నారేమిటి ?" సూటిగా ప్రశ్నించింది.

"క్షమించమని మొదటే మనవి చేసుకున్నాను. మిమ్మల్ని ఆనాడు బీచ్‌లో చూసిందగ్గర్నించీ మీతో పరిచయం చేసుకోవాలన్న వుబలాటం కలిగింది. మీ రెక్కడైనా కనిపిస్తారేమోనని ప్రతిరోజూ చూసేవాణ్ణి. కాని లాభం లేకపోయేది. ఈవాళ కనిపించారు" అన్నాడు.

"మీ మగవాళ్ళకి ఇదో రోగమండీ ! అయినా, ఏమిటీ చొరవ ? మీకూ, నాకూ వున్న పరిచయం ఏమిటి ?"

ఆనందరావుకి ఇదో సదవకాశంగా కనిపించింది,

"అదిగోండి, అక్కడే మీరు పొరబడుతున్నారు. పరిచయమన్నది యెలా సంభవిస్తుంది చెప్పండి! ఎవరో ఒకరు మొదట చొరవ తీసుకుని పరిచయం చేసుకుంటేనే; లేదా, ఏదో ఒక సంఘటన పరిచయం చేస్తుంది. ఆనాటి బీచ్‌లో సంఘటనే మన పరిచయానికి 'నాంది' అనుకుందాం" ధైర్యంగానే చెప్పాడు.

ఆనందరావు వాక్చాతుర్యం గిరిజకు యెంతో ఆనందాన్ని కలిగించింది. అసలు అతనితో పరిచయం కలగడం ఆమెకీ సంతోషంగానే వుంది. కాని, ఆ సంతోషాన్ని అభివ్యక్తం చెయ్యలేకపోయింది స్త్రీగాబట్టి.

"చాలా దూరం పోతున్నారు" ముక్తసరిగా అంది మొహం పక్కకి తిప్పుకుంటూ.

"నేను ఏ విధంగానూ అసభ్యంగా ప్రవర్తించలేదనుకుంటాను" మళ్ళీ అన్నాడు.

"మీరు యెప్పుడూ అసభ్యంగా ప్రవర్తించరని ఆనాడు బీచ్‌లోనే తెలిసిపోయింది" అంది మెల్లగా.

ఆమె ఆంతర్యం ఏమిటో అంతుచిక్కలేదు. తననికూడా ఆ మూకలో కలిపేసి మాట్లాడుతుందా ఏమిటి? అనుకున్నాడు. తన మంచితనాన్ని వెల్లడి చేసుకోవాలనుకున్నాడు.

"నిజానికి ఆరోజు సంఘటన నాకు చాలా బాధ కలిగించింది. మా వాళ్ళంతా వట్టి పెంకిఘటాలు. నేను యెంత వారించినా వింటేనా? మీరు నా మాటలు నమ్మకపోతే నేనేం చెయ్యలేను" ప్రాధేయతగా అన్నాడు. తన పట్ల ఆమెకు సదభిప్రాయం కలిగించాలనే అతని తాపత్రయమంతాను.

అతని అమాయకత్వానికి నవ్వొచ్చిందామెకి. మరింకేమీ అనలేక పోయింది.

ఇద్దరూ కాస్సేపు మౌనంగా నడిచారు. ఆ మౌనం ఆనందరావుకి నచ్చలేదు. ఆమె యిల్లు సమీపిస్తున్నదేమోనన్న ఆతృతకూడా కలిగింది. మరి కాస్సేపు ఆమెతో కాలం గడపాలన్న కుతూహలం రెచ్చగొట్టింది.

"మీకు అభ్యంతరం లేకపోతే కాస్త కాఫీ తీసుకుందాం రండి" అన్నాడు పక్కనే కాఫీ హోటలు చూసి.

గిరిజ అదోలా అతనివేపు చూసింది. ఆమెలో విసుగే జనించిందో, కోపమే కలిగిందో యెవరూ చెప్పలేరు.

"బావుందండీ! ఈ కొద్ది క్షణాల పరిచయంతోనే యింత సన్నిహితాన్ని తెచ్చుకున్నారా! ఇంకా నయం షికారుకి పోదామన్నారుకాదు" అంటూ చిరుకోపంతో చూసి "నాకు వేళయ్యింది....వస్తా" అనేసి పక్కరోడ్డు పట్టింది.

ఆనందరావు గాభరా పడ్డాడు. తాను తొందరపడ్డానేమో నను కున్నాడు.

"క్షమించండి. మీరు అపార్థం చేసుకోవద్దు నన్ను. మన పరిచయం పుష్పించాలనే నా వాంఛ" అంటూ ఆమెను అనుసరించాడు.

"చూడండి, మా యిల్లు దగ్గరపడుతుంది. మీరింక శలవు తీసుకుంటారా?" అంది గిరిజ.

ఆనందరావు షాక్ తగిలినట్టుగా ఆగిపోయాడు. ఆమెకి ఇంకా విసుగు కలిగించడం ఇష్టంలేదు.

"మళ్ళీ యెప్పుడు కలుసుకుందామంటారు?" అన్నాడు.

"ఏం? అదంత అవసరమా?" సూటిగా ప్రశ్నిస్తూ ముందుకు సాగిపోయింది చరచరా.

ఆనందరావు నిరుత్సాహంతో స్తంభించిపోయాడు. అవుతే ఆమె యిల్లు తెలుసుకోడానికి అవకాశం కలిగిందనుకుని అక్కడే కాస్సేపు వుండి, ఆమె యింట్లోకి పోయాక తిరోగమించాడు.

గిరిజ అంత నిష్కర్షగా మాట్లాడిందేగాని తరువాత బాధపడింది. తను అలా ప్రవర్తించకుండా వుండాల్సింది.... అనుకుంది కూడా. నిజానికి ఆనందరావు పట్ల ఆమెకి సద్భావం లేకపోలేదు. అవుతే బాహ్యంగా బెట్టుసరి చూపిందన్నమాట. ఆరోజు రాత్రి ఆనందరావుని జ్ఞప్తికి తెచ్చుకోని క్షణం లేదనే చెప్పాలి.

ఆ రోజునుండి ఆనందరావు అప్పుడప్పుడూ గిరిజను కలుస్తూనే వున్నాడు. గిరిజ అతనికి యెంత దూరంగా వుండాలని ప్రయత్నిస్తూ వుంటే, ఆమె హృదయం అంత దగ్గరగా పోతుంది. ఇద్దరిలో అవ్యక్తంగా ఓ విధమైన సన్నిహితం యేర్పడింది. ఆ సన్నిహితం యెంత వరకూ వచ్చిందంటే, క్రమంగా ఆనందరావు ఆమెను ఏకవచనంలో సంబోధించడం ప్రారంభించాడు.

ఓ రోజు ఇద్దరూ చల్లని గాలిలో రోడ్డుమీద నడుస్తున్నారు. ఇంకా చీకటి పడలేదు. ఆనందరావు వున్న మాటను విప్పిచెప్పాలని నిశ్చయించుకున్నాడు.

"గిరిజా !" అని ప్రారంభించాడేగాని. సంశయంతో ఆగిపోయాడు.

"ఆగిపోయారేం ?" అందామె.

"నీతో ఓ విషయం చెప్పాలని వుంది"

"ఏమిటో చెప్పండి.... సంశయ మెందుకు ?"

"నిన్ను ఏ శుభముహూర్తంలో చూశానోగాని, నిన్ను మర్చిపోలేక పోతున్నాను. అనుక్షణం నీ రూపమే నా కళ్ళల్లోనూ, హృదయంలోనూ దోబూచులాడుతోంది. నా హృదయం విప్పి చెప్పుకుంటున్నందుకు నువ్వు అన్యధా భావించవని నా నమ్మకం. 'లవ్ యెట్ ఫస్ట్ సైట్'

అంటారే ఆ నిర్వచనాన్ని మొదట్లో నేను నమ్మేవాణ్ణి కాదు. కాని, స్వానుభవంవల్ల అది సంభవమేనని నిర్ధారణ చేసుకున్నాను. నా మనసు లోని మాట చెప్పుకున్నాను. ఇక నీ కరుణమీదే నా భావి జీవితం ఆధార పడి వుంది" అన్నాడు.

అతని గొంతులోని సౌమ్యత, ప్రాధేయత, గిరిజలో ఓ విధమైన అనుభూతిని కలిగించాయి. నిజానికి ఆనందరావుపై ఆమెకు కూడా అవ్యాజమైన ప్రేమాభిమానాలున్నాయి. అవుతే తను స్త్రీ గాబట్టి అత నిలా చెప్పుకోలేకపోయింది.

"ఇందులో నా నిర్ణయ మేముందండీ ?"

"అలాగనకు గిరిజా ! నా హృదయం నీకర్పించాను ఏనాడో ! నా ప్రేమను కాదనకు. నీ కిష్టమైతే నిన్ను పెళ్ళి చేసుకుంటాను. నా మాటలమీద నీకు నమ్మకంవుంటే, నీ నిర్ణయాన్ని చెప్పు"

'పెళ్ళి' అనేసరికి స్త్రీ సహజమైన సిగ్గు గిరిజను ఆవరించింది. ఆమె మొహం అప్రయత్నంగా రాగరంజితమయ్యింది. మొహం ప్రక్కకి తిప్పుకుంది.

"పెద్దవాళ్ళు వుండగా, మన నిర్ణయాలెందుకండీ ?" అంది మెల్లగా.

ఆనందరావుకి ఆమె మాటల తీరులోనే అర్థమయ్యింది ఆమె హృదయంలో తనకి కాస్త చోటుందని. ఎంతో మురిసిపోయాడు.

"పోనీ, మీ నాన్నగారితో అని చూడకూడదూ?" మళ్ళీ అన్నాడు.

"నేనెలా చెప్పేది చెప్పండి ? ఆయన ఏమనుకుంటారో ఆలో చించారా ? నేనేదో ఆయన కళ్ళు కప్పి, ప్రేమకలాపం సాగిస్తున్నానని అపోహ పడితే? అదీగాక ఏ భారత స్త్రీ కూడా తనంతట తాను 'ఫలానా వ్యక్తిని' ప్రేమిస్తున్నానని తలిదండ్రులతో చెప్పుకోలేదు. ఎంతో అని

వార్యమైన పరిస్థితులు ఏర్పడితే తప్ప: మీ నాన్నగారితో సంప్రదించి. ఆయన్నే పంపకూడదూ ?" అంది గిరిజ. ఈ వివాహానికి తను సుము ఖంగా వున్నట్టు నిర్ధారణయ్యింది ఆనందరావుకి. కాని. తన తండ్రి విషయం గుర్తుకొచ్చేసరికి నిరుత్సాహపడ్డాడు. గట్టిగా ఓసారి నిట్టూ ర్చాడు.

"అసలు విషయం నీకు తెలీదు గిరిజా ! మా నాన్నగారితో చెబితే కొంప మునిగిపోతుంది. ఆయన చెల్లెలి కూతురొకామె వుందిలే. వాళ్ళకి ఇంతా అంతా కాదు డబ్బు. పదితరాలవరకూ కూచుని తిన్నా తరగదు. అందరూ కలిసి ఆ అమ్మాయిని నాకు ముడిపెట్టాలని చూస్తు న్నారు. నిజానికి ఆమెను పెళ్ళిచేసుకోవడం నాకు యిష్టంలేదు. ఆ విష యం వాళ్ళతో చెప్పాను కూడాను. అయినా.నా యిష్టాయిష్టాలతో ప్రమే యం లేనట్టుగా సంబంధం మాత్రం నిశ్చయించారు"

"అటువంటప్పుడు మన పెళ్ళికి మాత్రం మీ నాన్నగారు యెలా ఒప్పుకుంటారు చెప్పండి ?" యెదురు ప్రశ్న వేసింది గిరిజ.

"అందుకే ఈ నా ప్రయత్నం. నువ్వు 'ఊఁ' అన్నావంటే మనిద్దరం రిజిష్టర్డు మారేజ్ చేసుకుందాం" అన్నాడు.

గిరిజ చిన్నగా నవ్వింది.

"అంతధైర్యం వున్నవాళ్ళయితే మీ నాన్నగారినే యెదిరించ వచ్చునుగా !" అంది.

ఆనందరావు జవాబు చెప్పలేకపోయాడు చప్పున. ఆమె అన్న దాంట్లో సత్యం లేకపోలేదనుకున్నాడు.

"మరిక పోదాం పదండి" అంటూ లేచిందామె

బేలమొహం వేసుకుని ఆనందరావు కూడా లేచాడు. ఆమె అన్న మాటే అతని మెదడులో గిర్రున తిరుగుతోంది. కాస్సేపు మౌనంగా

నడిచారు. పార్కుదాటి బయటికి వచ్చారు. రోడ్డుకి ఒక ప్రక్కగా నడుస్తున్నారు. ఇంకా చీకటి పడలేదు. ఆనందరావు ఆమెవేపు తదేకంగా చూస్తూ నడుస్తున్నాడు అప్పుడప్పుడు ముందు త్రోవ తిలకిస్తూ. గిరిజ మాత్రం తల దించుకుని ఏదో ఆలోచిస్తున్న దానిలా. నడుస్తోంది. కాని ఆమె గుండెల్లో గుబులుగానే వుంది.

"నిజంగా నీతో పరిచయం కలగడం నా అదృష్టమే గిరిజా! నువ్వే నా భార్యవైతే నా జీవితం తరించిపోతుంది" అన్నాడు మౌనంగా వుండలేక.

"మనం నడిరోడ్డుమీద యిటువంటి మాటలు ప్రసంగించడం బావుండదేమో యోచించండి. మనం ఇక్కడ విడిపోయి యెవరి మార్గాన వారుపోతే మంచిది" అంది తన భయం వెల్లడిచేస్తూ.

ఆమె మాటకి యెదురు చెప్పడంగాని, ఆమె మనసుకి కష్టం కలిగించడంగాని ఆనందరావుకి యిష్టంలేదు.

"సరే, అలాగే చేద్దాం గిరిజా! మళ్ళీ నీ దర్శన భాగ్యం యెప్పుడు? రోజూ ఇదే సమయానికి వస్తుంటాను. నువ్వు మాత్రం ఈ దీనుడిపై దయవుంచి, ఒంటరిగా కాలేజి నుండి రావడం అలవాటు చేసుకోవాలి" అన్నాడు.

గిరిజ కాదనలేకపోయింది. అలాగేననీ అనలేదు. మౌనంగా ఊరకుంది. మౌనం అర్ధాంగీకారంగా తీసుకుని తన దారిన తను పోయాడు ఆనందరావు ఆ రోజుకి గుడ్‌బై చెప్పేసి. గిరిజ ఓసారి అతను వెళ్ళిపోతున్నవేపే చూసి, చిన్నగా నవ్వుకుని తృప్తిగా, హాయిగా నిటూర్చింది.

ఆమె యిల్లు చేరుకునేసరికి పావుతక్కువ ఆరుగంటలు

కావస్తోంది. తన గదిలోకి పోయి టేబిలుమీద పుస్తకాలు పడేసి వంట గదివేపు పోయింది. పంతులు ఆమెను చూస్తూనే—

"ఎక్కడికి పోయావమ్మా ఇంత ఆలస్యమయ్యింది ?" ప్రశ్నించాడు.

"ఓ స్నేహితురాలింటికి వెళ్ళడంవల్ల ఆలస్యమయ్యింది పంతులూ !" అనేసింది తడబడకుండా. నిజం చెప్పడానికి ధైర్యం చాలింది కాదు. ఇప్పుడు అబద్ధం చెప్పినా, నిజం యెప్పటికైనా బయట పడుతుందన్న సత్యం ఆమె గ్రహించలేక పోయింది పాపం !

"అయినా ఇంతవేళవరకూ తిరగొద్దమ్మా ! నాన్నగారికి తెలిసిందంటే కోపగించుకుంటారు. అంతేకాదు; బాధపడతారు కూడాను" అన్నాడు పంతులు.

"సరేగాని, కాఫీ యిచ్చేద్దూ!" అంటూ మొహం కడుక్కుందుకు బాత్‌రూమ్‌లోకి పోయింది గిరిజ. పంతులు టిఫిను, కాఫీ ఆమె గదిలో ఏర్పాటుచేసి వుంచాడు గిరిజ మొహం తుడుచుకుంటూ వచ్చి టేబిలు ముందు కూచుని టిఫిను ఆరగించడం ప్రారంభించింది. ఆమె కళ్ళల్లో ఆనందరావు లీలగా మెరిశాడు. 'తనలో అప్పుడే యెంతమార్పు వచ్చేసింది ?' అనుకుంటూ లోలోన నవ్వుకుంది. ఆరోజు ఆమె హృదయం ఆనందంతో వెల్లివిరిసింది. ఆనందరావే తనకు భర్తవుతే, నిజంగా తను అదృష్టవంతురాలే ! అబ్బ ! యెంత అందంగా వుంటాడు! ఆ మాటలు యెంత మాధుర్యంగా వుంటాయి ? ఆ మంచితనం అందరిలోనూ వుంటుందా ? ఈ విధమైన ఆలోచనలు అసంఖ్యాకంగా ఆమె మస్తిష్కంలో సుళ్ళు తిరిగాయి. ఆ రోజంతా అవే ఆలోచనలు !

8

గిరిజ, ఆనందరావుల స్నేహం ప్రణయంగా మారి పూలు తొడి గింది. ఒకర్ని విడిచి ఒకరు వుండలేరేమోనన్న స్థితికి వచ్చిందా పరి చయం. అవుతే, అది వారికి యెలా సాధ్యమౌతుంది ? రోజూ సాయం కాలం మాత్రం కలుసుకునేవారు. ఏ పార్కుకో, బీచ్‌కో, కనీసం యే హోటల్లోనో కలిసి మాట్లాడుకునేవారు. ఆనందరావుకి తను 'లా' ఫైన లియర్ చదువుతున్నానన్న ధ్యాసే లేదు. గిరిజకి తను ఇంటరు చదువు తున్నానన్న దృష్టేలేదు. వాళ్ళ చదువు సంధ్యలు వెనకబడినవనే చెప్పాలి. తమ వివాహం సంగతి రోజూ మాట్లాడ్డమేగాని, ఒక పరి ష్కార మార్గానికి రాలేకపోతున్నారు. ఎవరూ ముందంజ వేయలేక పోతున్నారు. పిరికివాళ్ళు పాపం ! అంత పిరికివాళ్ళు ప్రేమించేసు కున్నారు మరి !

తమ పరిచయంగాని, తాము రోజూ కలుస్తున్నట్టుగాని, ఎవరికీ తెలీదని వారి భావం. పిల్లి పాలుతాగుతూ తనని యెవరూ చూడలేదని అనుకోవడం సహజమే. కాని వీరిగొడవ యెవరికి కావాలి ? అవుతే, గిరిజ గొడవ కావల్సినవారి కంటనే ఓరోజు పడ్డారు వీరు. అలాగని శేషాచలం కంటబడ్డం కాదు సుమండీ ! శేషాచలం స్నేహితుడు జగ న్నాథం ఓరోజు వీళ్ళిద్దర్నీ చూశాడు ఓ హోటల్లో. వాళ్ళు మాత్రం అతణ్ణి చూడలేదు. అసలు జగన్నాథమే వాళ్ళు చూడకుండా తప్పించు కున్నాడని చెప్తే బావుంటుంది.

జగన్నాథంకి గిరిజపై సద్భావం వుంది. అవుతే, ఆమె ఆ కుర్రా డితో తిరుగుతుంతటం చూసిందగ్గర్నించి, ఆ భావం కాస్త సడలింది.

'గిరిజ యెంతవరకూ బాధ్యురాలు?' అని తర్కం సాగించాడు జగన్నాధం తనలోనే. ఆ అబ్బాయే ఆమెను వల్లోకి లాగాడేమో! అయ్యుండొచ్చు. పెద్ద నగరాల్లో ఇదేమీ గొప్ప విషయంకాదు. ఆమె గోతిలో పడకుండా రక్షించాలి. ఎంతయినా ఆమె తన ప్రాణస్నేహితుడి కూతురు. తన కూతురవుతే చూస్తూ ఊరుకోగలడా? ఆమెను రక్షించడానికి మార్గం ఏమిటి? ఆమె చదువు మాన్పించడం? కాదు. పెళ్ళి చేసెయ్యాలి.... అదే ఉత్తమ మార్గం....అనిపించింది. ఆరోజు సాయంత్రం దుకాణం మూసివేశాక శేషాచలంతోపాటు వాళ్ళయింటికి వచ్చాడు.

"ఏమిట్రా జగన్నాధం, యెప్పుడూలేనిది ఈ వేళప్పుడు నా యింటికి నాతోపాటు వస్తున్నావు?" ప్రశ్నించాడు శేషాచలం యిల్లు సమీపిస్తుండగా. "అవసరముందిరా! పద" అనేశాడేగాని విషయం మాత్రం చెప్పలేదు.

ఇద్దరూ శేషాచలం గదిలోకిపోయి కూచున్నారు. ఏదో విశేషం వుందని శేషాచలం గ్రహించేశాడు. అవుతే, ఆ విశేషమేమిటో అని అతని మనస్సు ఆరాటపడసాగింది.

"చెప్పరా ఏమిటో!" ఆసక్తితో అన్నాడు.

"కొట్టుదగ్గరే చెప్పాలనుకున్నానుగాని, మనం ఏకాంతంగా ఒక్క నిముషంకూడా లేకపోయాం. అందుకే నీ యింటికి వచ్చాను. గిరిజకి పెళ్ళి ప్రయత్నాలు చెయ్యడం లేదేం?"

శేషాచలం చిన్నగా నవ్వేడు. 'ఈ మాట చెప్పడానికే ఏకాంతం కావల్సివచ్చిందా అని' అతనికి నవ్వు వచ్చినట్టుంది.

"ఈ విషయం చెప్పడానికి ఇంత రహస్యమెందుకు? మంచి వాడివే!" అన్నాడు మందహాసంతో.

"కాదురా! విశేషం వుంది గనుకనే రహస్యంగా చెప్పడానికి వచ్చాను. గిరిజకి పెళ్ళియీడు వచ్చింది కదా, పెళ్ళి చేసేస్తేకాదూ?" మళ్ళీ అన్నాడు జగన్నాధం.

"చదువుకుంటుంది....దాని చదువుకి అంతరాయం కలిగించడం యెందుకు చెప్పు ? ఎంతవరకూ దానికి చదవాలన్న ఆసక్తివుంటే,అంత వరకూ చదివిస్తాను. అయినా పెళ్ళికి ఇప్పుడు తొందరేమొచ్చింది ?".

"అంటే నీ ఉద్దేశం ! ఇంకామె చంటిపిల్లనుకుంటున్నావా ? నా మాట విను....అమ్మాయి పెళ్ళి ప్రయత్నాలు చెయ్యి"

జగన్నాధం అంత పట్టుదలగా యెందుకు ఆ విషయాన్ని నొక్కినొక్కి చెప్తున్నాదో శేషాచలం ఊహకి అందలేదు. దీనికి ఏదో కారణం వుండి వుంటుందని తలచునేసరికి, అతని మొహంలో రంగులు మారాయి. అప్రయత్నంగా మొహం వివర్ణమయ్యింది. ఒక్కుమ్మడిని మేఘావృతమైన ఆకాశంలా చిన్నబోయింది.

"అసలు సంగతి ఏమిటో చెప్పరా !" మామూలుగానే అన్నాడు కాని అతని కనుబొమలు ముడివడ్డాయి.

జగన్నాధం కాస్సేపు తటపటాయించాడు. తను చెప్పదల్చుకున్న విషయం స్నేహితుడిలో యెటువంటి పరిణామాల్ని తెస్తాయోనన్న ఆలోచనలో పడ్డాడు. అయినా చెప్పక తప్పదని భావించాడు.

జగన్నాధం కాస్త ముందుకి వంగి ద్వారంవేపు ఓసారి దృష్టిని సారించి, యెవ్వరూ లేరని నిర్ధారణ చేసుకుని రహస్యంగా చెప్తున్న వాడిలా అన్నాడు.

"ఒరేయ్ ! గిరిజ ఓ అబ్బాయితో కలిసి హోటల్లో మాట్లాడం చూశాను. నిజంగా నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. అందుకే ఆమె వివాహం ప్రసక్తి తీసుకొచ్చాను"

శేషాచలంకి మొహం గిర్రున తిరిగినట్టయ్యింది. తన సమక్షంలోనే ఏ ఆటంబాంబోపడి తను స్పృహ తప్పిపోతున్నట్టుగా ఫీలయ్యాడు. కళ్ళముందున్న ప్రపంచమంతా చీకటి ముద్దలా కనిపించ

సాగింది. అతని గుండెలు అతిజోరుగా కొట్టుకోసాగాయి. పెదాలు అప్రియత్నంగా వణికాయి. ఏమిటి తను వింటున్నాడు ? గిరిజ యెవరి ప్రేమపాశంలోనో యిరికిందా ? ఇంక ఆమె భవిష్యత్తు యెలా వుంటుంది ? అసలు ఈ రహస్య పరిచయం యెన్నాళ్ళనుంచి సాగు తోంది ? గిరిజ అమాయకురాలని తను అనుకున్నాడే ! ఆమెలో అప్పుడే నటన ప్రవేశించిందా ? ఒకవేళ ఆ వ్యక్తి తేనె మాటలకు లొంగిపోయి అతనితో లేచిపోతే ?.... ఒక్కసారి శేషాచలం వళ్ళు జలదరించింది. సుందరమ్మ గుర్తుకొచ్చింది. ఆమె మరణిస్తూ అన్న వాక్యాలు చెవుల్లో గింగురుపెట్టాయి సుందరమ్మను యే విధంగా ఆమె ప్రియుడు మోసం చేశాడో, ఆమె ఏ పరిస్థితుల్లో వేశ్యగా మారిందో, అవన్నీ లీలగా గుర్తు కొచ్చాయి. అతనికి తల తిరిగినట్టయ్యింది. సుందరమ్మకి తనిచ్చిన వాగ్దానం నిలబెట్టుకోలేడా ? గిరిజ పతనానికి ప్రారంభోత్సవం ఇదేనా ! పరిపరి విధాల అతని ఆలోచనలు సాగినయ్....

స్నేహితుడిలో కలిగిన సంక్షోభాన్ని జగన్నాధం గుర్తించాడు.

"అంత ఆలోచన ఏమిట్రా శేషూ !"

"ఎందుకో నాకు భయమేస్తుందిరా జగన్నాధం.... అమ్మాయి తప్పు మార్గంలో పడిందనే నా బాధ"

"ఇప్పుడేమీ మించిపోయింది లేదు.... పెళ్ళి చేసెయ్యి"

"కాని, గిరిజ ఆ అబ్బాయిని తప్పించి ఇంకెవ్వర్నీ పెళ్ళి చేసుకోనంటే ? ఈలోగా వాళ్ళిద్దరూ గుణించుకుని యెక్కడికో పారి యిస్తే ? నాకు రాబోయే అప్రతిష్ఠ మాట విడిచిపెట్టు.... అమ్మాయి జీవితం నాశనం తధ్యం" భయంతో అన్నాడు శేషాచలం.

"ఏమిట్రా నీ ఊహాగానం ?"

"నీకు తెలీదురా జగ్గూ! అసలు వీళ్ళమ్మ సుందరమ్మ గాధ అక్షరాలా ఇటువంటిదే! ఆమె ప్రేమికుడితో లేచి వచ్చేసింది. అతన్ని నమ్మింది. చివరికి అతడామెను మోసగించి, ఆమె అందాన్ని అనుభవించి, ఎక్కడికో పారిపోయాడు.ఆమె ఇంటికి తిరిగి వెళ్ళే స్థితిలోలేదు. మరోమార్గం లేదు. పరిస్థితులు ఆమెను వేశ్యగా మార్చినయ్. ఆమె చనిపోతూ అమ్మాయి తనలా కాకుండా చూడమని కోరింది. అందుకే నాకు భయంగా వుందిరా!"

జగన్నాథం కాస్సేపు తీవ్రంగా ఆలోచించాడు.

"అవుతే ఇప్పుడు ఏం చేస్తానంటావ్?"

"మొట్టమొదట అమ్మాయి చదువు మాన్పిస్తాను"

"తొందర పడకురా! నా సలహా ఒహటుంది. ఏమిటంటే, ఆ అబ్బాయిని ఓసారి ఇంటికి తీసుకురమ్మని గిరిజతో చెప్పు. అతడితో స్వయంగా మాట్లాడితే, ఆ మనస్తత్వం తెలిపోతుంది. అతను ఎటువంటి మనిషో కూడా మనం అర్థం చేసుకోవచ్చు"

శేషాచలంకి స్నేహితుడు చెప్పింది బాగానే నచ్చింది. ఒకవేళ ఆ అబ్బాయి ఇష్టపడితే, అతడినే అల్లుడిగా చేసుకుంటాడు... తప్పేముంది? అనుకుంటూ "సరే, నీ ఆలోచన బావుందిరా! అలాగే చేద్దాం" అన్నాడు.

"అబ్బాయి కూడా బావుంటాడు. నేను కళ్ళారా చూశానుగా మరి? గిరిజకి తగిన వరుడే! ఎటొచ్చీ అతడి చదువు సంధ్యలూ, ఉద్యోగ వివరాలూ యేమీ తెలీవు. అన్నట్టు, ఈ ఉద్రేకంతో గిరిజను తూలనాడకు సుమా!"

"అబ్బే! అసలు దాన్ని చూస్తుంటే కోపంరాదురా! చూడరా నా దురదృష్టం....ఆ రుక్మిణి మరణించింది. ఇక నాకు ఏచింతా లేదు భగ

వాన్ అనుకుండేసరికి. ఇదో సమస్య ప్రత్యక్షం" బాధగా అన్నాడు శేషాచలం.

"నువ్వేమీ అధైర్య పడకురా ! అన్నీ సర్దుకుంటాయి. వస్తా మరి" అంటూ బయలుదేరాడు జగన్నాధం. శేషాచలం అతణ్ణి వీధి వరకూ సాగనంపడానికి వచ్చి "సమయానికి నాకళ్ళు తెరిచావు.... నేనెంతో ఋణపడి వున్నానొరే !" అన్నాడు.

"అబ్బే ! నాకు ఋణపడివుండట మేమిటి ? ఆ భగవంతుని లీలావిశేషమే యిది.... అతనికే అందరమూ ఋణపడి వున్నాం" అంటూ ఇంటికేసి నడిచాడు.

శేషాచలం భారంగా అడుగులు వేసుకుని ఇంట్లోపలికి వచ్చి పాడు కుర్చీలో కూలబడ్డాడు. అతనికి నడుం విరిగిపోయినట్టయ్యింది.

"పంతులూ !" లోగొంతులో కేకవేశాడు. ఆ కంఠం కాస్తంత కంపించడం పంతులుకి ఆశ్చర్యం కలిగించింది.

"ఏం బాబూ !" అనుకుంటూ వచ్చాడు.

"అమ్మాయినిలా ఓసారి పిలువ్ !"

పంతులు యజమాని కంఠంలోని మార్పు చూసి ఏదో విశేష ముందనుకున్నాడు. వెళ్ళి గిరిజను పిల్చుకొచ్చాడు.

"కూర్చో అమ్మా !" మెల్లగానే అన్నాడు శేషాచలం. గిరిజ కూర్చున్నది. కాని, తండ్రి మొహంలోకి గంభీర్యంతో చూసి బిత్తర పోయింది.

"ఈరోజు కాలేజీనుండి తిన్నగా ఇంటికే వచ్చావా గిరిజా !" ఆమె మొహంవేపు చూడకుండానే అన్నాడు.

ఏనాడూలేని ఆ ప్రశ్నకి గిరిజ గాభరా పడింది. నాన్న ఈ ప్రశ్న యెందుకు వేస్తున్నారు ? తను, ఆనంధరావు కలిసి తిరుగుతుండటం ఏమన

రైనా చూశారేమో ! అబ్బే ! యెవరు చూస్తారు ? మళ్ళీ తనలో తనే సమాధానపడి యథాలాపంగా వేసిన ప్రశ్న అనుకుంది.

"ఔన్నాన్నా ! తిన్నగా ఇంటికే వచ్చేశాను" నిజంచెబితే యేం ప్రళయం వస్తుందోనన్న భయంతో అలా చెప్పేసింది.

కూతురు అబద్ధం చెప్పినందుకు మరింత బాధపడ్డాడు శేషాచలం.

"చూడమ్మా గిరిజా ! అబద్ధాలు చెప్పడం సులువని మనం అనుకుంటాంగాని, వాటిని సమర్ధించుకోవడం బహుకష్టం. ఒకసారి అబద్ధాలకు దాసులమయ్యామంటే, జీవితాంతం మనల్ని ఆ గుణం విడిచిపెట్టదు. దానివల్ల యెన్నో అనర్థాలున్నాయి. నువ్వు అబద్ధం చెప్తున్నావంటే నాకే బాధగా వుంది. నిజం చెప్పమ్మా ! హోటల్లో నీతోపాటు కూచుని మాట్లాడుతున్న అబ్బాయి యెవరు ?" సూటిగా ప్రశ్నించి ఆమె మొహంలోకి చూశాడు.

గిరిజ స్తంభించిపోయింది. ఈ విషయం తండ్రికి యెలా తెలిసిందో అవగాహన కావడంలేదామెకి. తను అబద్ధం చెప్పినందుకు అప్పుడు బాధపడింది దామె. ఏం చెప్పాలమా అని సందిగ్ధంలో పడింది. నిజం చెప్పక తప్పదనుకుంది.

"ఎలా తెలిసిందా అని ఆలోచిస్తున్నావా తల్లీ ? మీ జగన్నాధం బాబాయి కళ్ళారా చూశాడు. అది చెప్పడానికే మన యింటివరకూ వచ్చాడిప్పుడు. వాడే నా కళ్ళు తెరిపించాడు. నిజం చెప్పు. యెవరా అబ్బాయి ?"

గిరిజకి ఇంక చెప్పక తప్పలేదు.

"ఎవరో నాకు తెలీదు నాన్నా ! ఓనాడు విచిత్రంగా మా ఇరువురికీ పరిచయం జరిగింది. అప్పట్నుంచీ ఆయన అప్పుడప్పుడూ నా కోసం కాలేజీ ఆవరణలో కాచుక్కూర్చుంటున్నారు. నాలోనూ ఏ బల

హీనతో అతనివెంట నడిపిస్తుంది" మొహం దించుకుని న్యాయస్థానంలో నేరస్థుడు తన తప్పును ఒప్పుకుంటున్న విధంగా చెప్పేసింది.

"ఆ అబ్బాయి ఏం చేస్తున్నాడు ?"

"'లా' ఫైనలియర్ చదువుతున్నాడట"

"అయినా తల్లీ, నువ్వలా అతనితో తిరగడం ఏమన్నా బావుందా? క్షణం మనది కాదమ్మా ! ఏ క్షణంలో ఏ బలహీనతకి లోనవుతామో యెవ్వరమూ చెప్పలేం. అటువంటిది యౌవ్వనవతివి నువ్వు ఒంటరిగా అతనితో తిరగడం ఏం సభ్యతగా వుంది చెప్పు ?" సౌమ్యంగానే అన్నాడు.

గిరిజ కళ్ళు అప్రయత్నంగా చెమ్మగిల్లాయి. "తప్పేనాన్నా ! ఇంకెప్పుడూ ఆయనతో తిరగను; మాట్లాడను" అనేసింది. ఆమె కంఠం బొంగురోయింది.

"అది తరువాత విషయంగాని, రేపు ఆయన కనిపిస్తే మనింటికి తీసుకురా ! అతనితో మాట్లాడాలి" అన్నాడు.

తండ్రి ఔదార్యానికి, సహృదయతకీ లోలోన అతణ్ణి అభినందించుకుంది. కాని, ఒక్క అనుమానం వచ్చింది.'ఎందుకు అతణ్ణి రమ్మనట్టు ? చీవాట్లు పెట్టడానికి కాదుకదా ! ఉహూఁ ! నాన్న అటువంటి మనిషికాదు' అని మళ్ళీ సమాధానపడింది.

"అలాగే నాన్నా !" అంది ఉత్సాహం అణుచుకుంటూ.

"వెళ్ళి నీపని చూసుకో !" అనేశాడు.

గిరిజ ఉత్సాహంగా వురకలు వేస్తున్న హృదయంతో తన గదిలోకి పోయింది. 'నాన్న యెంత మంచివాడు ?' అనుకుంది మళ్ళీ మరోసారి.

శేషాచలం ఏమిటేమిటో ఆలోచన సాగిస్తున్నాడు.

9

మరుసటి రోజు సాయంత్రం గిరిజకోసం కాలేజీ ఆవరణలో కాచుక్కూర్చున్నాడు ఆనందరావు. గిరిజ క్లాస్సేపటికి ఒంటరిగా వచ్చింది. ఇద్దరూ కలిసి నడిచారు. వీళ్ళిద్దర్నీ చూసి కొందరు విద్యార్థినులు పకపక నవ్వుకున్నారు. అది వెక్కిరింత రూపంలో అయినాసరే, అందులో అసూయ కూడా మిళితమైవుందని వారి చూపులే చెప్తున్నాయి.

"మనల్ని చూసే గామోసు వాళ్ళు నవ్వుతున్నారు" అంది గిరిజ.

"వాళ్ళ మొహం! నవ్వుకోనీ" అనేశాడు ఆనందరావు.

గిరిజ క్లాస్సేపు మౌనం వహించింది.

"ఈవేళ బీచ్‌కి వెళ్దామా?" ప్రశ్నించాడు ఆనందరావు.

"ఈవేళ ఎక్కడికీ వెళ్ళం. మాయింటికి పోదాం" నిర్లిప్తంగా అంది గిరిజ. ఆమెలో ఉత్సాహం వున్నా ఆందోళనకూడా లేకపోలేదు.

ఆనందరావు తృళ్ళిపడ్డాడు.

"మీ ఇంటికా? ఏమిటి నువ్వంటున్నది గిరిజా?" అన్నాడు సంభ్రమంతో.

"మిమ్మల్ని తీసుకు రమ్మని మా నాన్నగారు చెప్పారు"

ఆనందరావు నిలువునా నీరయ్యాడు. నోరు తెరచి క్లాస్సేపు శిలా ప్రతిమలా వుండిపోయాడు.

"నన్ను తీసుకు రమ్మన్నారా? మన స్నేహం మీ నాన్నగారికి తెలిసిపోయిందా ఏమిటి?" ఆశ్చర్యంతోనూ, భయంతోనూ అన్నాడు.

"ఔనండీ! తెలిసిపోయింది. మనం నిన్న మ హోటల్లో కూమని

మాట్లాడుకుంటూ వుండటం మా జగన్నాధం బాబాయిగారు చూశారట. మా నాన్నతో చెప్పారు.

"కొంపమునిగింది. మీ నాన్నగారు నిన్ను కోప్పడి వుంటారను కుంటాను" అన్నాడు—తప్పనిసరిగా అది జరిగివుంటుందన్న నిబ్బరంతో.

"మా నాన్నగారి సంగతి మీకు తెలీదులెండి. ఆయనకి నామీద అసలు కోపమే రాదు. మామూలు ధోరణిలో మనం ఇలా కలుసుకోవడం 'తప్పు' అని అన్నారు తప్పించి, మరేమీ కూకలు వేయలేదు"

"మరి నన్నెందుకు రమ్మన్నారు ?"

"అదే నాకూ అర్థం కావడంలేదు. బహుశా మీ అభిప్రాయం తెలుసుకోడానికేమో !"

ఆనందరావు కాస్సేపు యోచించాడు. అతని కళ్ళల్లో అర్థంకాని సంకోచమేదో దోబూచులాడుతోంది.

"ఉఁహూఁ ! నేను రాను గిరిజా !" చప్పున అనేశాడు.

గిరిజ నివ్వెరపోయింది.అతను రాకపోతే అతని గురించి తండ్రి ఏ విధమైన భావాన్ని పెనవేసుకుంటారో ఆమె ఊహించగలిగింది.

"అదేమిఁటండీ ?" అంది.

"ఔను గిరిజా ! నాకెందుకో మీ నాన్నగారి ముందుకి రావడానికి భయమేస్తోంది"

"భయమేమిటి ? ఆయనా మనలాంటి మనిషేకదూ ? అయినా మీరిప్పుడు రాకపోతే నా మర్యాదేముంటుంది ? అది మీ రాలోచించడం లేదు" అంది బాధగా.

ఆనందరావుకి చిక్కు సమస్య యెదురయ్యింది. వెళ్తే ఆయన

ఏం చివాట్లు పెడతోదోనని భయం; వెళ్ళకపోతే ఈమె ఏం బాధపడుతుందోనన్న భయం ఈ రెండు భయాలమధ్య నలిగిపోయాడు కాస్సేపు. చివరికి ప్రియురాలి మీదుండే ప్రేమే జయించింది. ఎలాగైనా సరే వెళ్ళక తప్పదనుకున్నాడు.

"సరే! పదవుతే" అన్నాడు.

గిరిజ తృప్తిగా నిట్టూర్చింది. ఇద్దరూ ముందుకి సాగిపోయారు చిలకాగోరింకల్లా.

శేషాచలం వరండాలో వాలుకుర్చీ వేసుకుని కూచుని వున్నాడు. ఇటీవల అతని ఆరోగ్యం సరిలేకపోవడం వల్లనేమో, నీరసంగా కనిపిస్తున్నాడు. కూతురు వెంట ఆ అబ్బాయి వస్తుండటం చూశాడు శేషాచలం. మొదటి చూపులోనే అతనికి అబ్బాయి నచ్చాడు. గిరిజ యేమీ అనకుండా సిగ్గుపడిగామోసు లోపలికి పోయింది. ఆనందరావు ఆమె ప్రవర్తనకి ఆశ్చర్యపోయి, యెదురుగా కూచునివున్న గంభీరవ్యక్తికేసి చూసి "నమస్కారమండీ!" అన్నాడు ఆర్చుకుపోతున్న గొంతుతో.

"నమస్కారం. కూచో అబ్బాయ్" అంటూ తనకి అభిముఖంగా వున్న కుర్చీని చూపించాడు శేషాచలం. ఆనందరావు బెదురుతూనే కూచున్నాడు. అతనికి ముళ్ళకంపమీద కూచున్నట్టనిపించింది.

శేషాచలం క్షణంసేపు ఆనందరావు మొహంలోకి పరిశీలనగా చూశాడు.

"నీ పేరేవిటబ్బాయ్?" అన్నాడు.

"ఆనందరావండీ!"

"ఏం చేస్తున్నావు?"

"'లా' ఫైనలియర్ చదువుతున్నాను"

"అలాగా !" అని క్షణం ఆగాడు శేషాచలం. అతని ప్రయోజకత్వం ఫరవాలేదనిపించింది శేషాచలంకి. మళ్ళీ ప్రారంభించాడు.

"మీది ఈ ఊరేనా ?"

"ఔనండీ"

"మీ నాన్నగారు ఏం చేస్తున్నారు ?"

"పోలీసు సర్కిల్‌గా పనిచేసి, రిటైరై ఇక్కడే స్థిరపడి పోయారండీ !"

"బావుంది" అని కాస్సేపు ఆగి "ఒక్కమాట అడుగుతాను.... చెప్తావా ?" అన్నాడు శేషాచలం.

"అడగండి....దానికేం ?" ఇంక యింటి విషయాలేవో అడుగుతారన్న ధైర్యంతో నిబ్బరంగానే అన్నాడు ఆనందరావు.

"మా అమ్మాయి గిరిజను నువ్వు మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నావా ?" సూటిగా ఆ యువకుని మొహంలోకి చూస్తూ ప్రశ్నించాడు ముసలాయన.

ఆ సూటి ప్రశ్నకు తల్లకిందులయ్యాడు ఆనందరావు. అతడి మొహం రంగు మార్చుకున్నది. మెదడు ఆలోచనలకు ఆలవాలమయ్యింది. ఆ ముసలాయన ఆ ప్రశ్న వెయ్యడంలోగల అర్థం ఏమిటి ? వెటకారానికి అలా అడిగి, తరువాత అవమాన పరుస్తాడేమోనన్న భయం పుట్టింది.

ఆనందరావు మౌనం శేషాచలాన్ని కలవరపర్చింది. 'అసలు ఆ అబ్బాయి గిరిజను ప్రేమిస్తున్నాడా, లేక మోసంచేసే ప్రయత్నమా' అన్న అనుమానం అతనిలో తలెత్తింది.

"చెప్పవోయ్ ! ఏవిటలా ఆలోచిస్తావు ? ఈ కాలపు కుర్రాళ్ళకి

పున్న విషయం చెప్పడానికి యెందుకో అంత భయం ?" అని మళ్ళీ అన్నాడు శేషాచలం.

"అబ్బే ! భయమేం లేదండీ ! నిజంగానే మీ అమ్మాయిని నేను మనసారా ప్రేమిస్తున్నాను" అన్నాడు మొహం కాస్త దించుకుని.

"ప్రేమిస్తున్నావన్నమాట !" మళ్ళీ గుచ్చి అడిగాడు శేషాచలం.

"ఔనండీ !"

"అవుతే, ఈ రహస్య సమావేశాలూ, ఈ దాగుడుమూతలూ యెందుకు ? పెళ్ళి చేసుకోకూడదూ ?"

శేషాచలం విశాల హృదయానికి ఆనందరావు విస్తుపోయాడు. తనని చీవాట్లు వేస్తాడేమోనన్న భయం పటాపంచలయ్యింది. ఆ మనసలాయనపై ఓ విధమైన భక్తిభావం, గౌరవం ఏర్పడ్డాయి.

"నాకవుతే అభ్యంతరం లేదండీ ! కాని...." అర్ధోక్తిలో ఆగిపోయి మొహం దించుకున్నాడు.

"సంశయమెందుకు ? స్పష్టంగా చెప్పవోయ్ !" హెచ్చరించాడు శేషాచలం.

"మా నాన్నగారు ఒప్పుకుంటారన్న నమ్మకం లేదండీ ?"

"అదేమిటి ? ముందుగా యెలా చెప్పగలవ్ ?"

"మానాన్న చెల్లెలి కూతురొకామె వుంది లెండి. ఆ అమ్మాయిని నాకిచ్చి పెళ్ళి చెయ్యాలని మా వాళ్ళందరి ప్రయత్నమూను"

శేషాచలం షాక్ తిన్నట్టుగా కాస్త వెనక్కి వాలాడు. అడుగడుగునా ఏదో ఒక ఆటంకం వస్తూనే వుందని బాధపడుతూ "ఆ విషయం తెలిసినవాడివి గిరిజతో యెందుకు స్నేహం పెంచుకుంటున్నావు చెప్పు ?" అడిగాడు.

తలుపుచాటున వుండి అంతా వింటున్న గిరిజకి తండ్రి ప్రశ్న

సబబుగానే వున్నట్టు తోచింది. తనుకూడా వెనుకా, ముందూ ఆలోచించ కుండా ప్రవర్తించడం తప్పే జరిగిందని అప్పుడనుకుంది. అయినా తన తప్పేముంది ? తనలా ఆకర్షింపబడుతోంది. ఏం చెయ్యను ? అని మళ్ళీ సమర్ధించుకుంది.

ముసలాయన ప్రశ్న యక్షప్రశ్నవలె ఘాటుగా తోచింది ఆనంద రావుకి. నిజమే, తను గిరిజను పెళ్ళి చేసుకునే అవకాశాలు అరుదుగా కనిపిస్తున్నప్పుడు ఈ విధంగా అనుబంధం పెంచుకోవడంలో అర్థం లేదు. కాని, ఏంచెయ్యను ? ఆమెను చూడకుండా వుండలేకపోతున్నాడు.

"మీరన్నమాట కూడా నిజమేనండీ ! నేను నా అభీష్టం నెర వేర్చుకోవాలని ప్రయత్నించాలను కుంటున్నాను"

"చూడబ్బాయ్ ! నేను పెద్దవాణ్ణి చెప్తున్నాను. ప్రేమించుకుని, ప్రేమ విఫలమైతే పిచ్చివాళ్ళుగా మారినవారు అనేకులున్నారు. అలా గాకుండా ప్రేమించుకుని సఫలీకృతులవ్వడంలోనే వుంది గొప్పతనం. నువ్వు చదువుకున్న వాడివి. అందులోనూ న్యాయశాస్త్రం చదువుకుంటు న్నావు. న్యాయాన్యాయాలు ఆలోచించి, ప్రవర్తించడం మంచిది" అని చిన్న ఉపన్యాసమిచ్చాడు శేషాచలం.

ఆనందరావుకి అదో చిన్న మందలింపుగా తోచింది. అవుతే, అది సబబుగానూ వుందనిపించింది. గిరిజను తప్పకుండా పెళ్ళి చేసు కోవాలనే పట్టుదల పరాకాష్ఠనందుకుంది. శేషాచలంకి ఇంకేమీ జవాబు చెప్పలేకపోయాడు.

"వస్తానండీ మరి!" అంటూ లేచాడు.

"కూచోవోయ్ ! వచ్చావు, ఓ కప్పు కాఫీ అయినా తీసుకోకుండా యిలా వెళ్ళిపోతావ్ ?" అంటూ పంతుల్ని కేకవేసి కాఫీ తీసుకురమ్మ న్నాడు. పంతులు కాఫీ క్షణంలో తెచ్చాడు. ఆనందరావు కాఫీ తీసుకుని విష్కరించాడు, శేషాచలంకి నమస్కారం చేస్తూ.

శేషాచలం గట్టిగా నిట్టూర్చి వాలుకుర్చీలో కూలబడిపోయాడు. ఇంతా చేస్తే విషయం పరిష్కారమే అవ్వలేదని అతని బాధ. చప్పున లేచి యింట్లోపలికి వెళ్ళాడు లాల్చీ వేసుకుందుకు. ప్రక్కగదిలో అమ్మాయి దిగులుగా కూచుని వుండటం చూసి మరింత బాధపడ్డాడు. లాల్చీవేసుకుని జగన్నాధం ఇంటికేసి నడిచాడు.

అప్పుడే చీకటి పడుతోంది. రోడ్లమీది విద్యుద్దీపాలు వెలిగాయి. ఆ వెలుగులో రకరకాల మనుషులు ఉత్సాహంతో కొందరు. దిగులుతో కొందరు నడుస్తున్నారు....వారిలో ఒకడు శేషాచలం.

పదిగజాల దూరం నడిచేసరికి అతనికి గుర్తుకొచ్చింది జగన్నాధం ఇంకా కొట్టుదగ్గరే వుంటాడని. తన మతిమరుపును మనసులో తిట్టుకొని కొట్టువేపే బయలుదేరాడు శేషాచలం.

"వచ్చాడా ఆ అబ్బాయి ?" శేషాచలంని చూసిన వెంటనే జగన్నాధం ప్రశ్నించాడు.

"వచ్చాడు. కాని, పరిస్థితి అనుకూలంగా లేదు" జవాబిచ్చాడు శేషాచలం.

"అదేమిటి ?" విస్తుపోతూ అన్నాడు జగన్నాధం.

శేషాచలం అంతా వివరంగా చెప్పాడు.

"అవుతే, ఇప్పుడు ఆ అబ్బాయిలో వుందన్నమాట అంతాను"

"ఔను. కాని, అతడిలో ధైర్యం కొదవేమోననిపిస్తోంది"

"అవుతే, మరేం చేద్దామంటావు ?"

"అదే నేనూ ఆలోచిస్తున్నాను. మన అవసరం గాబట్టి. మనం వెళ్ళి వాళ్ళ నాన్నతో మాట్లాడితే ఫలితం ఏమన్నా వుంటుందేమో ?"

"ఇంతకీ వాళ్ళ నాన్నగారు ఏం చేస్తున్నారు? ఎక్కడుంటున్నారు? వివరాలు అడిగావా ?"

"కొన్ని సేకరించాన్లే. వాళ్ళనాన్న పోలీసు సర్కిల్‌గా పనిచేసి రిటైరై, ఇక్కడే స్థిరపడిపోయారట"

జగన్నాధం ఆమాట విని, ఏదో గుర్తుకు తెచ్చుకున్నట్టుగా కాస్సేపు యోచించాడు.

"వాళ్ళు వుంటున్నదెక్కడ ?" ఆసక్తిగా ప్రశ్నించాడు జగన్నాధం.

"అది అడగలేదురా !" దిగాలుగా జవాబు చెప్పాడు శేషాచలం.

"మంచివాడివేనాని ! మరవుతే నువ్వు తెలుసుకున్న వివరాలేమిటి ?" అనేసి సాలోచనగా "పోనీ ఆ అబ్బాయి ఏంచేస్తున్నాడు ?" అన్నాడు.

"'లా' ఫైనలియర్ చదువుతున్నాట్ట"

జగన్నాధం మొహం కాస్తంత వికసించింది. "ముకుందరావు గారని రిటైర్డ్ సర్కిల్ ఒకాయన వున్నారు. మన వీధిలో చివార్న వుంటున్నారు. వాళ్ళబ్బాయి 'లా' చదువుతున్నట్టు విన్నాను. ఒకవేళ ఈ అబ్బాయి నేననుకున్నట్టు ముకుందరావుగారి పుత్రిడే అయితే, మన ప్రయత్నం కాస్త ఫలించవచ్చు. ముకుందరావుగారు ముక్కుకు సూటిగా పోయే వ్యక్తి అయినా, మంచివారని విన్నాను. మనిషి చాలా గంభీరంగా వుంటార్లే"

"ఆయనతో నీకు పరిచయం వుందా ?" ఉత్సాహంతో అన్నాడు శేషాచలం.

"లేదురా ! ఆయన చాలా రిజర్వ్‌గా వుంటారు. అందరితోనూ మాట్లాడరు"

"కాస్త ఆరాతీద్దూ !"

"అలాగే !"

"అంతేకాదు. మన ఊహే సరైనదైతే, నువ్వు స్వయంగా వెళ్ళి ఆయనతో మాట్లాడాలి. కట్నాలు, కానుకలు విషయంలో నేనేమీ లోటు చెయ్యనని హామీ యివ్వు. నాక్కావల్సింది అమ్మాయి సుఖసౌఖ్యాలు. నేను వెళ్ళి అడగడం బావుండదు చూడు" ప్రాధేయపడుతూ అన్నాడు శేషాచలం.

జగన్నాధంకి ఈ బాధ్యత భారమైనదనిపించింది. అంతేకాదు. తన తాహతుకి మించినదనిపించింది. అయినాసరే, స్నేహితుడి మనసుకి కష్టం కలిగించడం ఇష్టంలేక 'సరే' నన్నాడు. శేషాచలం తృప్తిగా నిట్టూర్చాడు. అతను జీవితంలో ఆశలు పెంచుకున్న రోజుల్లో యిదో రోజు. కొట్టు మూశాక ఇద్దరూ ప్రక్కప్రక్కనే నడుస్తూ గిరిజ వివాహ విషయమై యెన్నో మాట్లాడుకున్నారు.

10

ఒకనాటి రాత్రి యెనిమిది గంటల వేళ....

తండ్రి అంతవరకూ యింటికి రాకపోవడానికి కారణం తెలుసుకోలేక ఆత్రంగా అతనికోసం యెదురుచూస్తూ వరండాలోనే కుర్చీలో కూచుంది గిరిజ. పంతులు గోడనానుకుని నుంచున్నాడు. అతని కళ్ళు దూరంలో దుర్భిణీ వేస్తున్నాయి.

రోడ్డుమీద విద్యుద్దీపాలు దేదీవ్యమానంగా ప్రకాశిస్తున్నాయి. కాస్తంత దూరంలో యెవరు వస్తున్నా గుర్తుపట్టగలిగేలా వుంది వెల్తురు. పంతులు దృష్టి నిశితంగా ప్రసరిస్తోంది రోడ్డుమీదికి. కొద్దిసేపటికి

పంతులు ఇద్దరు వ్యక్తులు రావడం చూశాడు. వాళ్ళిద్దరూ తన యజమానీ, జగన్నాథంగారూ అయివుంటారని అతని ఊహ.

"బాబుగారు వస్తున్నట్టున్నారమ్మా!" అన్నాడు.

"ఏరి పంతులూ?" అంటూ రోడ్డువేపు చూసింది గిరిజకూడా. "ఔను. వీళ్ళిద్దరులానే వుంది" అందామె కూడా.

రెండు నిమిషాల తర్వాత జగన్నాథం వాళ్ళింటివేపు తిరిగిపోయాడు. శేషాచలం ఒంటరిగా నడుస్తున్నాడు. ఇంటి ఆవరణలోకి వచ్చేశాడు. అతని అడుగులు భారంగా, నిర్జీవంగా పడుతున్నాయి. మొహం వెలవెల బోతోంది.

"ఇంత ఆలస్యమయ్యిందేం నాన్నా?" అంది గిరిజ.

"ఊరికినేనమ్మా!" అనేశాడు అసలు విషయం చెప్పడం ఇష్టం లేక. అతని కంఠస్వరంలో మార్పు గుర్తించిందామె.

శేషాచలం తిన్నగా మధ్య గదిలోకి వచ్చి దుస్తులు మార్చి కుర్చీలో కూలబడ్డాడు.

"బాబూ, వేన్నీళ్ళు పెట్టివుంచాను. మొహం కడుక్కోండి" అన్నాడు పంతులు.

"వద్దులే పంతులూ!"

"అదేమిటి నాన్నా! మరి భోజనం చెయ్యరా?" అంది గిరిజ.

"నాకేమీ ఆకలిగా లేదమ్మా!"

తండ్రి ధోరణి ఆమెకి వింతగా కనిపించింది. అసలు జరిగిన విషయమేమిటో ఆమె ఊహకి అందలేదు. దుకాణంలో ఏమైనా చిక్కులు వచ్చాయా? లేక....లేక....ఈ ఆలోచనల్లో ఆమెకి గుర్తుకొచ్చింది ఆనందరావు తండ్రి దగ్గరికి జగన్నాథం బాబాయి వెళ్తున్నట్టు పంతులు చెప్పడం. 'బహుశా అక్కడే ఏదో జరిగివుంటుందేమో!' అనుకుంది.

ఆ వైనమే అడిగి తెలుసుకోవాలనుకుంది. తన వివాహ విషయం అడిగి తనే తెలుసుకోవడంలో బిడియపడి సంకోచించినా, తండ్రి మానసికాందోళన దృష్ట్యా ఆ సంకోచాన్ని అవతలకు నెట్టివేసింది.

"ఏమిటి నాన్నా అలా వున్నారు ?" అంటె అతని మొహంలోకి చూస్తూ.

'తనలో వచ్చిన మార్పు బాహ్యంగా కనిపిస్తూ వుందా ?' అని విస్తుపోయాడు శేషాచలం.

"అబ్బే ! ఏమీ లేదమ్మా !" అంటూ తప్పించుకోబోయాడు. కాని గిరిజ అంతటితో తృప్తిపడలేదు.

"మీరేదో మానసికాందోళనతో సతమతమౌతున్నారు. ఏమిటో అది చెప్పండి. జగన్నాధం బాబాయ్‌గారు ఆనందరావు తండ్రిగారి దగ్గరికి వెళ్ళారా ?" అంది.

కూతురు వేసిన ప్రశ్నను వింటూనే స్తబ్ధుడయ్యాడు శేషాచలం. అమ్మాయికి ఆ విషయం యెలా తెలిసిందోనని ఆశ్చర్యపోయాడు. అయినా తను యెన్నాళ్ళు దాచగలడా వైనం ? అప్రియత్నంగా అతని కళ్ళు నీళ్ళపర్యంతమయ్యాయి. ఆమె ఆ ప్రశ్న అడక్కపోయినా బావుండు ననిపించింది.

"చెప్పండి నాన్నా ! ఏమయ్యింది ? మీరెందుకలా మనసులో బాధపడతారు ?" రెట్టించిన ఆసక్తితో మళ్ళీ అడిగింది గిరిజ.

ఈసారి చెప్పక తప్పదనుకున్నాడు శేషాచలం. గట్టిగా ఓసారి నిట్టూర్చాడు. ఆ నిట్టూర్పులోనే బాధంతా ఇమిడివుంది.

"బాబాయ్ నామాట కాదనలేక వెళ్ళాడమ్మా, ఆ అబ్బాయి నాన్నగారి దగ్గరికి. కాని ఏం లాభం ? ఆయన ఒప్పుకోలేదట. కొడుక్కి మేనకోడల్ని తప్పించి మరోపిల్లను ముడికట్టనని ఆయన భీష్మించు

క్కూర్చున్నాడట. ఇంక నేనేం చెయ్యను గిరిజా ? వాళ్ళు కోరినంత కట్నం ఇస్తానన్నాను కూడాను. అయినా ఒప్పుకోలేదట. నువ్వు ఓ ఇంటి దానవైతే కళ్ళారా చూసి ఆనందిద్దామని వుంది. కాని ఏం లాభం ? విధి వ్యతిరేకంగా వుంది. ఇదంతా నా దురదృష్టమమ్మా !" అన్నాడు రుద్ధ కంఠంతో.

గిరిజ కర్రిగట్టిపోయింది. తండ్రి ధోరణి చూసి ఏదో అనర్థం జరిగిందని తను యెలా ఊహించిందో అలాగే జరిగింది. తను ఆనంద రావుకి భార్య అవుతానని యెంతో మురిసిపోయింది. ఎన్నో ఆశల్ని పెనవేసుకుంది. ఎన్నో కలలు కన్నది. కాని అవన్నీ ఇప్పుడు మట్టి గొట్టుకుపోయాయి. ఆమె కళ్ళల్లో నీరు సుళ్ళు తిరుగుతూ, ఆనకట్టను తెగ్గించుకుని దూకే ప్రవాహంలా చెక్కిళ్ళమీదకు జాలువారుతూ వున్నాయి. ఇంక అక్కడ నిల్చోలేకపోయింది. చరచరా తన గదిలోకి పోయింది.

శేషాచలం స్తంభించిపోయి కూతురు వెళ్ళిపోతున్నవేపే కళ్ళప్ప గించి చూస్తూ వుండిపోయాడు కాస్సేపు. అంతా అయోమయంగా వుంద తనికి. తను యిప్పుడేం చెయ్యాలి? ఏ విధంగా ఈ సమస్యను పరిష్కా రం చెయ్యాలి ? ముకుందరావుగారి మనస్సు మార్చడం యెట్లా ? గిరిజ ఈ ఘాతానికి తట్టుకోగలదా ? అసలే అమ్మాయిది చాలా సున్నితమైన హృదయం. ఈ సంఘటన పరిణామం యెలా వుంటుంది ? ఈ విధమైన ప్రశ్నలు వివిధవిధాలుగా రూపాలు ఏర్పర్చుకుని, అతని మెదడుని కల్లోల పర్చినయ్. పరిష్కారమార్గం పసిగట్టలేక, నిస్పృహతో తల పట్టేసు కున్నాడు శేషాచలం.

"బాబూ !" అన్నాడు పంతులు దీనంగా. యజమాని అవస్థ అతణ్ణి కూడా కదిలించేసింది.

"పంతులూ! అంతా అయోమయంగా వుంది. అమ్మాయి భవిష్యత్తు యెట్లా వుంటుందో భయంగా వుంది. నా వాగ్దానం నిలబెట్టుకోగలనో లేదో!" చిన్న పిల్లాడిలా బావురుమన్నాడు శేషాచలం.

"మీరుకూడా అలా అధైర్యపడితే యెట్లా బాబూ? అనవసరంగా ఆరోగ్యం చెడగొట్టుకోవడం తప్పించి, ప్రయోజనం ఏమీలేదు. ఏది యెలా జరగాలని వుంటే, అలా జరక్కతప్పదు. ఏమో, మళ్ళీ ఆయన మనస్సు మారుతుందేమో యెవరు చెప్పగలరు?" అన్నాడు పంతులు అనునయపరుస్తున్నట్టుగా.

"అది అసంభవం పంతులూ! ఆ ముసలాయన చాల పట్టుతో వున్నాడట. అతని హృదయానికి చలనం వుండదట"

"పోనీలెండి బాబూ! అమ్మాయికే సంబంధాలు దొరక్కపోతాయా? అంతకంటె మంచి సంబంధం వస్తుంది. మీరు దిగజారిపోవడమెందుకు?"

"మనం మరో సంబంధం చూడగలమేగాని, అమ్మాయి మనసు మార్చగలమా పంతులూ! అమ్మాయిని యెంత మురిపెంతో పెంచానో నీకు తెలుసు. దాని సుఖమే నా సుఖమనుకున్నాను. అటువంటిది ఇప్పుడు అమ్మాయి అభీష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించి ఆమె మనస్సుకి నొప్పి కలిగిస్తానా? అలా యెప్పుడూ జరగదు పంతులూ! ఏపని చేసినా, అమ్మాయితో సంప్రతించే చేస్తాను. ఆమె మనసుకి నచ్చిన విధంగానే ప్రవర్తిస్తాను" అన్నాడు శేషాచలం.

పంతులు ఇంకేమీ అనలేకపోయాడు. తన యజమాని మనసు యెంత మంచిదో మరోసారి గ్రహించుకున్నాడు.

"బాబూ, చాలా వేళయ్యింది. లేవండి కాస్తంత యెంగిలిపడుదురు

గాని" అన్నాడు. శేషాచలం జవాబేమీ చెప్పకపోయేసరికి అది అంగీకార సూచనగా తీసుకుని లోపలికి పోయారు పంతులు.

శేషాచలం లేచాడు. కూతురు గదిలోకి నడిచాడు. దిగులుగా మంచంమీద కూచున్న కూతుర్ని చూసి ద్రవించిపోయాడు. నిజంగా గిరిజ దురదృష్టవంతురాలు అనుకుంటూ ఆమెకు దగ్గరగా వెళ్ళి తల నిమురుతూ "నువ్విలా దిగులుగా కూచుంటే నా గుండెలు తరుక్కు-పోతాయమ్మా! నీ నుదుట ఏం రాసిపెట్టివుందో, ఎవ్వరమూ చెప్ప లేం. లేచి భోజనం చెయ్యమ్మా! నువ్విలా దిగులుగా కూచుంటే నాకు మాత్రం భోజనం సహిస్తుందా?" అన్నాడు బాధగా.

గిరిజ వేదనంతా హృదయంలోనే అణచుకుని లేచింది. తన విష యంలో తండ్రి యెంత బాధపడుతున్నాడో ఆమెకి తెలుసు. తను దిగు లుగా వుండి, ఇంకా ఆయన మనోవేదన అధికం చెయ్యడం మనస్క-రించ లేదామెకి.

"పదండి నాన్నా!" అంటూ వంటగదివేపు దారితీసింది.

శేషాచలం తాత్కాలికమైన తృప్తితో ముందుకి సాగిపోయాడు.

* * *

జగన్నాథం వచ్చి వెళ్ళిపోయాక ముకుందరావుగారు కాలుకాలిన పిల్లిలా చిందులు తొక్కడం ప్రారంభించారు. అప్పటికి ఆనందరావు ఇంట్లో లేకపోవడం సరిపోయిందిగాని, లేకుంటే యాభై మెగాటన్నుల బాంబు పేలినంత రభస జరిగివుండేది.

"ఇదిగో....విన్నావ్?" అంటూ గర్జించినట్టుగా కేకవేశాడు. గంభీరమైన గొంతుకేమో కొంచెం కంపించినట్టయ్యింది.

లోపల వంటగదిలో వున్న వరలక్ష్మి ఏదో కొంప మునిగిందను కుని గబగబా వచ్చింది. "ఏమయ్యిందండీ?" అంది. భర్త ఆపహా

నంతో అంచెలంచెలగా పచారు చేస్తూండం చూసి మరీ దిగ్భ్రమ జెందింది.

"ఏమవ్వకూడదో అదే అయ్యింది" నిష్కర్షగా అన్నాడు.

"అంటే ? ఏం జరిగిందో చెప్పండి ?" అందామె ఆత్రంగా.

"నీ సుపుత్రుడు చేసిన ఘనకార్యం విన్నావా ?" అంటూ ప్రారంభించాడు కోపంగానే.

"ఏం చేశాడు ?"

"వీడింకా చదువులోనే వస్తున్నాడు....అప్పుడే స్వతంత్రించి పనులు సాగిస్తున్నాడు"

"ఏం చేశాడండీ ?" విసుగ్గానే అడిగింది వరలక్ష్మి.

"వాడికి లక్ష్మితో వివాహం చెయ్యాలని నిశ్చయించుకుని చాలా రోజులయ్యింది. వచ్చేఏడు పెళ్ళి జరిపేయాలని కూడా అనుకున్నాం. కాని, ఇప్పుడు వీడేంచేశాడో చూశావా ? ఎవరో అమ్మాయిని ప్రేమించాట్ట. నాతో ఆ విషయం చెప్పే ధైర్యంలేక, అమ్మాయి తాలూకవాళ్ళని నా దగ్గిరికి సంప్రదించడానికి పురిగొల్పి పంపించాడు. వీడేదో అమాయకుడనుకున్నానుగాని దేవాంతకుడు. ఒకాయన వచ్చి ఆ అమ్మాయిని కోడలుగా చేసుకోమని అర్థిస్తున్నాడు. చూడు యెంత నవ్యంగా వుందో ! మన సంగతి వాళ్ళకి తెలీదు. నాకు సమ్మతిగాలేదని నెమ్మదిగా చీవాట్లు పెట్టి పంపించేశాను" అన్నాడు మీసం మెలివేస్తూ. తనో ఘనకార్యం చేశాడనే అతని ఉద్దేశం.

వరలక్ష్మి భర్త ధోరణికి సంతోషించలేదు సరిగదా, లోలోపల అసహ్యించుకుంది కూడాను. కొడుకంటే ఆమెకి పంచప్రాణాలు. ఒక్కగాని ఒక్క కొడుకని ఆమెకి అభిమానం, ఆదరమూను. అదీగాకుండా ఆమెకి ఆడబడుచు కూతుర్ని కోడలుగా చేసుకోవడం సుతరామూ ఇష్టం లేదు. అది స్త్రీ సహజమైన నిరాకరణ. భర్తయెదుట ఆ విషయం నిర్భ

యంగా చెప్పలేని దౌర్బల్యం ఆమెలో వుంది. అందుకే భర్తను ఈ పరిస్థితిలో హర్షించలేదు.

"అయినా, వాడి మనసుకి నచ్చినవాళ్ళనే వివాహం చెయ్యాలిగాని, మనం బలవంతంచేసి ముడిపెడతామంటే ఎలాగండీ ? నేను మొదట్నుంచీ ఇదే గోలపెడుతున్నాను. వాడు ప్రేమించాడూ అంటే, వాడికా అమ్మాయి నచ్చినట్టుంది. పోనీ, ఆ సంబంధమే నిశ్చయిస్తే కాదూ ?" ఆడబడుచుమీద అక్కసు అలా చెప్పించింది వరలక్ష్మిచేత.

ముకుందరావుగారు రౌద్రరూపం దాల్చారు. భార్య మాటలు అగ్నిపై ఆజ్యం పోసినట్టుగా పనిచేశాయి అతనిలో.

"ఈ సలహా ఇవ్వడానికి నిన్ను పిలవలేదు. నోరు మూసుకో !" అన్నాడు.

అంతే ! వరలక్ష్మి నోటికి తాళం పడింది. సరిగ్గా అదే సమయంలో ఆనందరావు లోపలికి వచ్చాడు. అతడు చాలా నిరుత్సాహంగా వున్నట్టు కనిపిస్తున్నాడు. వరలక్ష్మి కూడా అదే గమనించింది. కాని ఇప్పుడేం రభస జరుగుతుందోనని భీతిల్లింది. ఆనందరావు మొహం దించుకుని లోపలికి సాగిపోతున్నాడు.

"ఒరేయ్, ఇలారా !" అన్నాడు గట్టిగానే ముకుందరావు.

ఆనందరావుకి తండ్రి పిలుపులోని కర్కశం అర్థంగాక వెనక్కి వచ్చాడు వింతగా చూస్తూ.

"నువ్వు ప్రేమించిన అమ్మాయి యెవర్రా ?" గర్జించాడు ముకుందరావు.

తండ్రికి ఆ విషయం యెలా తెలిసిందోనని విస్తుపోయాడు ఆనందరావు. కాస్సేపు మౌనం వహించాడు.

"చెప్పవేం రా ?" మళ్ళీ అన్నాడు ముసలాయన గంభీరంగా.

"శేషాచలంగారి అమ్మాయి" ముక్తసరిగా చెప్పాడు ఆనందరావు.

"చెప్పుకోడానికి సిగ్గులేకపోయింది గామోసు! ఈ ప్రేమ కలాపాల్లోపడి చదువు మంటగలుపుకో! ఆఖరుసారిగా చెప్తున్నాను. నువ్వు ఇటువంటి పిచ్చివేషాలు వేశావంటే లాభంలేదు. లక్ష్మిని తప్పించి, నేను మరొకార్ని కోడలుగా స్వీకరించను. అదిమాత్రం గుర్తుంచుకో!" హెచ్చరించే ధోరణిలో చెప్పాడు ముకుందరావు.

వరలక్ష్మి అయోమయంగా ఇద్దరివేపూ కళ్ళప్పగించి చూడ్డం తప్పించి మరేమీ అనలేకపోయింది. ఆనందరావు తండ్రితో వాదించడానికి భయపడో, లేక విరక్తిభావంతోనో అక్కణ్ణుంచి నిష్క్రమించాడు.

"పౌరుషం మాత్రం వుంది తెగ బారెడు" చీత్కారంతో అన్నాడు ముకుందరావు.

"సరే లెండింక .... అనవల్సిందేదో అనేశారుగా!" కలిగించుకుంది వరలక్ష్మి.

"పాపం! నీకు కష్టంగావుంది గామోసు! వెళ్ళి నీపనిచూసుకో! అంతా ఒక్కలాంటి సజ్జు తయారయ్యింది" అంటూ కుర్చీలో కూలబడ్డాడు.

వరలక్ష్మి చిరుకోపంతో అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

11

ఏరోజు జగన్నాథం ముకుందరావు దగ్గరికి వెళ్ళి విరాశతో తిరిగివచ్చాడో, ఆరోజునుండి శేషాచలంలో అవ్యక్తమైన సంక్షోభం చెలరేగింది. అది క్రమంగా మానసికాందోళనగా మారింది. అసలే వృద్ధాప్యపుపడిలో వున్నాడు. ఎంత దృఢమైన శరీరమౌతే మాత్రం ఏం లాభం? మనోవ్యధ ఆ పటుత్వాన్ని కాస్త కరిగించేసింది. నీరసించి పోయాడు. అందుకే విశ్రాంతి తీసుకోవాలని షాపుకి వెళ్ళకుండా ఇంట్లోనే వుండిపోయాడు శేషాచలం.అయిదారు రోజుల తరువాత కాస్త నయమనిపించింది.

తనకి వంట్లో బాగులేదన్న నెపంతో కూతుర్ని కాలేజీకి పంపడం మానేశాడు. నువ్వు దగ్గరుంటే నాకు యెంతో ఆనందంగా వుంటుం దమ్మా!" అనేవాడు ఆమె తృప్తికోసం. అవుతే ఇందులో మరో రహస్యం కూడా ఇమిడివుంది.ఆనందరావుతో ఆమె కలియకుండా వుండ డానికే శేషాచలం ఆమెను కలేజీకి వెళ్ళకుండా చేశాడేమో నన్పిస్తుంది. పూర్తిగా ఆమె చదువుకి స్వస్తిచెప్పించాలని అతని ఉద్దేశమేమో

* * *

ఆనందరావుకి ప్రస్తుతం విషమపరిస్థితి యెదురయ్యింది. ఇటు చూస్తే తండ్రి మంకుపట్టు పట్టుకూర్చున్నాడు. గిరిజను కలుసుకోవ డానికి కాలేజీ దగ్గరకు యెన్నిసార్లు వెళ్ళినా, ఆమె జాడేలేదు. కాలేజీకి రావడం మానుకుందేమో! పోనీ ఇంటికి వెళ్దామంటే, మొహం చెల్లడం లేదు.ఆమెను చూడాలన్న కుతూహలం నిమిషనిమిషానికీ అధికమౌతుందే

గాని తగ్గలేదు. ఈ సమస్య యెలా పరిష్కారమౌతుందోనన్న ఆందోళన అతనిలో భయాన్ని కలిగిస్తుంది. దీనికి తోడుగా పరీక్షలు దగ్గరపడుతున్నాయి. పై చదువుమీద ఏకాగ్రిత కుదరడంలేదు. ఏం చెయ్యడం ఇప్పుడు ? అని ఆలోచించాడు. ఎంత ఆలోచిస్తున్నా మెదడులో గిరిజే మెదుల్తోంది..బహుశా ఆమెకి వంట్లో బాగులేదేమో ! ఎలాగైనా సరే ! ఓసారి వెళ్ళి చూసి రావాలి. వాళ్ళనాన్న రాత్రి ఏడెనిమిది వరకూ దుకాణం దగ్గిరే వుంటాడు. ఈలోగా వెళ్ళి ఆమెనోసారి చూసి వచ్చేస్తే చాలు....'ఆపైన ఏం చెయ్యడమో తర్వాత నిర్ణయించుకోవచ్చు' అనుకుని బయలుదేరాడు ఓనాటి సాయంత్రం.

సాయంత్రం ఆరుగంటలు కావస్తోంది. కాస్తంత చలిగాలి వీస్తోంది. ఆనందరావు తొందర తొందరగానే నడుస్తూ శేషాచలంగారి ఇంటిముందాగి యథాలాపంగా "శేషాచలంగారూ !" అని కేకవేశాడు. అతని అభిప్రాయం ఏమిటంటే, పంతులో లేక గిరిజో బయటికి వస్తారని. కాని కథ అడ్డం తిరిగింది. వచ్చినవాడు శేషాచలం. ముసలాయన్ని చూస్తూనే ఆనందరావు నీరైపోయాడు. క్షణంసేపు నోట మాటరాలేదు. అయినా అలా చూస్తూ వుండటం అసభ్యంగా వుంటుందనుకుని —

"నమస్కారమండీ !" అన్నాడు చేతులు జోడిస్తూ.

"నమస్కారం" గంభీరంగా అన్నాడు శేషాచలం కళ్ళద్దాలు సర్దుకుంటూ "రా, కూచో" అంటూ వరండాలో వున్న వాలు కుర్చీలో తను వాలాడు శేషాచలం.

ఆనందరావు మెల్లగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి ముసలాయనకి అభిముఖంగా ఆసీనుడయ్యాడు. శేషాచలం ఉద్రేకపడి తనను వెళ్ళగొట్టనందుకు మనసులో సంతోషించాడు. కాని, అతని దృష్టిమాత్రం లోపల గదివేపే ప్రసరిస్తూ వుంది. 'గిరిజ కనిపించదేం ?' అనుకున్నాడు.

"ఏమబ్బాయ్ ఇలా వచ్చావ్?" సౌమ్యంగానే ప్రశ్నించాడు శేషాచలం.

ఆప్రశ్న కాకుండా మరే ప్రశ్నవేసినా, ఆనందరావు తడబడక పోను.

"అబ్బే! అబ్బే! ఊరికనేనండీ!" మరో విధంగా జవాబు చెప్పలేకపోయాడు ఆ తరుణంలో—

శేషాచలం ఆ యువకుని అవస్థకు చిన్నగా నవ్వుకున్నాడు.

"ఒక్కమాట చెప్తాను. సావధానంగా వినబ్బాయ్! నువ్వు ఇప్పు డెందుకొచ్చావో నాకు తెలుసు. గిరిజను కాలేజీ దగ్గర కలుసుకోలేక పోయావు గాబట్టి, ఇంక మనసు వుండబట్టలేదు గాబట్టి యిక్కడికి వచ్చావు. నేను ఇంట్లో వుంటానని నువ్వు ఊహించలేదు. కాని నీ దురదృష్టమో, లేక గిరిజ అదృష్టమో నా అస్వస్థతవల్ల ఇంట్లో వుండాల్సి వచ్చింది. గిరిజంటావా, ఏనాడో చదువుకి స్వస్తిచెప్పింది. ఇక నేను చెప్పదల్చుకున్నదేమిటంటే మీరిద్దరూ యెంతో సన్నిహితంగా వుంటున్నారు. మీ మనసులు ఇప్పుడిప్పుడే మామిడిచెట్టు, మాలతీలతల్లా పెనవేసుకోవడం ప్రారంభించాయనీ నాకు తెలుసు. అంతా బాగానే వుంది నేనూ మీ మార్గానికి అడ్డు రాదల్చుకోలేదు సరిగదా మీ ఇద్దరికీ వివాహం జరిగితే నాఅంత సంతోషించేవాడు ఇంకెవరూ వుండరు. కాని, ఈ వివాహానికి మీ నాన్నగారు అసమ్మతిని తెలియజేశారు" అన్నాడు శేషాచలం.

తన తండ్రి ఈ విషయంలో అసమ్మతిని తెలియజేస్తారన్న విష యం ఆనందరావుకి తెలిసినా, యెవరు వెళ్ళి అడిగారా అన్నది అర్థంగాక ఆశ్చర్యపోయాడు.

"ఏమిటీ! మా నాన్నగారితో సంప్రదించారా?" ఆత్రంగా ప్రశ్నించాడు.

"ఔను! నాకు ఏ విషయంలోనైనా దాగుడుమూతలు పనికిరావు. సూటిగా పోవడం నా తత్వం. అంతేకాదు; 'ప్రేమ'మీద నాకు అట్టే సద్భావంలేదు. పెళ్ళిచేసుకుని ప్రేమించుకోవడమే ఉత్తమమనే వారిలో నే నొకణ్ణి. మీరిద్దరూ మనసులు కలిసినా, దూరదూరంగా వుండటం, రహస్యంగా కలుసుకుందుకు ప్రయత్నించడమూ అందుకే నా కిష్టం లేదు. అదేకారణంతో మీ ఇరువురి వివాహాన్ని అభిలషించి నా స్నేహితుణ్ణి మీ నాన్నగారి దగ్గరికి పంపించాను. ఆయన షరతులకు ఒప్పుకుంటానని కూడా కబురు పంపాను. కాని లాభంలేకపోయింది. మీ నాన్నగారు ఒకే కాలుమీద కూచున్నారు. ఏంచేస్తాం? ఇదంతా మా గిరిజ దురదృష్టమే! చూడు నాయనా! ఇక మన వ్యవహారం తేలిపోయినట్టే! అనవసరంగా శ్రమ తీసుకుని నువ్వు మా ఇంటికి వస్తూ వుండటం సభ్యతగా వుండదు. లోకం మహ చెడ్డది....మరేమీ అనుకోకు" అంటూ ముగించాడు శేషాచలం.

ఛెళ్ళున చెంపకాయ కొట్టినట్టనిపించింది ఆనందరావుకి. క్షణం నివ్వెరపోయాడు. మరుక్షణంలో తేరుకుని, తను ఇంక ఒక్క క్షణం అక్కడ వుండకూడదని తీర్మానించుకున్నాడు. గిరిజను వివాహమాడిం తర్వాతగాని ఆ యింటి గడప తొక్కకూడదనుకుని నిర్ణయించుకున్న వాడై లేచాడు. అతని మనసు గిరిజను ఓసారి చూడాలని ఆరాటపడుతున్నా, అభిమానం అడ్డుపడింది.

"వస్తానండి!" అనేసి చరచరా వెళ్ళిపోయాడు ఆనందరావు.

అప్పుడే పెరట్లో యెవరితోనో మాట్లాడి తిరిగి వస్తున్న గిరిజ చెవుల్లో ఆనందరావు గొంతు....అదీ 'వస్తానండి!' అన్న పదం పడటం. చప్పున బయటికి వచ్చింది. కాని ఏం లాభం? ఆనందరావు

అక్కడలేదు. తండ్రి తప్పించి ఇంకెవరూ లేరు. ఆశ్చర్యపోయింది గిరిజ. తనేమీ భ్రమపడ్డం లేదుకదా ! అన్న అనుమానం కూడా తలెత్తింది. "ఆయన వచ్చినట్టున్నారు నాన్నా ?" ధైర్యంచేసి అడిగేసింది వుండబట్టలేక.

అబద్ధం చెప్పడం ఇష్టంలేకపోయింది శేషాచలంకి.

"ఔనమ్మా ! వచ్చాడు" అన్నాడు.

"ఇంత త్వరగా వెళ్ళిపోయారేం ?" ఆసక్తితో అడిగింది. ఆమెకి కూడా ఆనందరావుని ఓసారి చూడాలని వుంది. ఆమె ఆరాటాన్ని అర్థం చేసుకున్నాడు శేషాచలం. అప్రయత్నంగా అతని కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. క్షణం జవాబు చెప్పలేకపోయాడు.

"మీరు వెళ్ళపోమన్నారా నాన్నా ?" మళ్ళీ అంది గిరిజ చంటి పిల్లలా దీనంగా చూస్తూ.

శేషాచలం హృదయం తరుక్కుపోయింది. ఆ ప్రేమమయి పసి హృదయం యెంత ఆవేదన అనుభవిస్తుందో అతనికి తెలుసు. కూతురి వేపు జాలిగా చూసి లేచి నుంచుని "రా అమ్మా, లోపలకి" అంటూ లోపలికి తీసుకుపోయి "కూర్చో" అన్నాడు. గిరిజ కూచోలేదు. ఆమెను బలవంత పర్చలేదు శేషాచలం. ఆమె తల ఆప్యాయంగా నిమురుతూ—

"చూడమ్మా ! నేను యెల్లాంటి మనిషినో నీకు బాగా తెలుసు. నువ్వంటే నాకు పంచప్రాణమనీ నువ్వూ ఒప్పుకుంటావు. నిన్ను పువ్వుల్లోపెట్టి పెంచానంటే అదీ కాదనవు నువ్వు. అటువంటి నేను నీకు మనఃక్లేశాన్ని కావాలని కలిగించేటంతటి మూర్ఖుణ్ణి కాదమ్మా ! కాని విధి క్రూరంగా ప్రవర్తిస్తోంది. ఏంచెయ్యను ? మీ ఇద్దరి వివాహానికీ ప్రయత్నించాను. వాళ్ళ నాన్నగారు సమ్మతించలేదు. అటువంటప్పుడు మీ ఇరువురి స్నేహాన్ని ప్రోత్సాహించడం నాకు ఇష్టంలేదు. ఆ తర్వాత

పరిస్థితులు యెలా పరిణమిస్తాయో యెవరు చెప్పగలరు? చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనంలేదు" అంటూ గట్టిగా ఓసారి నిట్టూర్చి మళ్ళీ ప్రారంభించాడు.

"నాకు ఓ అమ్మాయి బాగా తెలుసు. ప్రేమనే పిచ్చిలోపడిన ఆమె జీవితం యెల్లా పరిణమించిందో తల్చుకుంటేనే గుండె పగుల్తుంది. నీతో చెప్పడం సబబు కాదుగాని, అవసరం వచ్చింది గాబట్టి చెప్పాల్సి వస్తుంది. ఆ అమ్మాయి మంచి కుటుంబంలో పుట్టి పెరిగింది. కాస్తంత చదువుకుంది కూడాను. అందాలరాశి. ఆమెను ఓ చదువుకున్న అబ్బాయి ప్రేమించాడు. ఇద్దరి మనసులూ శాశ్వతంగా అన్నట్టు పెనవేసుకున్నాయి. ఆ అబ్బాయి స్వార్ధపరత్వంతో ఆమెను తనతో వచ్చేయమన్నాడు. హాయిగా, సుఖంగా ఎక్కడో కాలం గడుపుదామన్న ఆశల్ని కల్పించాడు. ఆమె అమాయకంగా అవన్నీ నమ్మేసింది. వెనుకా, ముందూ చూడకుండా అతనితో లేచి వెళ్ళిపోయింది. ఎక్కడికో తీసుకుపోయాడు. పోనీ వాళ్ళిద్దరూ హాయిగా దాంపత్య జీవితం గడిపారా అంటే అదీ లేదు పాపం! ఆమె దురదృష్టానికి ఆమెను విడిచిపెట్టి, అతను పరారీ అయ్యాడు. ఆమె ఏడ్చింది. ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించింది. కాని ధైర్యం చాలిందికాదు. పరిస్థితులు ఆమెను వేశ్యగా మార్చాయి. ఈ గాథ తల్చుకున్నప్పుడంతా నాకు యెంతో బాధ కలుగుతుందమ్మా! అందుకే ప్రేమించుకోవడంలో నాకు అట్టే సద్భావంలేదు. అవుతే ప్రేమించుకోవడం 'తప్పు' అని చెప్పలేనుగాని, వెంటనే పరిష్కార మార్గం చూడ్డం అవసరం. అంతేగాని యెవరి అదృష్టాదృష్టాలకు ఎవర్నీ వదిలేయకూడదు. అందుకే ఆనందరావుని మనింటికి రావద్దని చెప్పాను. మనవెనుక సంఘం వున్నదన్న విషయం కూడా మనం గుర్తుంచుకోవాలి గదమ్మా! నువ్వు మనసులో నన్ను తిట్టూ, లేక శాపనార్థాలు పెట్టూ

ఏంచేసినా అందుకు నేను బాధ్యుణ్ణే। నేను తప్పుచేశానో, ఒప్పుచేశానో ఆలోచించుకునే జ్ఞానం, సంస్కారం నీలో వుంది" అంటూ ముగించాడు.

ఆనందరావు పట్ల తనకి వున్న అభిమానపేమలు ఒకవేపు లాగుతూ, మనసుని గుచ్చుతున్నా తండి మాటల్లో సత్యం లేకపోలేదను కుంది గిరిజ. ఒకపక్క తను బాధపడుతున్నా, తన బాధకంటె తండి బాధ్యతే ముఖ్యమైనదని తెలుసుకుందామె.

"నీ తప్పేమీ లేదు నాన్నా। అంతా నా దురదృష్టం" అంది హీనస్వరంతో. ఆమె కళ్ళు నీళ్ళ పర్యంతమయ్యాయి. ఆమె వేదనను అర్థంచేసుకుని శేషాచలం మరీ బాధపడ్డాడు.

"అలా కంటతడి పెట్టకమ్మా। నువ్వు కంటతడిపెడితే నేను చూళ్ళేను. ఇకపైన అంతా మన అదృష్టంమీద ఆధారపడి వుంది. ఆ అబ్బాయికి నీమీద మమకారం వుంటే, పరిస్థితుల్ని అతడే ఎదిరిస్తాడు. నువ్వు చూస్తావుగా ?" అంటూ మళ్ళీ ఆమె తల నిమురుతూ "నువ్వలా దీనంగా వుంటే నేను భరించలేనమ్మా। ఏదీ ఒక్క చిన్న చిరునవ్వు" అంటూ ఆమెవేపు చూశాడు.

గిరిజ అతికష్టంమీద నవ్వింది.

"పిచ్చితల్లి। నవ్వితే అచ్చంగా మీ అమ్మలానే వుంటావు" అనేసి వరండాలోకి పోయాడు. గిరిజ తన గదిలోకి పోయి మంచంమీద వాలుతూ కుమిలి కుమిలి మౌనంగా ఏడ్చింది.

12

ఆనందరావు తన గదిలో కూచుని తీవ్రంగా యోచన సాగించాడు. అతని చెవుల్లో శేషాచలం అన్న ప్రతిమాటా ప్రతిధ్వనిస్తోంది. నిజమే! ముసలాయన చెప్పింది అక్షరాలా నిజం. సంఘ నియమాలు కొన్ని పాటించాలి మరి. తను గిరిజను వివాహం చేసుకోని పక్షంలో ఆమెను చూడ్డానికి తను వెళ్ళడం చాలా అసభ్యంగా వుంది. శేషాచలం కూడా అదే అన్నాడు. కాని గిరిజను చూడకుండా తను వుండడమెట్లా? దీనికి పరిష్కారమేమిటి?ఆమెను పెళ్ళి చేసుకోవడం.... ఇదే పరిష్కార మార్గం. కాని తన తండ్రి ఒప్పుకోడు. అవుతే తండ్రి మంకుపట్టుకి తను బలికావల్సిందేనా? తనకి ఇష్టంలేని అమ్మాయిని తెచ్చి తనకి ముడి పెడుతూ వుంటే, చేతులు ముడుచుకుని కూర్చోవల్సిందేనా? తన ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేదా? తను నిశ్చయంగా గిరిజను పెళ్ళి చేసుకోవాలి. తండ్రిని యెదిరించి అయినాసరే తన మనోభీష్టం నెరవేర్చుకోవాలి. అన్న నిర్ణయానికి వచ్చాడు. కాని అంతలోనే తన చదువు గుర్తుకు వచ్చింది. తండ్రిని యెదిరించి తను స్వతంత్రంగా జీవించగలడా? ఉహూఁ! లాభంలేదు. పరీక్షలయిపోయేవరకూ తటస్థంగా ఊరుకోవడం ఉత్తమం.... అనుకున్నాడు. అదే ఆఖరి నిర్ణయంగా పరిగణించాడు.

ఈ నిర్ణయం తర్వాత ఆనందరావులో చాలా మార్పు వచ్చింది. పట్టుదలతో చదవడం ప్రారంభించాడు. ఎవరితోనూ మనసిచ్చి మాట్లాడడు. ముభావంగా తిరుగుతున్నాడు. తీరిక సమయాల్లో ఏదో ఆలోచిస్తూ వుంటాడు.

కొడుకులో వచ్చిన పరిణామం ముకుందరావుని సంతోషబర్చింది. అతనికి తెలీదు ఆ పరిణామంలోని అంతరార్థం ఏమిటో! అతను అనుకున్నదంతా కొడుకు ప్రేమకలాపం కట్టిపెట్టి బుద్ధిమంతుడయ్యాడని. కాని వరలక్ష్మికి మాత్రం కొడుకు చూపుతున్న ముభావానికి బాధపడేది. ఓసారి భర్తతో అంది కూడాను.

"వాడి ధోరణి నాకు భయం కలిగిస్తూ వుందండీ!" అని.

ముకుందరావు చిన్నగా నవ్వేశాడు.

"నీ మొహం! భయందేనికి? వాడు వేషాలన్నీ మానుకుని బుద్ధిగా చదువుకుంటున్నాడు. పరీక్షలైన వెంటనే ముహూర్తం నిశ్చయంచేసి వాడిచేత లక్ష్మికి మూడుముళ్ళు వేయించేస్తాం. అంతే! అప్పుడు వాడికింకా మరో ఆలోచనే రావడానికి అవకాశం వుండదు" అన్నాడు.

వరలక్ష్మి ఆ సమయంలో ఇంకేమన్నా అంటే భర్త రౌద్రరూపం దాలుస్తాడని భావించి మౌనం వహించింది.

* * * *

ఆనందరావు పరీక్షలు మరో పదిరోజులున్నాయి. పట్టుదలతో చదువుతున్నాడు. అప్పుడప్పుడు అతనికి గిరిజ జ్ఞాపకమొచ్చేది. కాని తమాయించుకునేవాడు. ఆమెను చూసి మూడు నెలలు దాటిందని అతనికి తెలుసు. అయినాసరే తన మనోనిగ్రహాన్ని పిడికిట్లో పెట్టుకున్నాడు. అతనికి ఒక్క అనుమానం తోచింది. తన మనసులో దాగివున్న భావం యెవరికి తెలీకపోయినా, గిరిజకు మాత్రం తెలియాలి. లేకుంటే తన మీద ఆశ వదులుకొని ఇంకెవర్నయినా వివాహం చేసుకుందుకు సమ్మతిస్తే? తన ప్రయత్నమంతా, పట్టుదలంతా వమ్ముకావల్సిందేనా? తన నిర్ణయం తప్పకుండా గిరిజకు తెలియజెయ్యాలి. ఈ పరిస్థితుల్లో అది

యెంతో అవసరం. ఆమెకుగాని, ఆమె తండ్రికిగాని తనమీద గురి కుదరాలంటే, సద్భావం ఏర్పడాలంటే ఆమెకి తన నిర్ణయం తెలియ జెయ్యడం యెంతో అవసరం అనుకున్నాడు. అనుకున్న వెంటనే లెటర్ పాడ్ తీసి ఓ ఉత్తరం రాశాడు. కవర్లోపెట్టి అంటించేసి పోస్టు చెయ్య డానికి బయలుదేరాడు. అతనికి తెలుసు - ఆ ఉత్తరం గిరిజకు అందు తుందని; శేషాచలం పగలంతా కోర్టుమీదే వుంటాడని అతనికి తెలు సుగా ! ఉత్తరం పోస్టుచేశాక అతని హృదయం కాస్త తృప్తిపడింది.

ఇక గిరిజ విషయం—

ఆమె ఏదో తిరుగుతుందిగానీ, గంపెడు ఆవేదనని గుండెల్లో దాచుకుని తిరుగుతోంది. ఈ మానసిక పరిణామంతో ఆమె కాస్త చిక్కిం దనే చెప్పాలి. ఆనందరావు తనకి భర్తవుతాడన్న ఆశ వదులుకుందిగాని అతని రూపం ఆమె హృదయంలో మాసిపోలేదు. ఎంత ప్రయత్నించినా, అతణ్ణి మర్చిపోవడం ఆమెకు సాధ్యపడలేదు. ఎప్పుడూ ఏదో ఒక పుస్త కం చదువుతూ కూర్చుంటుంది ఆలోచనలకు దూరంగా వుండాలని.

మిగిలిన మరో వ్యక్తి శేషాచలం—

ఈయన ఆరోగ్యం కుదుటపడినా మానసిక రోగం మాత్రం వదిలిపెట్టలేదు. అలాగని యెన్నాళ్ళు కోర్టుకి వెళ్ళకుండా వుంటాడు ? రోజూ కోర్టుకు వెళ్ళి వస్తున్నాడేగాని, అతని ధ్యాసంతా గిరిజ భవిష్యత్తు మీదే వుంటుంది. ఆనందరావుమీద కోపం ముంచుకొచ్చింది. 'పిరికివాడు; తండ్రిని యెదిరించలేనివాడు యెందుకు మొదట ప్రేమించాలి ?' అను కున్నాడు. ఆ కోపంతో గిరిజకు వివాహం యెవరైనా మంచి అబ్బాయిని చూసి చేసెయ్యాలని కూడా అనుకున్నాడు. తను తలుచుకుంటే మంచి హోదాలో వున్నవాణ్ణి అల్లుడిగా చేసుకోగలడు. దాన్లో ఏముంది ? ఓ పాతికవేలు పారేస్తేసరి ! ఎటొచ్చీ అమ్మాయిని ఒప్పించాలి. అదే పెద్ద

సమస్యగా భావించాడు. ఎప్పుడైనా సమయం చూసుకుని కూతురుతో ఈ విషయం సంప్రదించాలని కూడా అనుకున్నాడు.

సరిగ్గా ఇటువంటి సమయంలో ఆనందరావు దగ్గర్నించి గిరిజకు ఉత్తరం వచ్చింది. గిరిజ కవరుచించి ఉత్తరం తీసింది. సంతకం చూసింది. ఆమె శరీరం యెందుకో అప్రయత్నంగా పులకించింది. ఉత్తరం చదువుకుంది.

"ప్రియమైన గిరిజకు —

నే నీ విధంగా సంబోధిస్తున్నందుకు మరోలా భావించకు. నా హృదయ పీఠంలో నీకు యెంతటి వున్నతస్థానం వుందో నీకుగాని, మీ నాన్నగారికిగాని తెలీదు. నే నీ విషయం బాహాటంగా చెప్పుకోవడంకూడా నా సంతృప్తికే అనుకో! గత మూడు నెలలలో నిన్ను యెన్నోసార్లు చూడాలని హృదయం తహతహలాడింది. కాని మీ నాన్నగారి మాటలు గుర్తుకువచ్చాయి ప్రతిసారీను. ఆ కోరికను బలవంతంగా ఆపుకున్నాను. కాని. నీ రూపుమాత్రం నా కళ్ళల్లో ప్రతిఫలిస్తూనే వుంది ఈ జన్మలో యెప్పటికైనా నిన్నే వివాహం చేసుకోవాలని నా అభిమతం. నా అభిమతం నెరవేర్చుకుందుకు సర్వవిధాలా ప్రయత్నిస్తున్నాను. విధి యెంతవరకూ నాకు సహకరిస్తుందో చెప్పలేను. నా కార్యసాధనకు కొద్దిరోజులు గడువిమ్మని అర్థిస్తున్నాను. ప్రస్తుతానికి ఇంతే!

ఎప్పటికైనా నీవాడు
ఆనంద్"

గిరిజ ఉత్తరాన్ని మరోసారి చదువుకుని వికసిత వదనంతో ఆ ఉత్తరాన్ని హృదయానికి హత్తుకుంది. ఆమెలో మోడువారిన ఆశలు మళ్ళీ చివురించాయి. ఉత్తరాన్ని కవర్లోపెట్టి భద్రంగా తీసుకువెళ్ళి తన

సూట్ కేసులో దాచుకుంది. ఈ ఉత్తరం తండ్రికి చూపించడమా, మానడమా అన్న సమస్య పట్టుకుందామెకి. అవసరం వచ్చినప్పుడే చూపించవచ్చు ననుకుంది.

వారంరోజులు గడిచాయి. శేషాచలం ఆనాటి రాత్రి భోజనాలయ్యాక కూతుర్ని ఆప్యాయంగా పిల్చి. తనకి యెదురుగా కూర్చోబెట్టుకున్నాడు.

"అమ్మాయ్,నీతో ఓ ముఖ్యవిషయం మాట్లాడాలనుకుంటున్నాను" అన్నాడు.

"చెప్పండి నాన్నా !" మొహం దించుకుని అంది.

"మరేమీ లేదమ్మా ! నేను చూస్తే రోజుకి రోజూ నీరసించిపోతున్నాను. ఎప్పుడు యెలా వుంటుందో యెవరమూ చెప్పలేం. నా కళ్ళారా నీ వివాహం చూడాలని నా వాంఛ. మీ అమ్మకు కూడా నేను ఇదే వాగ్దానమిచ్చాను. నీ కోసం సంబంధాలు చూడాలని వుంది. జగన్నాథం బాబాయి కూడా ఈమాటే అంటున్నాడు. ఆనందరావు విషయం ఏనాడో తేలిపోయింది గాబట్టి, ఏదో ఒహ సంబంధం చూడ్డం అవసరం కదా ! నీకు నచ్చిన అబ్బాయినే చేసుకుందువుగాని....నువ్వు 'ఊఁ' అంటే నేను సంబంధాలు చూస్తాను" అన్నాడు.

తనపట్ల తండ్రికిగల ప్రత్యేకాభిమానానికి మనసులో మురిసిపోయింది. ఆనందరావు ఉత్తరం వ్రాసిన వైనం ఇప్పుడు చెప్పక తప్పదనుకుంది. అనుకోవడమే తడవుగా వివరంగా చెప్పింది కూడాను.

శేషాచలం విస్తుపోయాడు. ఆనందరావు ఇంక గిరిజను మర్చిపోలేదంటే, అతడిలో గిరిజపట్ల యెంత గాఢాభిమానం, అనురాగం వున్నాయో ఊహించుకున్నాడు.

"ఏదమ్మా ఆ ఉత్తరం !" అన్నాడు.

గిరిజ రెట్టించిన ఉత్సాహంతో తన గదిలోకి ఒక్క అంగలోనే పోయి ఉత్తరాన్ని తెచ్చి ఇచ్చింది.

శేషాచలం ఉత్తరాన్ని సాంతం చదివాడు. అతని హృదయం ఆనందంతో నిండిపోయింది. ఇదంతా భగవంతుని లీలనుకున్నాడు.

"ఆరోజు నేను చెప్పాను కదమ్మాయ్! అనురాగమన్నది వుంటే, అతనే మారుతాడని! అలాగే జరుగుతోంది చూడు. అతడి ప్రియత్నం ఫలించాలనే మనం భగవంతుని ప్రార్థించుదాం. ఈమధ్య నువ్వు ఉత్సాహంగా కనిపిస్తూవుంటే ఏమిటి విశేషమా అని యోచించాను. ఇదన్న మాట రహస్యం" మందహాసంతో అన్నాడు. "ఐవుతే నువ్వు జవాబిచ్చావేమిటి?" మళ్ళీ అడిగాడు.

"లేదు నాన్నా! ఆయన అడ్రెసు ఇవ్వలేదు. ఇచ్చినా నేను జవాబు వ్రాయను" అందామె.

"వయస్సులో చిన్నవాడైనా అభిమానధనుడే సుమా! ఆరోజు నుండి మనింటి ఛాయలకు రావడం మానుకున్నాడు. చూశావా, ఆరోజు నేనా విధంగా మందలించకపోతే అతడిలో మార్పు వస్తుందని నేను నమ్మను" అన్నాడు శేషాచలం.

తండ్రి చెప్పింది సత్యానికి దూరం కాదనుకుంది గిరిజ. జవాబు ఏమీ చెప్పలేదు.

"సంబంధాలకోసం కాళ్ళరిగించుకునే బాధ నాకు తప్పినట్టే వస్తుతానికి" నవ్వుతూ అన్నాడు.

గిరిజ మొహం అప్రియత్నంగా సిగ్గుతో యెర్రబడింది. అక్కణ్ణుంచి మెల్లిగా జారుకుంది.

"పిచ్చిపిల్ల" అనుకుని తృప్తిగా నవ్వుకున్నాడు శేషాచలం. చాలా రోజుల తర్వాత అతను తృప్తిగా నవ్వింది ఆరోజే!

13

ఆనందరావు పరీక్షలు పూర్తయ్యాయి. సహజంగా తెలివైనవాడు కావడం, దానికి తోడుగా పట్టుదలతో చదవడం మూలాన్న పరీక్షలు బాగానే రాశాడు. ఇక తనకి స్వతంత్రంగా జీవించగలిగే తాహతు, అవకాశం వచ్చేశాయనుకున్నాడు. తన కార్యక్రమం యెలా ప్రారంభించడమో అర్థంకాలేదు. తండ్రితో యెలా తగువు తెచ్చుకోవడం? ఏదో విధంగా అభిప్రాయబేధాలు వస్తే తప్పించి, తన అక్కసు వెళ్లగ్రక్కలేదు. అదే యెట్లా? అని ఆలోచించాడు. తను పరీక్షలు బాగా వ్రాసినట్టు గిరిజకు మరో ఉత్తరం రాయాలనుకున్నాడుగాని, అది ప్రస్తుతం అనవసరమనిపించింది.

ఆనందరావు పరీక్షలు ముగిసిన మూడోరోజు ముకుందరావు కొడుకును దగ్గరగా పిల్చాడు.

"ఒరేయ్! మీ అత్తయ్య నిన్ను వాళ్ళూరు పంపమని తెగ రాస్తుంది ఉత్తరాలు. ఎలాగూ నువ్వు తీరిగ్గా వున్నావు కాబట్టి, ఓ పది రోజులపాటు అక్కడ వుండిరా" అన్నాడు ఆజ్ఞ యిస్తున్నట్టుగా.

తను యెదురు చూస్తున్న సమయం ఆసన్నమయ్యిందనుకున్నాడు ఆనందరావు.

"నేను యెక్కడికీ వెళ్ళదల్చుకోలేదు నాన్నా!" అన్నాడు మెల్లగానే.

ముకుందరావు విస్తుపోయి కొడుకు మొహంలోకి చూశాడు.

"పిచ్చిపిచ్చి వేషాలు వెయ్యకురా! పదిరోజులపాటు అక్కడ వుండిరా!" మళ్ళీ అన్నాడు చిరుకోపంతో.

"బలవంతంగా తీసుకుపోయి నన్నక్కడ పడేయండి" వుడుకుమోత్తనంగా అన్నాడు ఆనందరావు. తన కార్యక్రమం ప్రారంభించినందుకు లోలోన సంతోషిస్తూ.

ప్రపంచమంతా ఒక్కసారి తల్లకిందులైనట్టు కనిపించింది ముకుందరావుకి. సూర్యుడు పడమర ఉదయిస్తాడా అన్న అనుమానం కలిగింది. కాదూ మరి! ఆనందరావులో ఈ మార్పేమిటి? వాడు యెప్పుడైనా తన యెదుట పల్లెత్తు మాటయినా ఆడి యెరుగునా? అల్లాంటివాడు ఈ యెదిరింపేమిటి? ఈ ధైర్యం వాడిలో యెలా వచ్చింది? ఇంతవరకూ ఏం చెప్పినా శిరసావహిస్తూ వచ్చాడే! ముకుందరావుకి ఏమీ పాలుపోలేదు. అతని కనుబొమలు ఇంకా ముడివడే వున్నాయి; మొహం పాలిపోయేవుంది.

"ఏమిటా ఆ మాటలు?" అన్నాడు అధికారయుక్తంగా.

"ఔ న్నాన్నా మరి? నాకు యిష్టంలేదని చెప్పిన చోటికి వెళ్ళమని ప్రోత్సహిస్తే మరింకేమనాలి? నేనింతవాణ్ణయ్యాను. చదువుకున్నాను. రేపో మాపో స్వతంత్రంగా సంపాదించే యోగ్యత వస్తుంది. అయినా సరే, నాకు ఏఒక్క విషయంలోనూ స్వాతంత్ర్యం లేదంటే ఏడుపొస్తోంది. ఇంకా నేను చిన్నవాణ్ణేనా?" అని చెప్పుకుపోతుంటే ఆనందరావు పదవాహినికి ముకుందరావు ఆనకట్టలా అడ్డుపడి —

"ఈ మాటలన్నీ స్వతహాగా నువ్వు అంటున్నవేనా అని ఆశ్చర్యపోతున్నానా ఆనంద్! ఎవరు నేర్పుకున్నా రివన్నీను?" అన్నాడు మెల్లగా.

"ఎవరైనా నేర్పేందుకు నేనేం ఒకటో తరగతి చదువుతున్న పిల్లాణ్ణి కాదు నాన్నగారూ! ప్రతి మనిషిలోనూ స్వతంత్రేచ్ఛ కొంత వుంటుంది. ప్రతి జీవికీ స్వేచ్ఛగా వుండాలని వుంటుంది"

"అవుతే ఇంతకీ ఏ విషయంలో నీ స్వేచ్ఛకి అడ్డు వచ్చానం టావు ?" కాస్త తగ్గాడు ముకుందరావు.

"ఇంతవరకూ మీరు నాకిచ్చిన స్వేచ్ఛ ఏముందసలు ? ఈవేళ విషయమే చూడండి....బలవంతంగా అత్తయ్యగారి ఊరు పంపాలని ప్రయత్నించారు....ఆమధ్య నా పెళ్ళి విషయం మాట్లాడాలని ఆ జగన్నాధంగారు వస్తే ఆయన్ని నిస్పృహతో పంపారు....ఇవన్నీ మీరు నాకిచ్చిన స్వేచ్ఛకి చిహ్నాలా చెప్పండి ?" సూటిగా ప్రశ్నించాడు ఆనందరావు.

ముకుందరావు అదోలా తల పంకించాడు. "అదా నీ కోపానికి కారణం ? ఆ శేషాచలమే స్వార్థంతో నిన్ను రెచ్చగొట్టి రంగంలోకి దింపాడన్నమాట ?" అన్నాడు కసిగా.

"మీ అభిప్రాయం తప్పు నాన్నగారూ ! పాపం, ఆయన యే పాపమూ యెరుగడు. పైగా నేను అప్పుడప్పుడూ వెళ్తుంటే రావద్దని నిష్కర్షగా చెప్పేశారు కూడాను. ఆయన చాలా నిక్కచ్చి మనిషి.అసలు మీరు గిరిజను చూళ్ళేదు. ఓమారు చూడండి. ఆమె అందం, అణకువ, అభిమానం అన్నీ అర్థంచేసుకుంటే మన లక్ష్మి ఆమె ముందు బలాదూర్ అని తప్పక తెలుసుకుంటారు" అని ఇంక ఏదో అనబోయాడు ఆనంద రావు.

"ఇంకా ఆపవోయ్ ఆ వర్ణన !" గర్జించినట్టుగా అన్నాడు ముకుందరావు కోపంగా. "ఏమైనాసరే, నాకా సంబంధం ఇష్టంలేదు" అని ముగించాడు.

"నాకు ఇష్టపడినా కూడానా ?" యెదురు ప్రశ్న వేశాడు ఆనంద రావు.

"ఔను !" ఆలోచించకుండా అనేశాడు ముకుందరావు.

"అవుతే నాకు స్వాతంత్ర్యం లేదని నిర్ధారణ అయినట్టేగా ?

లక్ష్మిని వివాహం చేసుకోవడం నాకు ఇష్టంలేదు. కనీసం నా పెళ్ళి విషయంలోనైనా అస్వతంత్రుడిగా వుండలేను నాన్నగారూ! క్షమించాలి" అనేశాడు ఆనందరావు వెనుకా ముందూ చూడకుండా.

అంత గంభీరమైన వ్యక్తి ముకుందరావు క్షణంసేపు నిర్విణ్ణుడయ్యాడు.

"అంటే నీ ఉద్దేశం - నా ప్రమేయం, నా అనుమతీ లేకుండానే నువ్వా శేషాచలం కూతుర్ని పెళ్ళి చేసుకుంటావా ?" సూటిగా కొడుకు కళ్ళల్లోకి చూస్తూ అసహనంతోనే అన్నాడు ముకుందరావు.

"మీరు నాకు ఏమాత్రం అవకాశమూ కలిగించకపోతే మరేం చెయ్యను ? అంతకుమించి మార్గం అగుపించలేదు"

"పరిణామం యెలా వుంటుందో ఆలోచించావా ?" పుద్రేకంతో కళ్లెర్రజేస్తూ అన్నాడు ముకుందరావు.

"ఆ మాత్రం ఊహించే పరిజ్ఞానం వుంది నాన్నా ! పొట్ట పోషించుకోడానికి ఈపాటి విద్య చెప్పించారు. అందుకు కృతజ్ఞుణ్ణి"

"అలా చెప్పించాననేగా నీ కీ పొగరు ?"

"కాదు; మీరు అపార్థం చేసుకుంటున్నారు. మీరు మీ కర్తవ్యాన్ని నెరవేర్చారు. నేనిప్పుడు నా కనీసపు కోర్కెను కోరుకుంటున్నాను. కాని మీరు నిరాకరిస్తున్నారు. అంటే, నా హక్కుల్ని పొందడానికి పరోక్షంగా నన్ను మీరు ప్రోత్సహిస్తున్నారన్నమాట"

"ఇదే నీ ఆఖరు నిర్ణయమా ?"

"ఔను !"

"ఐతే తక్షణం నా యింటినుండి పో !" గర్జించాడు ముకుందరావు.

ఆనందరావు మారు మాట్లాడకుండా బయటికి నడిచాడు.

ముకుందరావుకి ఏమీ పాలుపోలేదు. తను అనవసరంగా వుద్రేకం తెచ్చుకున్నానేమోననుకున్నాడు. కుర్రాళ్ళు ప్రయోజకు లవ్వనంత వరకే ఈ అజమాయిషీలూ, అనుమతులూను. ప్రయోజకులయ్యాక ఈ ఆధిక్యత పనికిరాదేమోనని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు. పరిస్థితి చేయి జారిపోవడం, నఌగురినోట పడ్డమూ అతనికి ఇష్టంలేదు. అందుకే అతని మనసులో కాస్త మార్పు జనించింది.

"ఒరేయ్....ఎక్కడికి ? ఇలారా ?" అంటూ మళ్ళీ కేకవేశాడు.

ఆనందరావు చప్పున ఆగిపోయాడు.

"అక్కడ నుంచున్నావేమిటి ? ఇలారా !" మళ్ళీ అన్నాడు ముకుందరావు.

ఆనందరావు ఏ విషయంలోనూ తండ్రిమాట కాదనలేదు ఒక్క విషయంలో తప్పించి. అందుకే తిరిగి వచ్చాడు.

"ఎంత దృఢనిశ్చయంతో వున్నావురా ఆనంద్ ? ఇప్పటి నిన్ను చూస్తుంటే నాకు ఆశ్చర్యమేస్తుంది.అయినా ఈ విషయం మిషగా నిన్ను దూరం చేసుకునేంతటి మూర్ఖుణ్ణి కాదులే. నీ అభిమతమే కానీయ్" అన్నాడు.

ఆనందరావు అమాంతంగా తండ్రిని కౌగలించుకోవాలనుకున్నాడు ఆ సంతోష సమయంలో. కాని ధైర్యం చాలిందికాదు. అతని మొహం ప్రఫుల్లమయ్యింది.మనసు వుయ్యాలలూగింది ఉత్సాహంతో.

"మీరు చాలా మంచివారు నాన్నా !" అన్నాడు.

ముకుందరావు చిన్నగా నవ్వేడు.

"ఇప్పుడు నేను మంచివాణ్ణేలే ! సరేగాని, వాళ్ళు మనవాళ్ళేగా ఇంతకీ ?"

"మనవాళ్ళే ! అన్నీ తెలుసుకునే వుంచాను"

ముకుందరావు నిట్టూర్చాడు.

"ఊఁ! సరే! రేపు ఆ శేషాచలాన్ని ఓసారి మనింటికి రమ్మను" అయిష్టంగానే అన్నాడు.

ఆనందరావు ఆనందానికి అవధుల్లేవు. చంద్రలోకంలో స్థావరం ఏర్పర్చుకున్నట్టుగా ఉప్పొంగిపోయాడు.

"ఇప్పుడే వెళ్ళి చెప్పివస్తా" అంటూ బయలుదేరబోయాడు.

"ఇప్పుడే యెందుకురా? రేపే చెప్పుదువుగాన్లే! నీ సమస్యవుతే పరిష్కారమయ్యింది. కాని, నా సమస్య రక్కసిలా యెదురుగా కాచుకూర్చుంది" అన్నాడు ముకుందరావు నిరుత్సాహంగా.

"అదేమిటి నాన్నా?"

"మీ మేనత్తకి ఈ విషయం వెంటనే తెలియజెయ్యడం శ్రేయస్కరం. వాళ్ళమ్మాయికి సలక్షణమైన సంబంధం ఏదో చేసుకుంటారు. వాళ్ళకేం? డబ్బుతో కొనేస్తారు....ఇంకామె నాపై యెన్ని నిష్ఠూరాలు వేస్తుందో!"

"అవుతే వెంటనే ఉత్తరం రాసేయండి" అన్నాడు ఆనందరావు.

వరలక్ష్మి అప్పుడే వస్తూ "ఎక్కడికిరా ఉత్తరం రాయమంటున్నావు?" అంది.

"అత్తయ్యకి"

"ఏం? వెళ్తున్నావా?"

"ఆఁ! వెళ్ళినట్టే" అని వెటకారంగా, చిరుకోపంతో అంటూ విషయమంతా వివరించాడు ముకుందరావు భార్యతో.

"హమ్మయ్య! ఇప్పుడు నిద్రపోరా!" అంది కొడుకుతో వర లక్ష్మి.

"నువ్వుకూడా ఇప్పుడు తృప్తిగా నిద్రపో !" అన్నాడు ముకుంద రావు వెటకారంగా.

వరలక్ష్మి భర్త దెప్పిపొడుపును అర్థంచేసుకుని మూతి బిగించు కుంటూ, మనసులో ఆనందాన్ని పెంచుకుంటూ అక్కడ్డించి వెళ్ళి పోయింది. ముకుందరావు టేబిలు దగ్గరికి వెళ్ళి ఉత్తరం వ్రాయడానికి కూచున్నాడు. ఆనందరావు మెల్లగా అక్కడ్డించి జారుకున్నాడు.

ముకుందరావు ఉత్తరం వ్రాసేముందు కాస్సేపు ఆలోచించాడు. అనతికాలంలో అనుకోకుండా పరిస్థితులు యిట్లా యెదురు తిరిగినందుకు యెవర్నీ నిందించలేక వుసురనుకొని, రెండుచేతుల్తో తలపట్టుకుని, విచారించి ప్రయోజనం ప్రస్తుతం లేదనుకుని మనసు కుదుటపర్చుకుని ఉత్తరం ప్రారంభించాడు.

14

ముకుందరావు గారింటికి వెళ్ళిన శేషాచలం అన్నీ నిర్ణయించుకుని తిన్నగా ఇంటికి తిరిగి వచ్చాడు. ఆరోజు అతనిలో కలిగిన ఉత్సాహమూ, అతను పొందిన ఆనందమూ అతని జీవితంలో ఎప్పుడూ లేవు. ఇంట్లో అడుగు పెడుతూనే "పంతులూ !" అని కేకవేశాడు. ఆ స్వరంలో సంతోషం స్పష్టంగా కనిపించుతోంది.

"ఏం బాబూ !" అనుకుంటూ వచ్చాడు పంతులు.

"అమ్మాయేదోయ్ ?" అంటూ కుర్చీలో కూర్చున్నాడు.

సరిగ్గా అప్పుడే గిరిజ పెరట్లోంచి వచ్చింది.

"ఏం నాన్నా ?" అంది.

"ఆ ! వచ్చావా ? నీకో శుభవార్త. నేను మొదటే చెప్పాను కదమ్మా, ముకుందరావులో యెప్పటికైనా మార్పు వస్తుందని. ఆనంద రావే పరిస్థితుల్ని సానుకూలం చేసుకున్నాడు. చివరికి తండ్రిని యెదిరిం చాల్సి కూడాను. కొడుకు గట్టిపట్టు పట్టడం చూసి మరో మార్గంలేక ఒప్పేసుకున్నాడు. అన్ని మాటలూ జరిగాయి. ఇంక ముహూర్తం నిశ్చ యించడమే తరువాయి. చూశావా, ఆరోజు ఆనందరావుని తిప్పి పంపా నని నువ్వు బాధపడ్డావుగాని, ఆ సంఘటనే వాతావరణాన్ని యింత త్వరగా మార్చింది. ఈరోజు నాకు యెంతో ఆనందంగా వుందమ్మా ! నా కృషి ఫలించింది. నా జీవితం ధన్యమయ్యింది" అంటూ మురిసి పోయాడు శేషాచలం.

తండ్రి ఆనందంలో భాగం పంచుకుంది గిరిజ. కాని ఆమె ఆనం దం బాహ్యంగా వ్యక్తంకాలేదు. మోహం మల్లెపువులా వికసించింది. తను పెళ్ళి కూతురు కాబోతుందని గుర్తుకొచ్చేసరికి అప్రయత్నంగా సిగ్గుదొంతరలు ఆమెను ఆవరించాయి.రాగరంజితమైన మొహాన్ని దించు కుంటూ లోపలికి పోయింది.

శేషాచలం తృప్తిగా నవ్వుతూ ఆనందభాష్పాల్ని ఒత్తుకున్నాడు.

"పంతులూ ! నా త్యాగం ఫలితాన్నిచ్చిందోయ్! అమ్మాయి చాలా అదృష్టవంతురాలు....మంచి కుటుంబంలోకి పోతుంది.భర్త లాయరు... ఇంక ఇంతకంటె అదృష్టం యెవరి కొస్తుంది ?"

"నిజమే బాబూ ! అమ్మాయి మొదట్నుంచీ అదృష్టవంతురాలే ! ఆమెకోసం మీరు చేసిన త్యాగం ఊరికనే పోతుందా ?" అన్నారు పంతులు.

"ఇప్పుడు నా హృదయం ప్రశాంతంగా వుందోయ్ ! సుంద

రమ్మకి నే నిచ్చిన వాగ్దానం నిలబెట్టుకున్నాడు. వాళ్ళమ్మలా కాకుండా జీవితంలో సుఖాలు అనుభవించడానికే పుట్టింది గిరిజ. ఆమెకి ఏలోటూ వుండదింక. సరేగాని, జగన్నాథంని ఓసారి రమ్మను. ఈ సరికి ఇంటికి వచ్చేసి వుంటాడులే"

పంతులు చరచరా బయటికి నడిచాడు.

శేషాచలం సాలోచనగా కుర్చీలో చేరబడ్డాడు. అతని మస్తిష్కంలో గడిచిన జీవితంలోని సంఘటనలు ఒక్కొక్కటి మెదులుతున్నాయి. ఆర్థికంగా తనకి ఏలోటూ లేకపోయినా, మానసికంగా యెన్నోసార్లు బాధపడ్డాడు. అవన్నీ తల్చుకుంటుంటే అతని కళ్ళు చెమ్మగిల్లాయి. తను వృద్ధుడయ్యాడు. కనీసం ఈ చివరి రోజుల్లోనయినా గిరిజ విషయంలో ఈ విధమైన సానుకూలత ఏర్పడ్డందుకు భగవంతుని యెన్నోవిధాల పొగిడాడు మనసులో.

జగన్నాధం ప్రవేశించాడు అప్పుడే. శేషాచలం చెమ్మగిల్లిన కళ్ళను ఒత్తుకున్నాడు.

"అదేమిటాప్రి, కళ్ళు ఒత్తుకుంటున్నావు?" ఆశ్చర్యంగా అడిగాడు జగన్నాధం.

"అబ్బే! అవి ఆనందభాష్పాలు....కూచో" అన్నాడు మందహాసంతో.

"ఉన్నపాటున రమ్మన్నావట. ఏమిటి విశేషం?"

"ఈవేళ సాయంత్రం కొట్టునుండి వేగిరం బయలుదేరానా? తోవలో ఆనందరావు కన్పించి వాళ్ళ నాన్న రమ్మన్నట్టు చెప్పాడు. రమ్మన్న తర్వాత వెళ్ళకపోతే బావుండదని వెళ్ళాను. మర్యాదగా ఆహ్వానించాడు. వాళ్ళబ్బాయి గిరిజను పెళ్ళి చేసుకోవడానికి ఒకేకాలుమీద కూచోవడంవల్ల ఈ వివాహానికి ఒప్పుకోక తప్పడంలేదని తన సమ్మతిని

వెల్లడించాడు. కట్నాలూ, కానుకలూ, లాంఛనాలూ అన్నీ పదివేలవరకూ ఇస్తానని ఒప్పేసుకున్నాను. ఆయన కిక్కురుమనలేదంటే నమ్మ. అన్నీ నిశ్చయమైనట్టే! ముహూర్తం నిశ్చయించడమే తరవాయి" ఆనందాం బుధిలో తేల్తూ చెప్పాడు శేషాచలం.

"భేష్! చివరికి మనదే విజయమయ్యిందన్నమాట. నేను ప్రథమంలోనే చెప్పానుగా, అబ్బాయి పట్టుదలమీద ఆధారపడి వుందని. ఎలాగైనా అబ్బాయి గట్టివాడే సుమా! నిజంగా గిరిజ చాలా అదృష్ట వంతురాలు"

"అదే నేనూ అనుకుంటున్నాను. నా కృషి ఫలించింది. అదే నాకు ఆనందం. ఆఁ! ఒక్కమాట....ఈ పెళ్ళి భారమంతా నీమీదే వేస్తున్నాను. ఏదో భగవంతుని అనుగ్రహంవల్ల నిర్విఘ్నంగా ఈ వివాహం జరిగిపోతే జీవితంలో నాకింకే చింతా వుండదు"

అప్పుడే గిరిజ లోపల్నుంచి వచ్చి జగన్నాథంన్ని చూసి—

"నమస్కారం బాబాయ్!" అంది.

జగన్నాథం ఆమెకేసి చూసి చిరునవ్వు నవ్వేడు. "ఏం పెళ్ళి కూతురా, ఈరోజు మాంచి ఉత్సాహంగా వున్నావే? పోనీలే. నువ్వు కోరినవాడే దొరికాడు" అన్నాడు నవ్వుతూ.

"పో మావయ్యా!" అంటూ సిగ్గు ముంచుకొస్తుంటే లోపలికి మళ్ళీ తుర్రుమంది.

జగన్నాథం ఫకాల్న నవ్వేడు. శేషాచలం అతని నవ్వులో తన నవ్వూ మిళితం చేశాడు.

* * *

గిరిజ, ఆనందరావుల వివాహం వైభవంగా జరిగింది. ఒక్క

ముకుందరావు తప్పించి,అందరూ అమితానందంతో ఉప్పొంగిపోయారు. 'తన మాట నెగ్గింది' కాదన్న బాధ ముకుందరావులో ఇంకా మాసిపోలేదు. అయినా పరిస్థితులకు తలఒగ్గక తప్పిందికాదు.

గిరిజ అత్తారింటికి వెళ్ళిపోయింది. తనని యెంతో గారాబంతో పెంచి పెద్దచేసిన తండ్రిని వదిలి వెళ్ళిపోతున్న క్షణం గిరిజ కంటికి, మంటికి ఏకధారగా ఏడ్చింది. శేషాచలం ఏడవలేక ఆవేదనంతా అంతరాళంలో గుప్తపర్చుకుని కూతుర్ని ఆశీర్వదించాడు.

ఆమె వెళ్ళిపోయిన నాటి రాత్రి శేషాచలంకి భోజనం సహించలేదు. ఏదో యెంగిలిపడ్డాననుకుని లేచిపోయాడు. వాలుకుర్చీలో చేరబడి శూన్యంలోకి చూస్తూ ఆలోచనలు సాగిస్తున్నాడు.ఆరోజు అతనికియెంతో ఆనందంగా వున్నా యిన్నేళ్ళుగా యింట్లో మసలిన కూతురు పరాయి యింటికి వెళ్ళిపోయినందుకు బాధగావుంది. అయినా ఆడపిల్ల యెన్నాళ్ళు తనయింట్లో వుంటుంది ? ఎప్పుడో ఓసారి అత్తారింటికి వెళ్ళాల్సిందేగా అనుకుని తృప్తి పడ్డాడు.

"పంతులూ !" మెల్లగా కేకవేశాడు.

"ఏంబాబూ !" .అనుకుంటున్నాడు పంతులు. అతను ఆరోజు నిరుత్సాహంగానే కనిపించాడు. చిన్నప్పట్నించీ గిరిజను యెత్తుకుని ఆడించిన వాత్సల్యం అతణ్ణి బాధపెట్టింది.

"అమ్మాయి లేకపోవడం, యిల్లు యెంత చిన్నబోయిందో గమనించావా ?" అన్నాడు శేషాచలం.

"నిజమే బాబూ ! అమ్మాయిగారు వున్నప్పుడు యిల్లు కళకళలాడుతూ వుండేది"

"పోనీలే పంతులూ! నా మనసులో వున్నట్లుగా అంతా సవ్యంగానేజరిగింది. మంచి సంబంధం దొరికింది. వాళ్ళమ్మకి నేనిచ్చిన

వాగ్దానం నెఱవేరింది. నాకు లోపల భయంగానేవుండేదోయ్. అమ్మాయి వివాహం జరక్కముందే నేను ఈలోకం విడిచి పెడతానేమోనని. కాని, భగవంతుడు దయామయుడు. అంతా గిరిజ అదృష్టమే అనుకో !"

"నిజంగా అమ్మాయిగారు అదృష్టవంతురాలు బాబూ ! ఆమె మొహంలోనే లక్ష్మి తాండవిస్తుంది."

"అదృష్టవంతురాలు గాబట్టే రుక్మిణి దగ్గర్నించి బయటపడింది. అక్కడుంటే, యీ సరికి యేమయ్యేదో ! నేనేమయ్యేవాణ్ణో ! అన్నట్టు వివాహానికి వెంకట్రావు రాలేదోయ్." అంటూ ఓసారి వెంకట్రావుని గుర్తు తెచ్చుకున్నాడు శేషాచలం.

"బహుశా వంట్లో బాగా లేదోమో !"

"ఏమోమరి! ఎలాగైనా వయసు మళ్ళిన వాళ్ళుంకదా ! యెప్పుడెలా వుంటుందో చెప్పలేం. వంట్లో బాగుంటే యెప్పుడైనా వస్తాడులే"

అప్పుడే గడియారం పది గంటలు కొట్టింది. "బాబూ ! తమకి యీ మధ్య సరిగ్గా నిద్రలేదు. వెళ్ళి పడుకోండి" అన్నాడు పంతులు.

శేషాచలం అదోలా నవ్వేడు,

"పిచ్చివాడా ! ఈ వేళమాత్రం యెలా నిద్రపడుతుందోయ్ ! క్షణ క్షణానికీ గిరిజే జ్ఞాపకమొస్తోంది. పంతులూ....యిక జీవితంలో మనిద్దరం ఒకరికొకరు తోడుగా వుండాలి...." అన్నాడు నిరాశతో.

ఎంతమాట బాబూ ! నేనెప్పుడూ తమ పాదాలముందే పడి వుంటాను. చల్లగాలి వీస్తోంది. మీరు లోపలికి పదండి".

శేషాచలం భారంగా లేచి లోపలికి పోయాడు.పంతులు వాలుకుర్చీ తీసి లోపలపడేసి, తలుపు గడియ పెట్టాడు. పరిసరాలన్నీ ప్రశాంతంగా వున్నాయ్. గోడగడియారం మాత్రం 'టిక్ టిక్' మంటూవుంది. శేషా

చలం కళ్ళు అప్రయత్నంగా చెమర్చాయి. కళ్ళు ఒత్తుకుంటూ మంచమ్మీద వాలి, గత జీవితాన్నంతా ఓసారి నెమరు వేసుకో ప్రారంభించాడు....

గోడ గడియారం 'టిక్ టిక్' మంటోంది.

పంచాయతీ గ్రంథాలయం.
తెల్లప్రోలు :: కృష్ణా జిల్లా.

—• సమాప్తం •—

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA110B160
పుస్తకం పేరు	త్యాగం ఫలం
తారీఖు	26/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	127
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	2,4,
లేని పేజీలు	NO
తయారు చేసినది	Haseena
పేజీలు విడదీసినది	Haseena
స్కాన్ చేసినది	Heena
పరీక్ష చేసినది	ROHITH
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good